ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక మండలి
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య
శ్రీమతి లక్ష్మీరాజగోపాల్

సంపుటి 18 - సంచిక 06
**నవంబర్ 2013**



పత్రిక అందనివారు మరియు
పత్రికకు సూచనలు, సలహాలు
ఇవ్వదలచినవారు ఈ క్రింది
ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు
**040-23700722**
**99491 11175**
**94407 69798**


## విజయ దీపిక

మర్యాద, అనుశాసనాలను పాటించినప్పుడే, శక్తి సాధనతో విజయదీపికలు వెలుగుతాయి. శక్తి సాధన ఎంతో గొప్పది, కానీ శక్తి సాధనకన్నా ముఖ్యమైనది అందులో మర్యాద, నియమాల సమన్వయం. రావణుడు కూడా శక్తిని ఉపాసించాడు. ఆ ఆరాధన వల్ల అతనికి ఎన్నో వరాలు లభించాయి. ఆ శక్తులతో అతను దేవదానవులను, మనుష్యులను అందరినీ జయించాడు. ఒకప్పటి పరమతపస్వీ రావణుడు, అతని విజయోన్మాదం వల్ల అనాచారుడిగా, తీవ్రవాదిగా, స్త్రీలను అపహరించేవాడిగా మారిపోయాడు.

అనన్య శక్తిసాగరుడు, యుగావతారుడు అయిన శ్రీరాముడు ఆ సమయంలోనే అవతరించాడు. శక్తి సాధన మరియు నియమపాలనల సమన్వయంతో మర్యాదా పురుషోత్తమునిగా కీర్తికెక్కాడు. అజేయుడని పేరు మోసిన రావణుని తీవ్రవాదాన్ని, అనాచారాన్ని సవాలు చేసాడు. మహాయుద్ధంలోని చివరి చరణంలో శారదీయ నవరాత్రుల సందర్భంగా రావణుడు మహాశక్తిని ఆరాధించాడు. శ్రీరాముడు కూడా ఈ శారదీయ నవరాత్రుల్లోనే జగన్మాతను ఆరాధించాడు. తన ఇద్దరి ఆరాధకులను చూసిన ఆదిశక్తి మర్యాదలకే విజయోస్తు అంటూ వరమిచ్చింది.

మర్యాదలకు విజయం అనే వరం లభిస్తూనే రావణుడు బలహీనుడయ్యాడు, శ్రీరాముడు మహాబలశాలిగా మారాడు. అందరి హితం కోసం, అందరి సుఖం కోసం మర్యాదా పురుషోత్తముడైన రాముడు పద్నాలుగు సంవత్సరాలు నిరంతరం తపించాడు. అప్పుడే జనావళి సమస్తం ఆయన విజయాన్ని పురస్కరించుకుని దీపాలు వెలిగించింది. దీపమాలలను అలంకరించారు. దీపావళి జరుపుకున్నారు.

*- అఖండజ్యోతి, అక్టోబరు 2006*

*అనువాదం: శ్రీ ఎం.వి.ప్రసాద్, జయలక్ష్మి*

**కోరరాని కోరికలు అనర్థదాయకం**

## విషయ సూచిక


1. **సంపాదకీయం :** విజయ దీపిక — 1
2. **విషయసూచిక-సద్గురు వాణి :** అనైతిక సంపాదన దుష్ప్రవృత్తులను పెంచుతుంది — 2
3. **వేదమంత్రం :** దేశ రక్షణ-2 — 3
4. **గాయత్రీ విద్య - 38 :** విజ్ఞానమయకోశం యొక్క వాయు సాధన-1 — 4
5. **గాయత్రీ చిత్రావళి - 17 :** ఐశ్వర్యవర్ధిని లక్ష్మి — 5
6. **బాలల భవితకు బంగారుబాట - 37 :** నిలబడి నీళ్ళు త్రాగడమే మేలు — 6
7. **పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర - 17 :** సిద్ధి మార్గం - 1 — 7
8. **దీపావళి ప్రత్యేకం :** అందరి పండుగ - దీపావళి — 12
9. **మస్తిష్కమే కల్పవృక్షం - 10 :** సుఖదుఃఖాలు మానసిక స్థితిపై ఆధారపడి ఉంటాయి — 15
10. **యుగనిర్మాణ యోజన :** మహాకాలుని గీత-సత్సంకల్పాలు - 10 — 18
11. **కుండలినీ మహావిజ్ఞానం-3 :** కుండలినీ సాధనతో ప్రాణాగ్ని ప్రజ్వలన — 20
12. **ఫ్లయింగ్ సాసర్స్ :** అన్యగ్రహ జీవులు పృథ్వి మీదకు రాక — 24
13. **కుటుంబ నిర్మాణం :** కుటుంబానికి మూలం - దాంపత్య జీవితం — 26
14. **సమాజ నిర్మాణం :** సభ్య సమాజం యొక్క స్వరూపం, దాని ఆధారం — 29
15. **మనం - మన ఆరోగ్యం :** ఆరోగ్యంగా ఉండటానికి ముఖ్యమైన సిద్ధాంతములు-2 — 32
16. **జీవించేకళ :** ఇచ్చేవారు ఎప్పుడూ నష్టపోరు — 35
17. **పూజ్య గురుదేవుల అమృతవాణి :** యుగపరివర్తనలో మన బాధ్యత - 1 — 36
18. **నా వారితో నా మాట :** నవనిర్మాణానికి మూలాధారం — 39
19. **ధారావాహిక ప్రశ్నోపనిషద్ - సప్తమ అధ్యాయం (మొదటి ప్రకరణం) :** యుగాంతరీయ చేతన - లీల సందోహ ప్రకరణం — 42
20. **నరసింహ శతకం-నవనీత సూక్తం - 4** — 43
21. **అందరికి సుఖము-శాంతి-సమృద్ధి కొరకు సామూహిక గాయత్రీ జపం** — 45
22. **వార్తలు :** రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు — 46
23. **సికింద్రాబాదు పాతబోయినపల్లిలోని గాయత్రీ జ్ఞానమందిర ప్రారంభ వేడుకలపై నివేదిక** — 47




## సద్గురు వాణి

### అనైతిక సంపాదన దుష్ప్రవృత్తులను పెంచుతుంది

వ్యాపారమే కాదు జీవితంలోని ప్రతి క్షేత్రము కఠోరశ్రమ, నమ్మకం, విశ్వాసములపై ఆధారపడి ఉంటుంది. మోసం చేసి కూడబెట్టిన డబ్బు ఎక్కువ రోజులు నిలవదు, ఆ సంపద భవిష్యత్తులో అనేక సమస్యలకు దారితీస్తుంది. దొంగలు, దోపిడి చేసేవారు, జూదగాళ్ళు గొప్ప సంపత్తిని తక్కువ సమయంలోనే దొరక పుచ్చుకోవచ్చు. కానీ ఈ సొత్తు సదుపయోగపడదు; విచ్చలవిడిగా ఖర్చుపెట్టడం, చెడు అలవాట్లకు దారితీస్తుంది. వీరి పిల్లలు బద్ధకస్తులుగా, సోమరులుగా, దురభ్యాసాలతో పనికిమాలినవారుగా తయారవుతారు.

---


## యుగశక్తి గాయత్రి

**చందా రుసుమును ఆన్‌లైన్ ద్వారా పంపించండి.**

బ్యాంకు పేరు: **ఎస్.బి.ఐ., ఎర్రగడ్డ శాఖ**

ఖాతాపేరు : **శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు**

ఖాతానెం. : **32506416087**

IFSC Code : **SBIN-0013272**

అట్లే మని ఆర్డరు ద్వారా కాని, బ్యాంకు డ్రాఫ్టు ద్వారా కాని చందా రుసుమును పంపవచ్చు. ఆన్‌లైన్ ద్వారా పంపునప్పుడు బ్యాంక్ కమీషన్ క్రింద రూ. 20/- చందాకు అదనంగా పంప ప్రార్థన. ఆన్‌లైన్‌లో పంపినప్పుడు బ్యాంకు చలాన జిరాక్సు కాపీని మీ చిరునామాను (పిన్‌కోడ్‌తో సహా) తెలుపుతూ మాకు తప్పక పంపించండి.

**"శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు"**

**గాయత్రీ చేతనా కేంద్రము**, హెచ్.పి. రోడ్, మూసాపేట

అశ్విని హౌస్ దగ్గర, హైదరాబాదు - 500 018.

ఫోన్: 040-23700722, సెల్: 9949111175

| | |
|---|---|
| **విడి ప్రతి రూ॥ 12/-** | **3 సం॥ చందా రూ॥ 350/-** |
| **సం॥ చందా రూ॥ 120/-** | **10 సం॥ చందా రూ॥ 1116/-** |


**ఇతరులకు నీతులు చెప్పడం కాదు, అవి మన ఆచరణలో కనిపించాలి**

వేద మంత్రం

# దేశ రక్షణ-2

**యస్యాం పూర్వే పూర్వజనా విచక్రిరే ।**
**యస్యాం దేవా అసురానభ్యవర్తయన్ ।**
**గవా మశ్వానాం వయసశ్చ విష్ఠా**
**భగం వర్చః పృథివీ నో దధాతు ॥**
**(అథర్వవేద 12/1/15)**

**భావార్థం :** ఏ దేశాన్ని మన పూర్వులు రూపొందించి, దుష్టుల నుండి రక్షించారో, దాని భవ్యతకు మనము త్యాగము, బలిదానమునకు సిద్ధం కావాలి.

**సందేశం:** దేశమంటే కేవలం సరిహద్దుల మధ్య ఉన్న భూభాగం మాత్రమే కాదు. ఆ భూమితోపాటు, అక్కడ నివసించే పౌరుల శారీరిక, బౌద్ధిక, ఆధ్యాత్మిక స్థాయి, శీలము, ఆచరణ, వ్యవహారములన్నింటి సమగ్రత యొక్క రూపము. వ్యక్తుల జ్ఞాన, భక్తి, కర్మయోగముల చేత ఉత్పన్నమైన పాపపుణ్యముల ప్రవాహము యొక్క స్థితి. సమాజంలో ఉన్న సత్ప్రవృత్తుల, దుష్ప్రవృత్తుల దర్పణంలో దేశం యొక్క ప్రతిబింబం కనిపిస్తూ ఉంటుంది.

బయటి శత్రువుల నుండి, లోపలి దుష్టుల నుండి, సమాజ వ్యతిరేక శక్తుల నుండి దేశాన్ని రక్షించుటకు ఎల్లవేళలా ముందుకు సాగాలి. భగవానుడు ఆయా సమయాలలో దుష్ట శిక్షణకు శిష్ట రక్షణకు అవతరిస్తుంటాడు. ఆయన ఏకైక లక్ష్యము పాపులను నాశనము చేయుట, పుణ్యాత్ములను ఉద్ధరించుట. దీనికోసం జ్ఞానము, కర్మ, భక్తి మూడింటి రహస్యం తెలుసుకొనుట ఆవశ్యకం. జీవితాన్ని గురించిన ఎరుకయే జ్ఞానము. ఇతిహాసము, భూగోళము, గణితం మొదలైనవి చదువుటను విద్య అని అంటాము, కానీ జీవిత లక్ష్యాన్ని తెలియజేసేదే ఆధ్యాత్మిక జ్ఞానం. నేను ఏమిటి? ఎక్కడ నుండి వచ్చాను? నా లక్ష్యం ఏమిటి? ఆధ్యాత్మికజ్ఞానం ఈ విషయాలన్నింటిని బోధపరుస్తుంది. ప్రాప్తించుకొన్న జ్ఞానాన్ని జీవితంలో ఆచరించుట కర్మ. మనకు గీత, భాగవతం, రామాయణం తెలుసు కానీ ఆ జ్ఞానమును మనము ఉపయోగించుట లేదు. దానిని కర్మలోకి మార్చాలి. మన లోపలి దోషాలను, దుర్గుణాలను, కషాయ కల్మషాలను బయటకు పంపినప్పుడే భగవంతుని కృప ప్రాప్తిస్తుంది. **జ్ఞాన, కర్మల సమన్వయ రూపమును జీవితంలో ఆచరించుటయే నిజమైన భక్తి, కేవలం కర్మ కాండలతో చేసే పూజా పునస్కారములను భక్తి అని అనలేము.**

దేశరక్షణకు లోపలి, బయటి శత్రువులతో తలపడవలసి వస్తుంది. మహాభారత యుద్ధ సమయంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి ఎంతో స్పష్టంగా సారగర్భితంగా గీతోపదేశం చేశాడు. నేటికి కూడా ఆ పవిత్ర గీత ప్రపంచంలో ప్రకాశ స్థంభం (లైట్‌హౌస్) వలె అందరికీ మార్గదర్శనం చేస్తున్నది. బంధువులు, తోడబుట్టినవారు కూడా దేశానికంటే మించిన వారు కాదు. దేశరక్షణకు ఒకవేళ వారిని వదులుకోవలసి వచ్చినా అది కూడా ధర్మానుకూలమే. త్యాగము, బలిదానము యొక్క ఈ ఉత్కృష్ట భావనాబలం చేతనే మనుష్యుడు తన స్వార్థభావనపై విజయం పొంది పూర్తి మనస్సుతో దేశరక్షణ అనే మహత్తరమైన కార్యము పూర్తి చేయగలడు.

మన మనస్సులలో దేశరక్షణ కొరకు త్యాగము, బలిదాన భావన ఉండాలి. మాయ, మోహం, మమకారం వదలివేయాలి. స్వార్థాన్ని బలి ఇవ్వాలి. మనం ఎప్పుడైతే దేశహితం సర్వోన్నత మైనదిగా భావించి మన హితాన్ని ప్రసన్నపూర్వకంగా వదలి వేయుటలో తత్పరులమవుతామో అప్పుడే సమాజఋణం నుండి విముక్తులమవగలం.

పౌరులలో ఈ భావనను ప్రతిష్ఠించుటయే విద్వాంసుల కర్తవ్యము.

★★★

## పండుగలు

**నవంబర్ 2013**

03-11-2013 దీపావళి

**డిశంబర్ 2013**

13-12-2013 గీతా జయంతి

16-12-2013 దత్తాత్రేయ జయంతి

25-12-2013 క్రిస్మస్

**అన్నదానం - ఒక పూట కడుపు నింపుతుంది**



గాయత్రీ విద్య-38

# విజ్ఞానమయకోశం యొక్క వాయు సాధన-1

గాయత్రీ పంచకోశ సాధనలో మనోమయ సాధన తరువాత విజ్ఞానమయ కోశ సాధన వస్తుంది. దాని వివరణ ఇలా ఉంటుంది.

1. ప్రశాంత వాతావరణంలో వెన్నెముక నిటారుగా ఉంచి కూర్చోవాలి. నాభి చక్రంలో శుభ జ్యోతి మండలం యొక్క ధ్యానం చేయాలి. ఆ జ్యోతికేంద్రమందు సముద్రం యొక్క ఆటుపోటుల వలె తరంగాలు లేచి పడటం కనిపిస్తుంది.

2. ఎడమ స్వరం నడుస్తుంటే నాభియందలి జ్యోతి కేంద్రం చంద్రునితో సమానమైన కాంతితో పసుపుపచ్చగా ఉంటుంది. నాభి ఎడమ భాగం నుంచి బయలుదేరే ఇడానాడిలో కలసి శ్వాస ప్రవాహం మొదలవుతుంది. ఇడా నాడి నాభి క్రిందవైపు మూలాధార చక్రం (గుద, లింగం మధ్యభాగం) మేరు దండంలో నుంచి మస్తిష్కం యొక్క పై భాగం యొక్క పరిక్రమ (ప్రదక్షిణ) చేసి ముక్కు యొక్క ఎడమ నాశికలోకి వెళ్తుంది. నాభి కేంద్రం యొక్క ఎడమ భాగం యొక్క క్రియాశీలత వలన ఈ నాడి పనిచేస్తుంది. ఈ తథ్యమును భావన యొక్క దివ్య నేత్రముల ద్వారా చక్కగా చిత్రంవలె చూడగలగాలి.

3. సూర్య స్వరం నడుస్తున్నట్లయితే నాభి కేంద్రం యొక్క జ్యోతి మండలం సూర్యునితో సమానమైన కొంచెం ఎరుపు కలసిన తెలుపు రంగులో ఉంటుంది. దాని కుడి భాగం నుండి బయలుదేరే పింగళా నాడిలో కలసి శ్వాస ప్రశ్వాస క్రియలు జరుగుతాయి. నాభి క్రింద ఉన్న మూలాధారం నుండి మస్తిష్కం వరకు, అక్కడ నుండి కుడి నాశిక వరకు పింగళ నాడి ఉంటుంది. ఇది నాభి చక్ర కుడిభాగంలో చైతన్యవంతమవుతుంది. ఈ సూక్ష్మ క్రియను ధ్యాన శక్తి ద్వారా మనోయోగ పూర్వకంగా స్పష్టంగా చూడవచ్చు.

4. స్వర సంధికాలంలో (స్వరం మారుతున్నప్పుడు) నాభి చక్రం స్థిరమవుతుంది. కదలిక ఉండదు. ఆ సమయంలో వాయువు రాకపోకలు ఉండవు. ఈ సంధికాలంలో మూడవనాడి మేరు దండంలో అత్యంత వేగంతో విద్యుచ్ఛక్తివలె, ఒక క్షణంలో వందో వంతు భాగంలో ఉరుకుతుంది.

5. సుషుమ్న యొక్క విద్యుత్తు ప్రవాహం ఆత్మ యొక్క చంచలమైన ఒక రూపం. ప్రారంభంలో ఇది కొంచెం వెలుగుతో పరుగెడు తుంటుంది. సాధనతో ఈ వెలుగు అధిక ప్రకాశవంతమవుతుంది, అధికకాలం ఉంటుంది. కొన్ని రోజుల తరువాత వర్షాకాలంలో మేఘాల మధ్య మెరిసే మెరుపులవలె విస్తారమవుతుంది. సుషుమ్న జ్యోతిలోని రంగురంగుల తేజము సూటిగా ఉండవచ్చు, వంకర టింకరగా ఉండవచ్చు, వర్తులాకారంగా ఉండవచ్చు. ఇది ఆత్మస్థితిని పరిచయం చేస్తుంది. మూడు గుణములు, పంచతత్వములు, సంస్కారములు, అంతఃకరణ ఎటువంటి స్థితి ఉంటుందో తదను గుణంగా సుషుమ్న రూపం ధ్యానావస్థలో దృష్టి గోచరమవుతుంది.

6. ఇడా పింగళ క్రియలను స్పష్టంగా చూడగలిగిన తర్వాత వాటిని సాక్షిరూపమున దర్శించాలి. నాభి చక్రమందలి ఏ భాగమందు ఆటుపోట్లు కలుగుచున్నవో, దానికి సంబంధించిన స్వరం నడుస్తుంటుంది, కేంద్రములో ఈ ఆధారంపైనే సూర్యుని లేక చంద్రుని రంగు ఉంటుంది. ఒక శ్వాస లోపలికి పూర్తిగా ప్రవేశించి ఎప్పుడు వెనుతిరుగుతుందో దానిని అభ్యంతర సంధ్య అంటారు. శ్వాస పూర్తిగా బయటకు పోయి నూతన శ్వాస ప్రవేశించేముందు బాహ్య సంధ్య అని పిలుస్తారు. ఈ కుంభక కాలమందు సుషుమ్న యొక్క వేగంగా పరుగిడే విద్యుత్తు కాంతి యొక్క అత్యంత ప్రకాశమును దివ్య నేత్రములతో చూడగలరు.

7. ఇడా శ్వాస పింగళా శ్వాసగా మారుతున్నప్పుడు లేదా పింగళా శ్వాస ఇడా శ్వాసగా మారుతున్నప్పుడు అంటే ఒక స్వరం ఇంకొక స్వరంగా పరివర్తన చెందుతున్నప్పుడు సుషుమ్న యొక్క సంధికాలం వస్తుంది. తనంతట తాను స్వరం మారుతున్న సమయంలో స్వాభావిక సుషుమ్నను ప్రాప్తించుకొనుట కష్టమైన పని. అందువలన స్వర విద్యా సాధకులు గతంలో చెప్పబడిన స్వరము మార్చుకొనే ఉపాయాలతో పరివర్తన చేసుకుని సుషుమ్న సంధి కాలంలో ఆత్మజ్యోతి దర్శనం చేసుకుంటారు. ఈ జ్యోతి ప్రారంభంలో చంచలంగా, వివిధ ఆకృతులు కలిగి అంతంలో స్థిరంగా మండలాకారంలో కనుపిస్తుంది. ఈ స్థిరత్వమే విజ్ఞాన మయకోశం యొక్క సాఫల్యం. ఈ స్థితిలోనే ఆత్మ సాక్షాత్కారం జరుగుతుంది.

ప్రాచీన కాలంలో స్వరశక్తి ద్వారా అణిమ, మహిమ మొదలగు సిద్ధులు లభించేవి. విజ్ఞానమయ కోశంలోని విజయం సాధించిన వానిని భూసురుడని, భూ దేవత అని, నరరూపధారియగు దివ్యాత్మ అని అంటారు.

*(సశేషం)*

**కన్యాదానం - ఒక జీవితానికి తోడును ఇస్తుంది**

## గాయత్రీ చిత్రావళి - 17

# ఐశ్వర్యవర్ధిని లక్ష్మి




ప్రపంచములో జీవించుటకు అనేక వస్తువులు అవసరమవుతాయి. ఏ వస్తువులు లేకుండా మనకు గడువదో, వేటి లోటువలన మన జీవన రక్షణకు అడ్డంకి కలుగుతుందో వాటిని సంపత్తి లేదా లక్ష్మి అని అంటారు. అన్నము, వస్త్రము, ఇల్లు, మందులు, పుస్తకాలు మొదలైన వాటి అవసరం ఎలాంటిదంటే, అవి లేకుండా జీవితం గడుపుట కష్టమవుతుంది. ఈ అవసరమైన వస్తువులన్నింటిని రూపాయి రూపంలో దాచుకుంటాము. రూపాయిద్వారా ఎప్పుడు కావాలంటే అప్పుడు ఈ వస్తువులను పొందవచ్చు. ధనము ప్రోగుచేయుటలోని ఉద్దేశ్యం ఇదే.

కష్టపడి పనిచేయుట, మానసిక యోగ్యత, సాధన, పెట్టుబడి, సహకారము, మున్నగువానిపై ఆధారపడి ధనము సంపాదించబడుతుంది. వీటిలో కొన్ని మనుష్యుడు తన ప్రయత్నముతో పురుషార్థముతో సమకూర్చుకొనవచ్చును, కానీ కొన్ని అతని చేతిలో ఉండవు. ప్రయత్నము చేసినంత మాత్రమున అవి లభించకపోవచ్చును. ఒక్కొక్కసారి కొద్దిపాటి ప్రయత్నముతో లేదా అప్రయత్నముగా ఎంతో లాభము వస్తుంది. అనేక సందర్భాలలో తెలివి, పరిశ్రమతోపాటు దైవీ అనుదానం కూడా కావలని ఉంటుంది. ధనికులు నిర్ధనులగుట, నిర్ధనులు ధనికులగుట చూస్తూనే ఉన్నాము. వీని వెనుక ఏదో రహస్య తథ్యము దాగి ఉంటుంది.

గాయత్రి యొక్క 'శ్రీం' శక్తి లక్ష్మి. లక్ష్మీ ద్వారా ఐశ్వర్యము, వైభవము, సంపత్తి, ధనము ప్రాప్తిస్తాయి. ఈ ధనము ఈశ్వరుని పెట్టుబడి. దీని ఉపయోగము భోగము, అహంకారము ప్రోగు చేయుట కొరకు కాక మనుష్య వికాసానికి ఉద్దేశించబడినది. ఒకవేళ మనుష్యుడు దీనిని స్వార్థమునకు వినియోగిస్తే ఆ సంపత్తి అతని నుండి లాగివేయబడుతుంది. గాయత్రీ ఉపాసకుడు సద్బుద్ధితో సంపద తనకు ఎందుకు ఇవ్వబడిందో, ఏ కార్యములకై దానిని ఉపయోగించాలో తెలుసుకొని, దానిని సదుపయోగం చేసి, కొద్దిపాటి ధనంతో కూడా ఎంతో లాభాన్ని పొందుతాడు. దీనిని పెద్ద పెద్ద కోటీశ్వరులు కూడా పొందలేరు.

ఇల్లు, కారు, సంపత్తి, పెట్టెనిండా నగదు ఉన్నవారు ధనవంతులు కాదు. ఎవరు నిజాయితీగా సంపాదించి దానితో సంతృప్తి చెందుతారో వారే నిజమైన ధనవంతులు. **గాయత్రీ ఉపాసకులకు ఎప్పుడూ డబ్బుకు లోటుండదు. కనీస అవసరాలకు ఇబ్బంది ఉండదు.** వారిదగ్గర ఉన్నదానితోనే సంతృప్తిని పొందుతు కుబేరునితో సమానంగా సంతోషాన్ని పొందుతారు. అనేకసార్లు గాయత్రీ ఉపాసకుల వద్ద ఎక్కువగా డబ్బు ప్రోగు పడుట జరిగి సదుపయోగ బుద్ధి కూడా వికసించి ఆ ధనము కూడా ధన్యం అవుతుంది. **గాయత్రీ ఉపాసకుడు అన్నం లేకుండా, వస్త్రం లేకుండా ఉండుట ఎప్పుడూ చూడబడలేదు.**

*- అనువాదం : డా॥ తుమ్మూరి*

**విద్యాదానం - ఒక జీవితాన్ని ఇస్తుంది**

బాలల భవితకు బంగారు బాట-37

# నిలబడి నీళ్ళు త్రాగడమే మేలు



రామాపురం ఒక చిన్నపాటి గ్రామం. ఆ గ్రామంలో సుబ్బయ్యశెట్టి అనే వ్యాపారి ఉన్నాడు. చిన్న కిరాణా దుకాణం పెట్టుకొని వ్యాపారం చేసుకుంటున్నాడు. భార్య గంగ అనుకూలవతి. ముద్దులు మూటగట్టే కూతురు మాధవి. మాధవికి పదేళ్ళు నిండాయి. తిండికి, గుడ్డకి లోటు లేదు. సంసారం ఆనందంగా సాగిపోతోంది. పొదుపుగా ఖర్చుపెడుతూ ఉన్నంతలో కొంత ధనాన్ని కూడబెట్టుకున్నాడు. ఆ ధనాన్ని చూసుకున్న సుబ్బయ్యశెట్టి ఆలోచనల్లో మార్పు రాసాగింది. అతని మనస్సు కోర్కెల వలయంలో చిక్కుకుని గిలగిలలాడుతోంది.

“ఇంత చిన్న ఊళ్ళోనే ఇంత ధనాన్ని కూడబెట్టుకోగలిగాను. ఇంకో పెద్ద గ్రామానికి వెళితే ఇంకా ఇంకా సంపాదించుకోవచ్చు కదా! డబ్బు బాగా సంపాదించి చిన్నారి మాధవిని బాగా చదివించు కోవచ్చు. అందమైన భవనాన్ని నిర్మించుకోవచ్చు. మాధవిని లక్షాధికారికిచ్చి అంగరంగ వైభవంగా వివాహం జరిపించవచ్చు. ఏనాడు ఏదీ నోరు తెరచి అడుగని అర్ధాంగికి కోరిన నగలు, చీరలు కొనిపెట్టవచ్చు. తాను కూడా 10 వ్రేళ్ళకు ఉంగరాలు పెట్టుకుని ఠీవిగా వ్యాపారం చేసుకోవచ్చు. 10 మంది గుమాస్తాలతో నా దుకాణం కళకళలాడాలి. ఒకనాటి సుబ్బయ్య శెట్టి సువర్ణ శెట్టిగా పేరుకెక్కాలి. మెల్లిగా అవకాశం చూసుకుని పట్టణానికి చెక్కేయవచ్చు. పట్టణంలో వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుందని మొన్ననే ఒక మిత్రుడు చెప్పాడు.

ఈ విధంగా అంతులేని కోరికలు గుర్రాలై మనసు నిండా స్వారీ చేయసాగాయి. అంతే ఇక మనసును అదుపుచేయడం సాధ్యం కావడం లేదు. ఇదివరకు ఒకరికింతపెట్టి, తాను తృప్తిగా జీవించేవాడు. డబ్బుమీద కాంక్ష పెరిగిన కొద్దీ ధర్మకార్యాలు నిలిపి వేశాడు. మంచి బేరం వచ్చిందని దుకాణాన్ని అమ్మివేశాడు. వచ్చిన డబ్బంతా దాచుకున్న డబ్బుకు జమచేసుకున్నాడు. ఎవరికి అనుమానం రాకుండా పాతబట్టలో పెట్టి మూటకట్టుకున్నాడు. ఇక్కడ వ్యాపారంలో దివాలా తీశానని, కట్టుబట్టలతో పొరుగూరికి వెళ్ళిపోతున్నాని ప్రచారం చేసుకున్నాడు. ఒక మంచిరోజు చూసుకుని గ్రామాన్ని వదిలి వెళ్ళడానికే నిర్ణయించుకున్నాడు. భార్యను, కుమార్తెను వెంటబెట్టుకుని కాలినడకన పయనం సాగించాడు.

నడుస్తూ ఉంటే త్రోవలో ఒక వాగు అడ్డం వచ్చింది. వాగులో నీరు కొద్దిగానే ఉన్నది. సుబ్బయ్యశెట్టి ధనం మూటను నెత్తిమీద పెట్టుకున్నాడు. భార్యను ఒక చేత్తో, కూతురిని ఒక చేత్తో పట్టుకొని వాగు దాటుతున్నాడు. ఇంతలో అనుకోకుండా వాగులోనికి నీరు పెరిగిపోసాగింది. ధైర్యంగా ముందుకు నడుస్తున్నాడు. నీరు అంతకంతకు పెరిగిపోతోంది. మాధవికి నీళ్ళలో కాళ్ళు నిలవడం లేదు. ఏం చెయ్యాలో తోచక శెట్టి “బిడ్డనే కదా! మళ్ళీ కనిపెంచు కోవచ్చులే” అనుకుని మాధవి చేతిని వదిలేశాడు. కొంతదూరం పోయేసరికి బరువుతో నీళ్ళలో నడక కష్టం అనిపించింది. “భార్యే కదా! మళ్ళీ పెళ్ళిచేసుకోవచ్చు” అనుకుని గంగ చేతిని వదిలేశాడు. నెత్తిమీదున్న డబ్బు మూటను తడిమి చూసుకున్నాడు. “డబ్బుంది కదా! పరవాలేదు” అని సర్దిచెప్పుకున్నాడు. భారంగా నడక సాగించాడు. నీటి ఉరవడి ఇంకా ఇంకా పెరిగిపోసాగింది. మూటను మోసుకుంటూ నడవ లేకపోతున్నాడు. “డబ్బుదేముంది? ఎంతైనా సంపాదించుకోవచ్చు” అనుకుంటూ మూటను నదిలోకి వదిలేశాడు. చివరకు చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు అతి కష్టం మీద ఒడ్డుకు చేరుకున్నాడు. ఒక చెట్టు క్రింద కూర్చుని జరిగిన దానిని నెమరువేసుకున్నాడు. గుండెలు అవిసేలా భోరున విలపించసాగాడు.

దోవనపోయే ఒక సాధువు వచ్చి కారణం అడిగాడు. జరిగిందంతా చెప్పి వెక్కి వెక్కి ఏడ్చాడు. “నాయనా! ఏడవకు. జరిగిన దానికి ఎవ్వరము ఏమీ చేయలేం. భవిష్యత్తుకు మార్గం వేసుకో. అంతా భగవదేచ్ఛ. ఆయన లీలలు ఎవ్వరికీ అర్థం కావు. ఇక నుండి నీ కోసం నువ్వు కాకుండా పదిమంది కోసం జీవించు. ఈ జీవితంలో ఏదీ శాశ్వతం కాదు” అని అర్థమయింది కదా! శాశ్వతుడైన దైవాన్ని ధ్యానించు. ఉన్నదానిలో తృప్తిపడి జీవించాలి. ఉన్నంతలో పరులకు ఉపకారం చేస్తూ రోజులు గడిపివేయాలి. పరుగెత్తి పాలు తాగే దానికన్నా నిలబడి నీళ్ళు త్రాగడం మేలు. ఈ సత్యాన్ని తెలుసుకుంటే ఇన్ని కష్టాలు వచ్చేవి కావు. నాతో వచ్చి నా దగ్గరే ఉండు. ఏం చేయాలో నిర్ణయించు కోవచ్చు” అని ఓదార్చి తనతోపాటు తీసుకుని వెళ్ళాడు.

విన్నారు కదా! బాలలూ! ఎదగడానికి ప్రయత్నించడంలో తప్పులేదు కాని అదే జీవిత లక్ష్యంగా వెంపరలాడడం ఎవ్వరికీ క్షేమం కాదు.

*కం॥ ఎదుగవలెననెడి కోరిక*
*మదిని తొలచివేయుచుండ మానవుడాత్మన్*
*ఇది యది యని యోచించక*
*ఎదియో మార్గంబు పట్టి యేడ్చును బాలా!*

– మధుర కవయిత్రి,
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**మంచి పనిని వాయిదా వెయ్యకు**

## పరమపూజ్య గురుదేవుల సుదీర్ఘయాత్ర-17

# సిద్ధిమార్గం - 1

### కాశీ మహాసభ

1925-26 సంవత్సరాల ప్రాంతంలో భారతదేశంలో విదేశీయుల బానిసత్వం నుండి విముక్తి పొందాలనే ఆకాంక్ష సమాజంలో మొదలయినది. మరోప్రక్క దురాచారాల నుండి, వికృతుల నుండి విమోచన పొందాలని సామూహిక చేతన తహతహలాడుతోంది. వెనుకబడిన వర్గాలకు, దళిత వర్గాలకు దేవాలయంలో ప్రవేశించే అధికారం లేదు, చదువుకునే హక్కు లేదు. వారు ఊరిలోని బావుల నుండి నీళ్ళు తెచ్చుకోవడానికే వీలులేదు. వారు ఉన్నత కులాల వారి సరసన కూర్చోడానికి వీలు లేదు. వారి ఎదుట తల ఎత్తి నడవడం శిక్షార్హమైన అపరాధంగా పరిగణించబడేది.



ఈ దురవస్థకు కారణాలను చర్చిస్తూ - మదనమోహనమాలవ్య, స్వామి శ్రద్ధానంద, రాజేంద్రప్రసాద్ మున్నగు మహనీయులు ఇలా హెచ్చరించేవారు - అంటరానితనాన్ని దూరం చేసి, దళితులను అక్కున చేర్చుకున్నప్పుడే హిందూ సమాజం బలపడుతుంది; ఛిన్నాభిన్నమైన సమాజం స్వతంత్రం కాజాలదు; స్వతంత్రం అయినా ఎక్కువ కాలం ఆ స్వాతంత్ర్యాన్ని రక్షించుకొన జాలదు.

మహాత్మాగాంధీ ఈ అభిప్రాయాన్ని సామాన్య ప్రజలలోనికి తీసుకువెళుతున్నారు. తిరుగులేని ప్రజానాయకుడుగా ఆయన పేరు ప్రఖ్యాతులు పెరుగుతున్నాయి. ఆయన చెప్పిన మాటలకు ఎంతో విలువ ఇచ్చేవారు.

అయితే మాలవ్యాజీ ఈ సమస్యను విభిన్నమైన రీతిలో ప్రతిపాదించసాగారు. సంస్కరణ అభిలాషను మేలుకొలిపి, సమాజంలో పరివర్తన తేవడానికి ఆయన తగుచర్యలు తీసుకుంటున్నారు. పండితులు, విద్వాంసులు, ఆచార్యులు ఆయనను గౌరవించేవారు. మాలవ్యాజీ స్వయంగా శాస్త్రవిద్యల ప్రాచీన పరంపరతో ముడిపడి ఉన్న నాయకుడు. సాంఘిక నాయకుని వేదన, విస్తృత నేపథ్యంలో సమస్యలను విశ్లేషించే మహాపురుషుని వేదన గాంధీజీ మాటలలో వ్యక్తమయ్యేది. మాలవ్యాజీ మాటలలో ఈ ప్రత్యేకతలతోపాటు సంప్రదాయ బలం కూడా ఉండేది.

1923లో కాశీలో "హిందూ మహాసభ" మహాసభలు జరిగాయి. ఆనాడు ఆ సంస్థ భారతీయ ధర్మంలోని అన్ని ప్రవాహాలు, అన్ని వర్గాల సంయుక్త వేదిక. మాలవ్యాజీ ఆ మహాసభకు అధ్యక్షత వహించారు.

మాలవ్యాజీ కృషి ఫలితంగా ఆ మహాసభలలో ఒక నిర్ణయం తీసుకోబడింది. అగ్రకుల హిందువులతో సమానంగా దళిత కులాలకు ప్రభుత్వ, ప్రభుత్వేతర విద్యాలయాలలో చదువుకోవడానికి, బావుల నుండి నీళ్ళు తోడుకోవడానికి, చెరువులలో స్నానం చేయడానికి, సభలలో ఇతరులతోపాటు కూర్చొనడానికి, రహదారులలో నడవడానికి, దైవ దర్శనానికి హక్కు ఉన్నదని, ఆ హక్కును అందరూ గౌరవించాలని ఒక తీర్మానంలో పేర్కొన్నారు. తీర్మానమయితే ఆమోదించబడింది. కానీ, దానిని అమలు చేయడం అంత సులభం కాదు. అందుకోసం సమాజంలో అనుకూల వాతావరణాన్ని నిర్మాణం చేయవలసి ఉంటుంది. అది మరో పోరాటం. అయినా కాశీలో ఎందరో పండితుల, పురోహితుల సమక్షంలో, వారి అంగీకారంతో అలాంటి తీర్మానం ఆమోదింపబడడమే ఒక పెద్ద సాఫల్యం.

1925లో "హిందూ మహాసభ" మహాసభలకు లాలా లజపతిరాయ్ అధ్యక్షత వహించారు. మేధావులకు, ఛాందసవాదులకు నిలయమైన ఆధునిక నగరం అయిన కలకత్తాలో ఆ మహాసభలు జరిగాయి. అందరికి కులమత భేదములు లేకుండా వేదాన్ని పఠించే అధికారాన్ని ఇచ్చే విషయాన్ని ఆ సందర్భంగా లాలా రామప్రసాద్ ప్రస్తావించారు. ఈ ప్రస్తావన రాగానే మహాసభలో అలజడి చెలరేగింది. ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మాలవ్యాజీ కూడా ఆ సభలో ఉన్నారు. ఆయన పరిస్థితిని అదుపులోనికి తెచ్చారు. ఆయన ఇలా అన్నారు - "పరమేశ్వర ప్రసాదం అందరికీ అందవలసిందే. వేదాధ్యయనం ఎవరికీ నిషిద్ధం కాదు. అయితే అందుకు కఠోర తపస్సు

**పరిస్థితులను నిందించకూడదు. వాటిని ఒక ఛాలెంజ్‌గా తీసుకోవాలి**

అవసరం అవుతుంది. ఆ తపస్సు ప్రతి ఒక్కరికీ మొదటి ప్రయత్నంలోనే సాధ్యపడదు. భగవద్గీత భూమండలంలోని సర్వశ్రేష్ఠమైన గ్రంథం. దానిని అధ్యయనం చేయడం, మననం చేయడం అందరికీ సులువు. గీతద్వారా కొద్ది ప్రయత్నంతో వేదాలలోని మూలతత్వాన్ని అర్థం చేసుకోవచ్చు."

ఈ మాటలతో మాలవ్యాజీ అప్పుడు ఏర్పడిన గందర గోళాన్ని ఆ విధంగా శాంతింపజేశారు. సమాజంలో ఇతర వర్గాలకు ఉన్న అధికారాన్ని అందరికీ ఇవ్వడం ఆయనకు ఇష్టమే. సాధన, స్వాధ్యాయముల రంగాలకు సైతం ప్రాకిన తరతమభేదాలు హిందూ సమాజాన్ని పూర్తిగా తొలచి వేశాయన్నది ఆయన అభిప్రాయం. కలకత్తా మహాసభలలో ఏర్పడిన గందరగోళాన్ని తొలగించిన తర్వాత ఆయన జాతీయ భావాలను ప్రచారం చేస్తూ వివిధ స్థలాలలో పర్యటించారు. జాతీయోద్యమాన్ని ముందుకు నడిపిస్తూ ఆయన సంఘ సంస్కరణ కార్యక్రమాలను కూడా ప్రోత్సహిస్తూ వచ్చారు. ఆయన ఉపన్యాసాలు బడుగు వర్గాల ఉద్ధరణకు, మహిళల పరిస్థితిని చక్కదిద్దడానికి, సాంఘిక దురాచారాల నిర్మూలనకు ప్రేరణ ఇచ్చేవి. అందరికీ వేద అధికారం కూడా ఆ ఉపన్యాసాలలో ప్రస్తావనకు వచ్చేది. 1927లో ఆయన ఒక సాహసోపేతమైన చర్య తీసుకున్నారు. ప్రయాగలో అన్ని కులాల వారికి మంత్రదీక్ష ఇచ్చారు. దానిపై విమర్శలు వచ్చాయి. తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అయినా మాలవ్యాజీ వాటిని లెక్క చేయలేదు. ఆయన ప్రశాంతంగా, నిశ్చలంగా, దృఢంగా తమ పనిలో నిమగ్నులు అయ్యారు. కలకత్తా, నాసిక్, పూనా, కాశీ మున్నగు స్థలాలలో కూడా సామూహిక మంత్రదీక్ష కార్యక్రమాలు జరిగాయి. వ్యతిరేకత, సమర్థనలతో కూడిన మిశ్రమ ప్రతి స్పందన వాటికి లభించింది.

### సమాజ అనుష్ఠానం

ప్రయాగలో సామూహిక దీక్ష ఇవ్వడానికి కొద్ది నెలల ముందు మాలవ్యాజీ ఆగ్రా విచ్చేశారు. మార్గదర్శక సత్తా సాక్షాత్కారం, మహాపురశ్చరణ సాధన ప్రారంభం జరిగిన తర్వాత శ్రీరామ్ సామాజిక కార్యకలాపాలలో కూడా మునుపటివలెనే పాల్గొంటున్నాడు. మాలవ్యాజీ గురించి ఏ వార్త అందినా, ఆయన దాన్ని శ్రద్ధగా వినేవాడు. దాని పూర్తి సమాచారం సేకరించేవారు. వారి సమాజ అనుష్ఠానంలో ఏవిధంగా సహకరించాలా అని ఆలోచించేవాడు. 1926 వసంత పర్వం తర్వాత శ్రీరాం తన మునుపటి కార్యకలాపాలను సమీక్షించుకున్నాడు. సంఘ సంస్కరణ రంగంలో గత మూడు సంవత్సరాలలో తన పరిసరాలలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని, తన కోసం కొన్ని బాధ్యతలను ఎంపిక చేసుకున్నాడు.

మాలవ్యాజీ ఆగ్రా విచ్చేశారని తెలిసిన వెనువెంటనే శ్రీరామ్ అక్కడికి బయలుదేరాడు. రెండు మూడు రోజులలో తిరిగి వస్తానని చెప్పి పయనమయ్యాడు. మాలవ్యాజీ ఆగ్రాలో హిందూ సభాభవనంలో బస చేశాడు. వాస్తవానికి అది సేఠ్ గిరిధర దాస్ గృహం. ఆయన దానిని "హిందూ సభ" కార్యకలాపాల కోసం ఇచ్చివేశారు. ఇలా సామాజికంగా ఉపయోగపడడంతో అది హిందూ సభాభవన్ అయింది. మాలవ్యాజీ సభాభవనంలోని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇలా అన్నారు –

"బౌద్ధులు, జైనులు, సిక్కులు అందరూ విరాట్ హిందూ జాతిలోని అవయవాలు. గ్రామ గ్రామంలో సభ శాఖలను ప్రారంభించాలి. సమాజాన్ని పతన స్థితి నుండి ఉద్ధరించడానికి చర్యలు తీసుకోవాలి. మనం అంటరానివారని పిలుస్తున్నవారు మన సోదరులే. వారిని ప్రేమించాలి. వారి స్థితిగతులను మెరుగుపరచడానికి కృషి చేయాలి. వారిని స్వంత అన్నదమ్ములుగా చూచుకోవాలి. ప్రతి ఊరిలో పాఠశాలలు, వ్యాయామశాలలు స్థాపించాలి. మన శరీరాలు కూడా బలిష్ఠంగా ఉండాలి. **మనలో శక్తి ఉంటే మనం బయటి శత్రువులతోను, లోపలి శత్రువులతోను పోరాడగలుగుతాం. బలమైన శరీరంలోనే బలమైన ఆత్మ నివసిస్తుంది.** మనస్సును బలీయం చేయడానికై పూజ, ధ్యానం, జపం, శాస్త్రాల అధ్యయన, మననాలు జరపాలి."

ఛిన్నాభిన్నమై, చిక్కిశల్యమైన హిందూ సమాజాన్ని తిరిగి సంఘటితం చేయాలని మాలవ్యాజీ తమ ప్రవచనాలలో నొక్కి చెప్పేవారు. చర్చలలో కూడా ఆయన అస్పృశ్యుల ఉద్ధరణను ప్రస్తావించేవారు. ఆనాటి ఉపన్యాసం పూర్తయిన తర్వాత ఆయన కార్యకర్తలతో ఇష్టాగోష్ఠి జరిపారు. ఒక కార్యకర్త ఇలా ప్రశ్నించాడు–

"అంటరాని ఉద్ధరణ అనే మీ ఆలోచన జాతీయ ఉద్యమానికి భిన్నం కాదా? ఈ కార్యక్రమానికి ప్రాముఖ్యం ఇస్తే, ప్రజల దృష్టి జాతీయోద్యమం నుండి ప్రక్కకు మళ్ళుతుంది. అలా మనం మన ప్రధాన లక్ష్యాన్ని విస్మరిస్తాం."

**ఏదీ తనంతట తాను నీ దగ్గరకు రాదు. శోధించి సాధించాలి**

మాలవ్యాజీ ఎదురు ప్రశ్నవేశారు –

“ప్రధాన లక్ష్యం ఏమిటి?”

“స్వరాజ్యం”

“స్వరాజ్యం ఎందుకు?”

ప్రశ్నించిన కార్యకర్త బాగా తయారయ్యే వచ్చాడు. అతడు ఇలా జవాబిచ్చాడు –

“ప్రపంచంలో మనం తల ఎత్తుకుని తిరగడానికి; మన గౌరవ ప్రతిష్టలను కాపాడుకునేందుకు వాటిని పెంపొందించే కునేందుకు.”

ఈ జవాబుతో మాల్యాజీ ఆ కార్యకర్త మనసులోని భావాన్ని గ్రహించారు. ఆయన ఇలా వివరించారు –

“ఆ గౌరవ ప్రతిష్టలు ఎవరో ఒక వ్యక్తివి కావు, దేశమంతటి ఆత్మగౌరవం, సమాజపు ఆత్మగౌరవం. అందుకోసం మనకు స్వరాజ్యం కావాలి. మనం ఈ సంగతి మరువకూడదు. లక్షలాది, కోట్లాది మన సోదరుల గౌరవాన్ని కాలరాస్తుంటే, మనకు ఆత్మగౌరవం లభించదు. వారి గౌరవ ప్రతిష్టలను కాపాడడం ద్వారానే మనం మొత్తం జాతి గౌరవాన్ని పునః ప్రతిష్ట చేయగలుగుతాము.’

ఆయన సమన్వయ సూత్రాన్ని ఇలా వివరించారు –

“రోగం వచ్చినప్పుడు అందరి ఆలోచన దానిని నయం చేయడంపై లగ్నం కావాలి. ఔషధం భోజనం కాదు. శాశ్వత సంస్కరణ తాత్కాలిక చర్య కాదు. దాని ప్రభావం ఎల్లకాలం నిలచి ఉండాలి. జాతీయోద్యమానికి విరుద్ధమైన పనిని మనం చేయకూడదు. నిమ్నజాతి వారి స్థితిగతులను మెరుగు చేయడానికి కృషి చేయకపోతే, వారిని మనతో కలుపుకుని ముందుకుపోలేము.”

## దీక్షా గురువుతో పునస్సమాగమం

ఆనాటి సభలో మాలవ్యాజీ ఉపన్యాసం విన్న తర్వాత శ్రీరామ్ ఈ చర్చాగోష్ఠిలోనికి కూడా వచ్చాడు. మాలవ్యాజీకి ప్రణామం చేసి, ఒక ప్రక్కన కూర్చున్నాడు. గోష్ఠిలో ఇతరులు కూడా కూర్చున్నారు. వారిలో హెచ్చుమంది యువ కార్యకర్తలు. ప్రతి ఒక్కరు తనని తాను పరిచయం చేసుకున్నారు. శ్రీరామ్ తన పరిచయం చేసుకుంటూ ఒకటి రెండు వాక్యాలు చెప్పేసరికి మాలవ్యాజీకి గతంలో జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. కొన్ని సంవత్సరాల క్రితం పండిత రూపకిశోర్‌తోపాటు కాశీకి వచ్చిన ఈ బాలుడు, ఇతడికి సంబంధించిన సంఘటనలు స్మృతిపథంలో మెదిలాయి. ఆ బాలునిలో శుభ లక్షణాలు తనకు కనిపించిన సంగతి, అతడు ముందు ముందు దేశానికి, సమాజానికి విశిష్టమైన సేవ చేస్తాడనే ఆశ తనకు కలిగిన సంగతి ఆయనకు గుర్తుకు వచ్చాయి.

ఈలోగా ఒక కార్యకర్త శ్రీరామ్ గురించి మరో సంగతి ప్రస్తావించాడు. తన గ్రామంలో జబ్బుపడిన ఒక అస్పృశ్య మహిళకు శ్రీరామ్ సేవ చేయడం, ఆ కారణంగా అతడు కొంతకాలం దండనకు గురికావడం – ఇదంతా చెప్పాడు. మాలవ్యాజీ ఈ సంఘటనను స్వయంగా శ్రీరామ్ నోటి నుండి విన్నారు. సేవ చేస్తున్న సమయంలో అతడి మనస్సులో ఏయే భావాలు మెదిలాయో అడిగి తెలుసుకున్నారు. అంతా విన్న తర్వాత శ్రీరామ్ వీపు తట్టి ఇలా అన్నారు –

“ముందు ముందు నీవు మరిన్ని సవాళ్ళను ఎదుర్కొనవలసి ఉంటుంది.”

ఈ సమావేశంలో మాలవ్యాజీతో మామూలు విషయాలు మినహా చెప్పుకోదగ్గ చర్చ జరగలేదు. సమాజ సంస్కరణంపై, జాతీయ ఉద్యమంపై జరిగిన చర్చలోనే సమయం గడచిపోయింది. ప్రత్యక్షంగా ప్రధానమైన చర్చ జరిగే అవకాశం లేకపోయింది. గోష్ఠిలో పాల్గొన్న ప్రజలు, స్వరాజ్య సమర సేనానులు, సామాజిక కార్యకర్తల మధ్య జరిగిన సంభాషణ వినే అవకాశం కలిగింది. శ్రీరామ్ తన పాత్రను నిర్ణయించు కోవడానికి ఆ సంభాషణ దోహదం చేసింది. అక్కడ కార్యకర్తల సంభాషణ సాగుతోంది. ఇక్కడ ఆవల్‌ఖేడా వెళ్ళిన తర్వాత తాను ఏమి చేయాలో ఆయన నిర్ణయించుకుంటున్నాడు.

ఆవల్‌ఖేడా చేరగానే, శ్రీరామ్ బాలసేన సమావేశం ఏర్పాటు చేశాడు. తన ఆగ్రాయాత్ర వివరాలు తెలిపారు. ఆగ్రాలో సైనిక స్థావరం ఉన్నప్పటికి ప్రజలు ఎలా ధైర్యంగా, నిర్భయంగా పోరాడుతున్నారో ఆయన వివిధ సంఘటనలను వర్ణిస్తూ వివరించాడు. మామూలుగా ప్రజలు సైనికులను చూస్తే భయపడతారు. అయితే యువకులలో ఉత్సాహం ఉరకలు వేస్తోందని, తలపడడానికి వారు తహతహలాడుతున్నారని ఆయన పేర్కొనాడు.

రామప్రసాద్ అనే యువకుడు ఉత్తేజంతో ఇలా అన్నాడు–

**వినపడని వాడు కాదు, వినిపించుకోని వాడే నిజమైన చెవిటివాడు**

"శ్రీరామ్! మనము తయారుగానే ఉన్నాం. మనము ఎవ్వరికీ భయపడము. ఆనాడు ఆ లావుపాటి ఆఫీసరును, వారి సైనికులను మనం ఎలా తరిమికొట్టామో నీకు గుర్తులేదా?"

"అది గ్రామంలో జరిగిన సంఘటన. సైనిక స్థావరంలో ఎదిరించడం చాలా పెద్ద విషయం. మనం వాళ్ళ నుండి ఎన్నో విషయాలు నేర్చుకోవాలి." – అని శ్రీరామ్ జవాబిచ్చారు.

రామప్రసాద్‌కు తమ పట్ల ఈ చిన్నచూపు నచ్చలేదు. ఆగ్రా యువకులతో పోల్చి తమను తాము కించపరచు కుంటున్నామని అతడికి అనిపించింది.

అతడు ఇలా అన్నాడు – "ఎవరన్నారు ఆ మాట? ఆగ్రాలో మీరే ఒక లావుపాటి ఆఫీసరు తల పగులగొట్టలేదా?"

అందరు రామప్రసాద్‌తో ఏకీభవించారు.

ఆ సంఘటన 1923 నాటిది. అప్పుడు శ్రీరామ్ వయస్సు 12 సంవత్సరాలు, ఎందుకో ఆగ్రా వెళ్ళారు. అక్కడ ఒక ఆంగ్లేయ సైనికాధికారి ఒక యువతిని వేధిస్తూ ఉండడం చూచారు. ఆ అధికారి ఆ యువతిని తన వద్దకు రమ్మని జబర్దస్తీగా కేకవేశాడు. ఆమె తెలివి కలది. ఆ అధికారి ఉద్దేశ్యం ఏమిటో ఆమె పసికట్టింది. ఆ అధికారివైపు వెళ్ళడానికి బదులు ఆమె చకచకా ముందుకు సాగిపోయింది.

### ఆకతాయి తల పగిలింది

అధికారి ఆమెను వెంబడించాడు. ఆ యువతితో పాటు వెళ్తున్న యువకుడు "ఏమిటి విషయం?" అని అడిగాడు. అధికారి దృష్టిలో అలా అడగడం అపరాధం. దానికి శిక్ష పడవలసిందే అనుకుని అతడు తన తుపాకి మడమతో ఆ యువకుని వీపుమీద కొట్టాడు. ఆ దెబ్బకు యువకుడు క్రింద పడిపోయాడు. అధికారి అతడిని అలా వదిలివేసి యువతి వెంట పరుగెత్తాడు. ఆమె భయపడి పారిపోతోంది. తెల్ల అధికారి ఆమెను వెన్నాడుతున్నాడు.

శ్రీరామ్ ఒక దుకాణం వద్ద నిలబడి ఇదంతా చూస్తున్నాడు. అతని మనస్సు రోషంతో కుతకుతలాడింది. ఆ రోషం ఆ తెల్ల అధికారి మీద, ఇదంతా చూస్తూ ఊరుకుంటున్న జనం మీద. తాను ఏమి చేయాలో ఆయన తక్షణం నిర్ణయించుకున్నాడు. దుకాణం తలుపునకు అడ్డంపెట్టి ఉన్న రాయిని చేతితో తీసుకుని సరిగ్గా గురి చూచి ఆ అధికారిపైకి విసిరాడు. ఆ దెబ్బకు అధికారి తూలి క్రిందపడ్డాడు. ఏడుస్తూ పైకి లేచాడు. కానీ, అతడి కాళ్ళలో సత్తువ లేదు. అతడు ఇటూ అటూ తూలుతూ నడుస్తున్నాడు, అరుస్తున్నాడు, పెడబొబ్బలు పెడుతున్నాడు, జనం ఇంకా అలా వింత చూస్తూనే ఉన్నారు. రాయి ఎవరు విసిరారో ఎవ్వరూ చెప్పలేదు. అతడు జనాన్ని భయపెడు తున్నాడు. బెదిరిస్తున్నాడు. అయినా ఎవ్వరూ ఏమీ చెప్పలేదు. ఈలోగా ఆ యువతి ఒక సురక్షిత స్థలంలో దాక్కున్నది. ఆంగ్ల అధికారి తిరిగివెళ్ళిపోయాడు.

ఈ సంఘటన తర్వాత శ్రీరామ్ తన వయస్సుగల యువకులను సంఘటితం చేయాలని నిర్ణయించాడు. ఆ కారణంగా బాలసేన సభ్యులకు ఈ సంఘటన బాగా గుర్తుంది.

మాలవ్యాజీని కలుసుకుని తిరిగి వచ్చిన తర్వాత శ్రీరామ్ మరింత క్రియాశీలం కావడానికి పథకాలు రూపొందించ సాగాడు. కొన్ని కార్యక్రమాలు ఖాయమయ్యాయి. సాధనా క్రమం దాని తరహాలో అది సాగుతోంది. దానికోసం అదనంగా 4-5 గంటల సమయం కేటాయించవలసి వచ్చింది. అందు కోసమై ఆయన నిద్ర సమయాన్ని తగ్గించాడు. ఆవుపాలు, మజ్జిగ, జొన్న రొట్టె మున్నగువాటి ఏర్పాటు తల్లి చూసేది. అఖండ దీపంలో నెయ్యి వేసే పనికూడా ఆమె చేసేది.

శ్రీరామ్‌కు వివాహం చేయాలన్న ఆమె పట్టు కొనసాగుతోంది. అది మరింత తీవ్రమయింది కూడా. శ్రీరామ్ గ్రామంలోని యువకులను ప్రోగుచేసి గోష్ఠులు నిర్వహించడంతో, ఎక్కువ సమయం ఇంటి బయట గడపడంతో, కరపత్రాలు, పోస్టర్లు పంచుతూ అతికిస్తూ ఉండడంతో తల్లిగారి పట్టుదల మరింత ఉధృతం అయింది. సంబంధాలు చూడవలసిందిగా బంధువులందరికి ఆమె చెప్పింది. ఫలితంగా కొన్ని సంబంధాలు వచ్చాయి. వాటిలో ఏదో ఒక సంబంధాన్ని ఎంపిక చేసి చెప్పమని ఆమె శ్రీరామ్‌ను అడిగారు. శ్రీరామ్ కొంతసేపు ఆలోచించి ఇలా అన్నాడు –

"ఇప్పుడంత తొందర ఎందుకు? ఈ వయస్సులో పెళ్ళి చేసుకోవడం మత విరుద్ధం అవుతుంది."

### సహధర్మచారిణి కోసం అన్వేషణ

"గ్రామంలోని మగపిల్లలంతా 14-15 సంవత్సరాల వయస్సుకే పెళ్ళి చేసుకుంటున్నారు. నీ స్నేహితులలో పలువురికి పెళ్ళిళ్ళు జరిగాయి. నీవు కూడా పెళ్ళి చేసుకో" అని తల్లి నచ్చజెప్పారు. శ్రీరామ్ మౌనం వహించాడు. తల్లి మళ్ళీ

**కోపంగా ఉన్నప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకూడదు**

చెప్పింది. గట్టిగా చెప్పింది. శ్రీరామ్ కొంచెం ఆలోచించి ఇలా జవాబిచ్చారు –

"కొంత కాలం ఆగమ్మా."

"ఎంత కాలం?"

"అదే, ఓ ఏడాదిపాటు."

తల్లి కారణం అడిగారు. శ్రీరామ్ ఇలా వివరించారు–

"మగపిల్లలు 16 సంవత్సరాలలోపు వయస్సులో పెళ్ళి చేసుకోకూడదని మాలవ్యాజీ నిర్దేశించారు. 20–21 సం॥ల వయస్సు వరకు ఆగితే మంచిదని, 16 సంవత్సరాల పరిమితిని పాటించవలసిందేనని ఆయన వివరించారు."

మాలవ్యాజీ ప్రస్తావన విని తాఈజీ మిన్నకున్నారు. మళ్ళీ ఇలా అడిగింది –

"అయితే పెళ్ళికూతురు వయస్సు ఎంత ఉండాలి?"

"కనీసం 12 సంవత్సరాలు. అఖండ దీపం సంగతి చూడడానికి, గోసేవకు నీకు కోడలి అవసరం ఉన్నదని నాకు తెలుసు. అయినా శాస్త్ర నియమాన్ని పాటించవలసిందేకదా."

ఇందుకు ఏమి జవాబు చెప్పాలో తాఈజీకి తోచలేదు. కొంచెం ఆలోచించి ఆమె ఇలా అన్నారు –

"ఈలోగా వధువును చూడవచ్చు కదా."

"ఆ సంగతి నీకే తెలియాలి. కోడలు కావలసింది నీకు. నీవు చూసి నిర్ణయించు."

వివాహం కోసం 16 సంవత్సరాల వయస్సు వరకు ఆగాలని శ్రీరామ్ చెప్పడానికి కారణం ఉన్నది. ఆడపిల్లకు 8–10 సంవత్సరాలు వస్తే చాలు, పెళ్ళి ఈడు వచ్చిందని ఆ రోజులలో జనం భావించేవారు. ఆ వయస్సు వరకు ఆడపిల్లకు పెళ్ళికాకపోవడం కొన్ని కుటుంబాలలో, కులాలలో, గ్రామాలలో చింతించవలసిన విషయంగా ఉండేది. కనుక ఏ వయస్సుగల పిల్లవాడు దొరికినా, అతడితో ఆడపిల్ల పెళ్ళి జరిపించేవారు. మగపిల్లవాడి వయస్సు 10–12 నుండి 20–21 సంవత్సరాల వరకు ఏదైనా సరిపోయేది. ఆడపిల్ల వయస్సు 10–11 సంవత్సరాలు ఉంటే చాలు.

ఈ బాల్య వివాహ ఆచారం వల్ల ఆడపిల్లలు మగపిల్లలు యౌవనం రాకముందే ముసలివాళ్ళయే పరిస్థితులు ఏర్పడ్డాయి. హిందూ సమాజాన్ని శక్తిశాలిగా, సంఘటితంగా రూపొందించే ఉద్యమాన్ని ప్రారంభించిన మాలవ్యాజీ బాల్య వివాహాలను గురించి కూడా ఆలోచించారు. అస్పృశ్యుల ఉద్ధరణ, శుద్ధి సంస్కారం (**शुद्धि प्रथा**), మహిళలకు గౌరవం అనే త్రిసూత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మాలవ్యాజీ బాల్య వివాహాలను నిరుత్సాహ పరచాలని కూడా గట్టిగా చెప్పసాగారు. 1923 ఆగస్టులో కాశీలోను, 1925 జనవరిలో ప్రయాగలో జరిగిన మహాసభల సమయంలో మాలవ్యాజీ విద్వత్తు పరిషత్తులను ఏర్పాటుచేసి సమాజ సంస్కరణపై విద్వాంసుల, ఆచార్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆడపిల్లకు 12 సంవత్సరాల వయస్సులోపు, మగపిల్లవాడికి 16 సంవత్సరాల వయస్సులోపు పెళ్ళి చేయకూడదని ఆ పరిషత్తులో ఏకాభిప్రాయం ఏర్పడింది. ఆడపిల్ల వయస్సు 16 సంవత్సరాలు, మగపిల్లవాడి వయస్సు 20 సంవత్సరాలు ఉంటే మరీ మంచిదని కూడా ఏకాభిప్రాయం ఏర్పడింది.

ఆనాటి ఆచార వ్యవహారాల దృష్ట్యా కనీస వయస్సు పై ఈ నిర్ణయం ఒక పెద్ద ముందడుగే. సమాజంలో ఇందుకు నిరసన వ్యక్తం కావచ్చు. పండితులు దీన్ని వ్యతిరేకించారు కూడా. ఏమైనా ఈ నిర్ణయం వెంటనే అమలు జరగలేదు. కొద్దిమంది మాత్రమే మాలవ్యాజీ నిర్దేశాలను పాటించారు.

ఆవల్‌ఖేడాలో ఈ నియమాన్ని పాటించిన మొట్టమొదటి వ్యక్తి శ్రీరామ్. పెళ్ళికూతురిగా ఎవరిని ఎంపిక చేసినా, ఆ అమ్మాయి వయస్సు 12 సంవత్సరాలలోపు ఉండకూడదని ఆయన తన తల్లిగారితో స్పష్టంగా చెప్పారు. వివాహానికి మరి నాలుగు సంవత్సరాలు ఆగాలని ఆయన అనుకున్నారు. అయితే పూజగదిలో అఖండదీపం పని తల్లి అయినా చూడాలి, భార్య అయినా చూడాలి. తల్లికి రోజంతా ఇతర పనులు చాలా ఉండేవి. పెద్ద కుటుంబం. వచ్చిపోయే బంధువుల తాకిడి ఎక్కువ. తల్లికి ఆ పనులే సరిపోయేవి. కనుక అఖండ దీపం పనిని భార్యకు అప్పగించడం మంచిదని శ్రీరామ్ అనుకున్నాడు. గోసేవ, నెయ్యి, మజ్జిగ మున్నగువాటిని తయారుచేసి పూజ కోసం సిద్ధం చేయడం భార్య ద్వారానే సక్రమంగా జరుగుతాయని ఆయన భావించారు. కుటుంబాన్ని ఏర్పాటు చేసుకుని మామూలు వ్యక్తివలె వంశాన్ని కొనసాగించడానికికాక తన ధర్మపత్ని సాధనలో తన సహచరి అవుతుందనే భావంతో శ్రీరామ్ తన వివాహానికి అనుమతి ఇచ్చాడు.

*(సశేషం)*

**మనోబలం క్షీణించినచోట ప్రగతి సాధ్యం కాదు**

దీపావళి ప్రత్యేకం

# అందరి పండుగ - దీపావళి

ఇతర పండుగలు, పర్వదినాల విషయానికి వస్తే కొన్ని ఆయా క్షేత్ర విశేషమునుబట్టి లేదా కొన్ని ప్రాంతములలో మాత్రమే జరుగుతాయి. కానీ దీపావళి పండుగ ఉత్తరము నుండి దక్షిణముదాకా, తూర్పు నుండి పడమర వరకు యావద్భారత దేశమంతటా జరుపబడుతుంటుంది. శ్రీలంక, నేపాల్, మయన్మార్ మొదలైన దేశములలో కూడా ఈ పండుగ జరుపబడుతుంది. ఈ దేశములన్నీ ఒకప్పటి భారతదేశము లోని చిన్న చిన్న భూభాగములే! అక్కడ ఈనాటికీ భారతీయ సంస్కృతి ప్రభావమున్నది. ఐదురోజులపాటు జరిగే ఈ పండుగకు భారతదేశములో ఉత్పన్నమైన ఎన్నో మతాలు, సంప్రదాయములపట్ల విశ్వాసముతో ఆయా సందర్భములు జోడింపబడి ఉన్నాయి. వైదికమతానుయాయులే కాకుండా జైన, సిక్కు, బౌద్ధులు వేదముల పట్ల అనన్యమైన భక్తి కలిగినవారు, అన్ని సాంప్రదాయములకు చెందిన దేవ దూతలు కార్తీక కృష్ణ త్రయోదశి నుండి ప్రారంభమై ఐదురోజులపాటు సాగే ఈ పండుగలో ఏదో ఒకరోజు తప్పకుండా పాల్గొంటారు, ఏదో ఒకరోజుకు సంబంధించిన కొన్ని విశేషములు వారి మదిలో మెదలుతాయి. అందుచేత దీపావళిని జాతీయ పర్వదినముగా గుర్తించవలసిన అవసరము ఎంతైనా ఉన్నది.



స్వాతంత్ర్యదినము, గణతంత్రదినము మొదలైనవి గత 50, 60 సంవత్సరముల నుండి జరుపబడుతున్నాయి. వాటి ఔన్నత్యము, ప్రాముఖ్యత తిరుగులేనివి. ఈ పండుగ ప్రాచీన భారతీయ సంస్కృతి, సంప్రదాయములకు సంబంధించినది కాబట్టి దీనిని కూడా జాతీయపండుగగా గుర్తించాలనే విన్నపము ఒకటున్నది. మతపరమైన, సాంప్రదాయపరమైన కారణాలవల్ల సంకోచముంటే వచ్చిన నష్టమేమీలేదు. సమాజము దీపావళిని జాతీయపండుగగా ఇప్పటికే గుర్తించినది. ధనత్రయోదశి లేదా ధన్వంతరీజయంతి, నరక చతుర్దశి, కాళీపూజ, లక్ష్మీపూజ, హనుమాన్‌జయంతి, బలిపాడ్యమి, గోవర్ధనపూజ, క్రొత్త సంవత్సరము, భగినీహస్త భోజనము, యమద్వితీయ అనే పదకొండు సందర్భాలకు చెందిన ఈ పండుగ లోకానికే పండుగ అనే కీర్తిని శతాబ్దాల క్రిందటే పొంది ఉన్నది.

సాధారణముగా దీపావళి పండుగరోజు లక్ష్మీపూజను ప్రత్యేకముగా చేస్తారు. సముద్రమంథన సమయములో దీపావళి పండుగనాడే లక్ష్మీదేవి ఆవిర్భవించినదని పురాణములు చెప్తున్నాయి. 'లక్ష్మీదేవి కృప' అందరికీ ఇష్టమైనదే అన్న విషయము పౌరాణిక ప్రాముఖ్యతతోపాటు వ్యావహారిక సత్యము కూడా! ఏడాది పొడవునా ఒక్క 5 నిముషములపాటు దీపారాధన పూజ పారాయణలాంటిది నిర్వహించని మనిషి కూడా ఈ దీపావళి పండుగనాడు నాణెముల గలగలలను, గుడిగంటల మ్రోతవలె వింటూ లక్ష్మీ పూజను ఏకాగ్రతతో నిర్వహిస్తాడు. సిరి సంపదలు అందరికీ కావాలి. అందుచేత దీనికి అధిష్ఠాన దేవతయైన లక్ష్మీదేవి పూజను అందరూ ఎంతో శ్రద్ధాభక్తులతో విస్తృతముగా నిర్వహిస్తారు.

ఐతే దీపావళికి సంబంధించిన రెండవ సందర్భము యొక్క ప్రాముఖ్యత కూడా తక్కువదేమీ కాదు. ఆ సందర్భము దిశ, సంకేతాలను అర్థము చేసుకొనే ప్రయత్నము చేస్తే జీవితము యొక్క సంపూర్ణశాస్త్రము తన రహస్యాలను వెల్లడి చేస్తుంది. వ్యవసాయ పనుల ఒత్తిడి నుండి బయటపడి కొంచెము ఉల్లాసముగా, ఉత్సాహముగా కాలము గడపాలనే దృష్టితో కూడా ఈ పండుగ ఏర్పాటుచేయబడినది. గమనించవలసినది

**జాలి, దయ, కరుణవంటి సుగుణాలు అలవరచుకోవాలి**

ఏమిటంటే దీపావళిపండుగ ముందునుంచే ఉన్నది. దానికి నెమ్మదినెమ్మదిగా అనేక సందర్భములు జోడింపబడినాయి. సంస్కృత వాఙ్మయములో ఈ పండుగ 'శారదీయ ఉత్సవము'గా పేర్కొనబడినది. దసరా తరువాత ప్రారంభించబడి పూర్తిగా 17 రోజులపాటు ఈ పండుగ నిర్వహించబడేది అనికూడా ప్రాచీన వాఙ్మయములో వర్ణించబడినది. శారదపూర్ణిమనాడు అసలు ఉత్సవము జరుపబడేది. ఆరోజు కౌముదీ ఉత్సవము, శారదాఉత్సవము, శరత్‌పౌర్ణిమ, రాసలీలవంటి లలితమైన, మధురమైన పండుగలు నిర్వహించబడుతుండేవి. కానీ ఈ సంప్రదాయము ఎప్పుడు కనుమరుగైపోయిందో ఎవ్వరికీ తెలియదు.

దీపావళి రూపములో ప్రసిద్ధిగాంచిన ఈ పండుగ ఆరోగ్యమును జాగృతము చేసుకొనడముతో ప్రారంభమౌతుంది. త్రయోదశికి ముందురోజు ధన్వంతరీజయంతిగా పిలువబడుతుంది. ప్రజలు దీని 'ధనతేరస్' అనికూడా అంటుంటారు. ధన్వంతరీ జయంతి (ధన్వంతరి దివస్) అనే పేరు ప్రజల నోళ్ళల్లో నలిగి నలిగి 'ధనతేరస్'గా రూపాంతరము చెందింది. నిజానికి ఇది ఆరోగ్యానికి అధిదేవత అయిన 'ధన్వంతరి' అవతరించిన దినము. సముద్రమంథన సమయములో ఈ రోజుననే ధన్వంతరి ఆయుర్వేదశాస్త్రమును, అమృతమును చేతపట్టి దేవదానవుల ఎదుట ప్రత్యక్షమైనాడు. సముద్రమంథన కార్యక్రమము సఫలీకృతమైనదని భావించిన దేవదానవులు వేగముగా ఆయనను చుట్టుముట్టారు. ప్రస్తుత కాలములో 'ధన్వంతరీ జయంతి' వైద్యరంగములోనివారికి మాత్రమే పరిమితమై ఉన్నది. పూర్వమునుండి వస్తున్న ఆచారము ప్రకారమైతే ఈనాడు ఒక దివ్వెను వెలిగించి ఇంటి ముంగిట వ్రేలాడగట్టేవారు. ఆ దీపము ఇంటిలోనికి రాబోయే అకాల మృత్యువును అడ్డగిస్తుందని ప్రజల నమ్మకము; తద్వారా ఆ దీపము మనకు ఆరోగ్యము, శక్తి, శాంతి అనే మూడింటినీ ప్రసాదిస్తుందని కూడా మనము గ్రహించాలి. యముని సోదరియైన 'యమున' ప్రవహించే ప్రదేశాలలో ఈరోజున ప్రత్యేకమైన పూజలను జరుపుతారు. ఆరోజు భక్తిశ్రద్ధలతో యమునలో స్నానము చేసి యముడిని స్మరించడము మంచిది. ముందుగా దీపమును వెలిగించి ప్రారంభించే ఈ మహాదీపావళి పర్వదినమునాడు ఒక క్రొత్త గిన్నెను కొనే సంప్రదాయముకూడా ఉన్నది. తినటానికి, పంచుకోవటానికి రకరకాల మిఠాయిలు ఎన్ని అయినా బజారులో కొనవచ్చుకానీ, లక్ష్మీదేవికి నివేదించదలచుకున్న 'భోగప్రసాదమును' మాత్రము ఇంటిలోనే తయారుచెయ్యాలి. పూజాసామాగ్రిని ఇంటిలోనే తయారు చేసుకోవాలి. శుభ్రమైన, తాజాయైన, ఎవ్వరూ స్పృశించనటు వంటి భోజనమును దేవికి నివేదించాలి. క్రొత్తగిన్నెను కొనడము కూడా ఇందుకోసమే ఉద్దేశింపబడింది.

ఇక 'నరకచతుర్దశి లేదా హనుమాన్‌జయంతి' అనేది మహాపర్వములోని రెండవరోజు. నరకము అనే శబ్దము మృత్యువు లేక యముడు ఈ రెండింటికి సంబంధించినది. పద్ధతిని అనుసరించి చెప్పుకోవాలంటే ఇది ఆరోగ్యమునకు సంబంధించిన రోజు. పండుగ యొక్క విధానమును అనుసరించి ఈరోజు సూర్యోదయమునకు ముందే నిద్రలేచి స్నానాదికాలు ముగించాలి. చతుర్దశిరోజు సూర్యోదయము తరువాత స్నానము చేసేవారికి కఠినమైన శిక్ష ఉంటుందని పెద్దలు చెప్తారు. సాయంకాలము యముడిని ఉద్దేశించి దీపాలు వెలిగిస్తారు. ప్రాతఃకాలములో స్నానము చేయటం, సాయంకాలము దీపాలు వెలిగించటం చెయ్యనివారికి క్షమించరాని పాపాలు తగులుతాయని ధర్మశాస్త్రములు చెప్తున్నాయి. అలాంటివారికి ఏడాది పొడవునా చేసిన పుణ్యము తాలూకు ఫలము కూడా లభించదు. 'బద్ధకము, సోమరితనము వల్ల ఉదయము, సాయంత్రాలలోని పవిత్ర సమయమును వ్యర్థము చేసుకునేవారు జీవనరసములోని మాధుర్యమును సంపూర్ణముగా ఆస్వాదించలేరు' అనే ముఖ్య సూత్రమును గ్రహించటమే ఈ నియమములోని ముఖ్యమైన ఆశయము. సగము సగము మనస్సుతో చేయబడే పనులు వారికి వ్యతిరేక ఫలితాలనే ఇస్తాయి.

యముడు మృత్యుదేవతే గనుక అయితే ప్రపంచమును క్రమబద్ధీకరించడమే ఆయన పని, అయితే నియంత్రణకు అధిష్ఠానదేవత కూడా ఆయనే!

హనుమజ్జయంతి కూడా నరకచతుర్దశినాడే జరుపబడుతుంది. దక్షిణభారతదేశములో చైత్రపూర్ణిమనాడు హనుమజ్జయంతి జరుపబడుతుంది కానీ ఉత్తరభారతదేశములోని కొన్ని ప్రదేశములలో ఈ పండుగ దీపావళికి ముందు

**మానవత్వ విలువలు లేని సమాజ అభివృద్ధి అభివృద్ధే కాదు**

రోజు జరుపబడుతుంది. సంయమము, నియమపాలనను పాటించే వ్యక్తులు మృత్యువుకు కొంచెము కూడా భయపడ వలసిన అవసరం లేదని చెప్పడమే ఇందలి ముఖ్యోద్దేశ్యము.

నరక చతుర్దశి పర్వదినము కృష్ణునికి కూడా సంబంధించినదే! ఎందుకంటే ఈరోజునే శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించాడు. నరకాసురుడు వేలకొద్దీ స్త్రీలను చెరపట్టి తీసుకుని వచ్చి దాసీలుగా ఉపయోగించుకునేవాడు. నరకుని పట్ల భయముతో భూమండలము పైన రాజులు, చక్రవర్తులు మొదలైనవారంతా గడగడలాడుతుండేవారు. సంకేతపరముగా చూస్తే నరకాసురుడు భయంకరమైన అహంకారము, ఇంద్రియ లోలత్వమునకు ఉదాహరణగా చెప్పుకొనవచ్చు. ఈ ప్రవృత్తులు ఎంతగా విజృంభిస్తాయో అంతగా పరాజయము పాలవుతారు. ఇటువంటి భయంకర ప్రవృత్తి కలిగినవారు మరణించినప్పుడు ఎవ్వరూ కన్నీరు కార్చరు సరిగదా వీరివలన బాధపడ్డవారు ఎంతో సంతోషపడతారు.

'అమావాస్య' దీపావళి పండుగలో ముఖ్యమైనరోజు. గడచిన రెండురోజులు పండుగయొక్క సందర్భం మరియు వ్యాపకత్వమునకు సంబంధించినవి. ప్రాముఖ్యత కలిగిన లక్ష్మీపూజ పండుగకు సరిగ్గా మధ్యరోజున వస్తుంది. జాతి, కుల, స్థితిగతులు, పదవిప్రతిష్ఠలు, ఎక్కువతక్కువలు అనే భేదభావము లేకుండా అందరూ ఉత్సాహముతో కూడిన ధైర్యముతో పండుగను జరుపుకుంటారు. ఉత్సాహమనేది లక్ష్మీదేవిని ఆవాహన చేసుకునేందుకు, ధైర్యమనేది మహాకాలుని పిలుపు వినటానికీ సంకేతాలుగా నిలుస్తాయి. ఈ పండుగ 'కర్తవ్యనిష్ఠ, జాగరూకత'లతో కూడిన సందేశమును తప్పకుండా అందిస్తుంది. రాత్రంతా మేల్కొని ఉండటములో 'జాగరూకులుగా ఉంటూ పురుషార్థమును నిర్వహించవలెననే' సందేశము దాగి ఉన్నది. తీవ్రమైన ప్రయత్నశీలత, పురుషార్థములు కలిగిన వ్యక్తి మీదనే లక్ష్మీదేవి తన కృపను వర్షిస్తుంది.

ఆరోగ్యము, ధనము, మంచి ప్రవర్తన ఈ మూడింటినీ సాధించగలిగిన వ్యక్తికి అన్ని దిక్కులా జయం లభిస్తుంది. యమున, యముడు అతనికి సోదరీసోదరులవలె ఉండి, అతనిని సర్వదా కాపాడి రక్షిస్తుంటారు. నియమాలను, కుటుంబ బాధ్యతలను గుర్తుచేస్తూ దీపావళిపండుగ సమాప్తమవుతుంది.

*– అఖండజ్యోతి, నవంబరు 1999*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## ఆవరించిన మాయ

*జనక మహారాజు రాజ్యపాలన చేస్తూ కూడా విరక్తుడై, వైరాగ్యంతో జీవించేవాడు. కానీ మానవ శరీరధారియైన వారు ప్రకృతి నియమానుసారం, శారీరక గుణాలను అనుభవింపక తప్పదు. ఒకనాడు జనక మహారాజునకు అభిజాత్యం అడ్డుగా నిలచింది. ఒకరోజు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే జనకుని పరీక్షింపగోరి ఒక తపస్వి రూపం ధరించి జనకుని సమక్షానికి వచ్చాడు. జనకుని గ్రుక్క తిప్పుకొనలేని రీతిలో ప్రశ్నల వర్షం కురిపించసాగాడు. తన మాయాజాలంతో జనకుని సహనాన్ని పరీక్షకు పెట్టగా, జనకుడు కోపంతో, ఆ తపస్విని తన రాజ్యాన్ని విడచిపెట్టిపోవలసిందిగా ఆదేశించాడు.*

*జనకుని ఆదేశంతో, తపస్వి చిరునవ్వు నవ్వుతూ "రాజా! నేను ఆనందంగా నీ రాజ్యాన్ని విడచి వెళతాను! నీ రాజ్యానికి గల ఎల్లలను నాకు తెలుపవలసింది!"దీనిని విన్న జనకుడు ఆలోచనలో పడ్డాడు. ఆయనకు వెంటనే జ్ఞానోదయం కలిగింది. "భగవంతుడే కర్త, కర్మ మరియు క్రియ అయినప్పుడు, ఈ ప్రపంచంలో ఏ వస్తువుపైనా నాకు అధికారం లేదు కదా?" అనే భావన జనకుని మదిలో మెదలగానే, ఆయనను ఆవరించిన మాయ తొలగిపోయింది. తన కళ్ళ ఎదుట తపస్వి రూపంలో ఉన్న నారాయణుడు తన నిజరూపాన్ని ప్రదర్శించగానే, జనకునిలో వివేకం తిరిగి జాగృతమై, అతనిని ఆవరించిన మాయ తొలగిపోయింది.*

*– అఖండజ్యోతి, జూన్ 2013*

*అనువాదం: ఎ. వేణుగోపాల రెడ్డి*

**సృష్టిలో వెలకట్టలేనిది తల్లి ప్రేమ ఒక్కటే**

మస్తిష్కమే కల్పవృక్షం - 10

# సుఖ దుఃఖాలు మానసిక స్థితిపై ఆధారపడి ఉంటాయి



*(సెప్టెంబర్ సంచిక తరువాయి...)*

హేన్స్‌సేల్యే ఒక మహత్వపూర్ణమైన తథ్యాన్ని ప్రతిపాదించాడు. **దైనందిన జీవితంలో ఒత్తిడి అధికంగా పెరుగుతుంటే మన శక్తి కూడా అధికంగానే ఖర్చవుతుంది.** ప్రకృతి ఒక వ్యాపారి. ప్రతివ్యక్తికి ఒక నిశ్చిత పరిమాణంలో కొంతశక్తి భాండాగారాన్ని ప్రసాదిస్తుంది. ఈ భాండాగారాన్ని మనం ఎంత వేగంగా ఖర్చు చేస్తే అంత వేగంగా మనం మన సంతులనాన్ని కోల్పోతూ భయంకర రోగాల బారిలో పడతాము. ఆధునిక సమాజ జీవితంలో హృదయ రోగాలు, కాన్సర్, మాదకద్రవ్యాల వ్యసనం, ఆటంకవాదుల ఆగడాలు, కొట్టుకోవడాలు, ఆత్మహత్యలు, అంతుపట్టని అనేక రోగాలు మొదలైనవి విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ రోగాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలలో అంతులేని నిరాశను పెంచుతున్నాయి.

మానసిక అలసట, సమస్యల గురించి అనేక సంవత్సరాలు పరిశోధన చేసిన రష్యాకు చెందిన డా॥ ఇవాన్ సేమ్యోనోవిక్ ఖోరోలా ఆధునిక సభ్య సమాజానికి చెందిన వ్యక్తులను పడవ పోటీలలో పాల్గొనే నావికులతో పోల్చారు. ఏ విధంగా అయితే వారు వేగంగా, ఇంకా వేగంగా నావను నడిపి నిశ్చయంగా ముందుకు సాగినప్పటికీ, నావికులలోని అంతర్‌శక్తి పిండి వేయబడుతూ వచ్చి, చివరికి పూర్తిగా తగ్గిపోతుంది.

**మానసిక ఉద్వేగం కూడా శరీరంలోని జీవశక్తిని భయంకరంగా నష్టపరుస్తుంది.** ఈ సమస్యపై శరీర శాస్త్రజ్ఞులు, మానసిక శాస్త్రజ్ఞులు దృష్టిని సారించారు. ఈ సమస్యకు సమాధానం కేవలం మందుల వల్ల కానీ లేక పౌష్టికాహారం వల్ల కానీ లభించదు. అదే కనుక సంభవమైతే సంపన్నులందరు ఆరోగ్యంతో ఉండక, అనారోగ్యాలతో కష్టాలను ఎందుకు అనుభవిస్తున్నారు?

విషాణువుల నుండి రక్షణకై రకరకాల టీకాలు వెయ్యటం కూడా భ్రాంతి అనే నిరూపితమవుతోంది. చాలామంది శుభ్రతకు ఎక్కువగా ప్రాముఖ్యతనిస్తారు. అటువంటి స్థితిలో విషాణువులు వారి వరకు చేరే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితులలో వారు రోగగ్రస్తులు కాకుండా ఉండాలి. కానీ మనం చూసేదేమంటే స్వచ్ఛత అభిమానులు కూడా అధికంగా రోగగ్రస్తులు అవుతున్నారు. మురికివాడలలో దినమంతా గడిపేవారు ఆరోగ్య దృష్ట్యా, స్వచ్ఛతావాదులకంటే వెనుకబడిలేరు. ఈ నిజాలను అబద్ధాలుగా కొట్టిపారవేయలేం. అందువలన ఆరోగ్యానికి, అనారోగ్యానికి గల కారణాలను విశ్లేషించటానికి, విశ్లేషకులు ప్రయత్నించినప్పుడు, మానసిక ఉత్తేజం, ఉద్విగ్నత ఆరోగ్యాన్ని వేరుతో సహా తొలచివేస్తుందని నిరూపించబడింది.

అమెరికాకు చెందిన మెడికల్ అసోసియేషన్ మానసిక ఆరోగ్య సమితి సభ్యులు డా॥ ఫ్రాంసిస్ కథనం ప్రకారం ఉత్తేజపూరితమైన మానసిక స్థితి, ఒత్తిడి రక్త ప్రసరణను అస్తవ్యస్తం చేస్తుంది. దీని ఫలితంగా అనేక రకాల రోగాలు ఉత్పన్నమవుతాయి.

ఇదే విధంగా మానసిక శాస్త్రజ్ఞుడు జె.వేస్‌లేండ్ అభిప్రాయం ప్రకారం వృద్ధాప్యము మరణానికి వారంట్ కాదు. బాధలు, నిరాశ, నిష్క్రియత, ఉత్సాహం అంతరించాక ఉత్పన్నమయ్యే నిర్వేదం వలన కలిగిన విసుగు, క్రోధం వలన మనోబలం తగ్గిపోతుంటుంది. ఈ ప్రభావం శరీరంపై వ్యాపించి శిథిలత్వ రూపంలో ప్రస్ఫుటమై మరణ సమయాన్ని దగ్గరకు తెస్తుంది.

హార్ట్‌ఫోర్ట్ కెనెక్టికట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివింగ్ వారు వారి పరిశోధనల ఆధారంగా అకాల వృద్ధాప్యానికి, దుర్బలతకు, రోగాలకు కారణం మానసిక సమన్వయాన్ని కోల్పోవటం, ఆరోగ్య, ఆహార సంబంధిత నియమాలను పాటించక పోవటంగా నిర్ధారించారు. **మానవులు ఉదాసీనంగా ఖిన్నులై, కోపంతో ఉన్నట్లయితే ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఆరోగ్యాన్ని సంరక్షించుకోలేరు.** అప్పుడు పౌష్టికాహారం, ఖరీదైన మందులు సేవించటం వలన కూడా ఏమి ప్రయోజనం ఉండదు. **ఆరోగ్య రక్షణ, దీర్ఘజీవనానికి కావలసినది మానసిక శాంతి, స్థిరత్వం, ఉత్సాహం, ఆశావాదం మాత్రమేనని ఒప్పుకోవాలి.**

ఈ రోజులలో నిద్రలేమి అనే వ్యాధి ప్రబలిపోయింది.

**ప్రతి ఇంట్లో వంట గది ఉన్నట్లే పుస్తకాల గది ఉండాలి**

గాఢమైన నిద్ర అదృష్టవంతులైన ఏ కొద్దిమందికో లభిస్తుంది. **మస్తిష్కానికి సరైన విశ్రాంతి లభించని కారణంగా, ఉత్తేజితమై అంతర్గతమైన అన్ని ప్రక్రియలను అస్తవ్యస్తం చేసి కొత్త రోగాలను సృష్టిస్తుంది.**

నిద్రలేకపోవడం అనేది ఒక రోగం కాదు. మస్తిష్కం అధికమైన, అవ్యవస్థితమైన శ్రమకు గురికావడం దీనికి అసలు కారణం. ఒక్కొక్కసారి ఎక్కువగా చదవడం, రాయడం, ఆలోచించడం, మాట్లాడడం వలన కూడా నిద్రలేమికి గురికావచ్చు. కానీ ప్రధాన కారణం మాత్రం అది కాదు. **భావనాత్మకమైన ఉద్విగ్నత మస్తిష్క సంతులాన్ని పాడుచేస్తుంది.** 10 గంటలు రాయడం, చదవడం వలన కలిగిన శ్రమవలన మస్తిష్కం ఎంత అలసట చెందుతుందో అనే దానితో పోలిస్తే అరగంట సమయాన్ని కోపం లేక దుఃఖభరితమైన ఆలోచనలలో మునిగిపోవటం వలన మస్తిష్కానికి కలిగే అలసట, కోల్పోయే శక్తి అధికం. మధ్యమధ్యలో విశ్రాంతి తీసుకుంటూ చేస్తున్న పనులలో మార్పు చేస్తూ ప్రతిరోజు చదవడం, రాయడం వంటి సాధారణ మానసిక శ్రమను గంటల తరబడి చేయవచ్చు. వీటివలన ఎటువంటి నష్టం జరగదు. ఎంతోమంది విద్వాంసులు వృద్ధాప్యంలో కూడా 8-10 గంటలు శారీరిక, మానసిక పరిశ్రమ చేసి శాంతంగా నిద్రించి ఆనందాన్ని పొందుతూ జీవితాన్ని గడుపుతుంటారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైతే ఆవేశంతో, కోపంతో, ఖిన్నులై కలత చెందిన మనస్సుతో గడుపుతారో వారు మానసికశ్రమ లేనప్పటికీ అలసిపోతారు. వారు మస్తిష్క ఉత్తేజానికి గురవుతారు. పగలు శాంతి ఉండదు. రాత్రి నిద్ర ఉండదు. మెదడుపై అధిక బరువు పడటం వలన మంచి నిద్రరాకపోవడం, కళ్ళు తిరగటం, తలనొప్పి, బ్లడ్ ప్రెషర్, జ్ఞాపకశక్తి తగ్గటం, కోపం, విసుగు, కళ్ళు మండటం, మూర్ఛలు, పిచ్చి, నపుంసకత్వం మొదలైన జబ్బులు ఉత్పన్న మవుతాయి. శరీరానికి కావలసినంత విశ్రాంతి దొరకని కారణంగా దినదినానికి బలహీనమై, కాంతిహీనంగా అవుతారు.

నిద్రలేమి కారణంగా కలిగే శక్తిహీనత అందరికీ తెలిసినదే. అందువలన దీని నివారణకై ఉపాయాలను కూడా ఆలోచించారు. దీనికై అనేక రసాయనిక పదార్థాలను కనుగొన్నారు.

ఇంగ్లండ్‌లోని సండే ఎక్స్‌ప్రెస్ ఒక లేఖలో బ్రిటన్‌లో నిద్ర మందుల ప్రాచుర్యం ఎక్కువ అవటం పట్ల చింతను వ్యక్తం చేస్తూ ఆ దేశంలో లక్షమందికంటే ఎక్కువమంది వ్యక్తులు నిద్రకై ఈ మత్తు మందులపై ఆధారపడుతున్నారని తెలియ జేసింది. ఈ మందులలోని విషతత్వం సేవించేవారి ఆరోగ్యానికి, జీవనానికి సంకట స్థితిని కలిగిస్తుంది.

నిద్ర కోసం వాడే మందులలో పూర్తిగా విషరహితమైన మందు ఇప్పటి వరకు ఒక్కటి కూడా లేదు. ఈ మందులను ప్రతిరోజు వాడటం వలన శరీరంలో ఉత్పన్నమయ్యే కొత్త బాధలు, సంకటాలు నిద్రలేమి వలన కలిగే బాధల కంటే తక్కువేమీ కాదు. ఆపరేషన్ సమయంలో ఉపయోగించే మందులు కూడా తర్వాతి కాలంలో ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి.

రసాయనిక ఔషధాల వలన కలిగే హానిని పరిశీలించిన విజ్ఞానవేత్తలు విద్యుత్తు ఉపచారాల ద్వారా కృత్రిమంగా నిద్రను తెప్పించే దిశగా ఆలోచన చేస్తున్నారు, ఇది దోషరహితమైనదిగా నిర్ధారితమవుతుందని భావిస్తున్నారు. ఫ్రాన్సులో కూడా ఇటువంటి ప్రయోగాలు జరిగాయి. ఎచ్‌లేచూచ్, మాలగ్రేవ్ విద్యుత్తు ద్వారా నిద్రను కలిగింపచేశారు. సమీప భవిష్యత్తులో రసాయనిక సేవలను తొలగించి, కృత్రిమ నిద్రను విద్యుత్తు ఉపచారాల ద్వారా కలిగిస్తారని ప్రొఫెసర్ రూసో ఉద్ఘాటించారు.

లెనిన్‌గ్రాడ్‌కు చెందిన మానసిక శాస్త్రజ్ఞులు కాలేందారోవ్ మానవుల స్నాయువులకు తేలికపాటి విద్యుత్తును ప్రవహింప చేసి, వాటిలో సంచలనాన్ని కలిగించటం వలన స్వాభావికమైన నిద్రను కావలసినంతగా కలిగించటంలో విజయాన్ని సాధించారు. దీనివలన అలసట, అశాంతి, తలనొప్పి మొదలైన బాధల నుండి వెంటనే ఉపశమనాన్ని పొందటం జరిగింది. స్కిజోఫ్రేనియా, న్యూరేస్థేనియా (మతిమరుపు) మొదలైన మస్తిష్కరోగాలు, అల్సర్, ప్రేగులకు సంబంధించిన రోగాలు, ఉదర రోగాలు ఈ పద్ధతి ద్వారా ఆశాజనకంగానేకాక ఆశ్చర్య కరంగా లాభం కూడా జరిగిందనే నిర్ణయానికి వచ్చారు. బ్రోంకియల్ అస్తమా, బ్లడ్‌ప్రెషర్ మొదలైన రోగాలు కూడా ఈ పద్ధతి ద్వారా ఉపశమించాయి.

విద్యుత్తు ద్వారా పొందిన నిద్రకు ముఖ్యమైన లాభం గాఢమైన నిద్రను కోరుకున్నంతసేపు పొందటం, రోగగ్రస్తమైన అవయవాలకు విశ్రాంతినియ్యటం వలన రోగాలతో పోరాడ టానికి, వాటిని నిర్మూలించడానికి వీలవుతుంది. ఇంకొక ప్రక్క అలసిపోయిన అవయవాలను ప్రకృతి మరమ్మత్తు చేయకలుగు తుంది. మంచి నిద్రవలన ఈ రెండు అవసరాలు తీరుతాయి. రసాయనిక ఔషధాల వలన నిద్రను కలిగిస్తే వాటిలోని

**ఇష్టమైన పని ఎంత కష్టమైనా కష్టం అనిపించదు**

విషతుల్యమైన మత్తుమందుల వలన కొత్తబాధలు ఉత్పన్నమయ్యే అవకాశాలు స్పష్టమయ్యాయి. ఈ స్థితిలో విద్యుత్తుధార వలన కలిగించే నిద్ర దోషరహితమైనదని భావిస్తున్నారు.

నిద్రలేమి నివారణకై చేసే ఉపచారాలు మత్తుమందుల తోనా లేక విద్యుత్తు సంచారం వలనా? అనే వివాదంలో మొగ్గు ఎక్కువగా విద్యుత్తుధారవైపే పడుతుంది. ఎందుకంటే దీనివలన మత్తుమందుల విష ప్రభావం లేకపోవడం, మస్తిష్కం మత్తుమందుల వశం కాకపోవటమే కాక విశ్రాంతి కూడా అధికంగా లభిస్తుంది. చాలా సమయం వరకు విశ్రాంతిని కలిగించటం వలన ఉత్తేజాన్ని కోల్పోయిన అవయవాలు కోల్పోయిన శక్తిని తిరిగి పొందేందుకు వాటంతట అవే సిద్ధమవుతాయి. ప్రకృతి ప్రసాదించిన పద్ధతుల ద్వారా వాటి అవసరాలు సహజంగానే లభిస్తాయి.

ఇన్ని చేసినప్పటికీ ముఖ్యమైన ప్రశ్న అలాగే ఉన్నది. మానసిక ఉద్వేగాన్ని తగ్గించాలి. దీనివలన కలిగే ప్రతిక్రియలను అడ్డుకునేందుకు నిద్రమాత్రలను కానీ విద్యుత్తును కానీ ఉపయోగించవచ్చు. మూల కారణాన్ని నివారించి, మానసిక సంతులనాన్ని స్థిరంగా ఉంచేందుకు ఆధ్యాత్మిక దృష్టి వలన మాత్రమే పరిష్కారం లభిస్తుంది. జీవితాన్ని ఆటపాటలతో క్రీడాకారుడి భావనతో జీవించటం, విజయానికి అపజయానికి ఎక్కువ ప్రాముఖ్యతనివ్వకుండా, సంతోషానికి ప్రాధాన్యతనిస్తూ, కర్తవ్యపాలనే ముఖ్యంగా భావించే ఏ వ్యక్తి అయినా కలతబారిన పడకుండా మానసిక సమన్వయాన్ని కోల్పోకుండా స్థిరంగా ఉండగలుగుతాడు.

శవాసనం, శిథిలీకరణ ముద్ర, ధారణ, ధ్యానం, సమాధి మొదలైన యోగాభ్యాసాలకు సంబంధించిన క్రియలు, ప్రతిక్రియలు మానసిక అలసటను, ఒత్తిడిని సహజంగానే దూరం చేయగలవు. ఇవి నిరపాయమైనవి, లాభాన్ని కూడా కలిగించేవి.

**నిరాశ-అలసట :** మనోవైజ్ఞానికుడు సం ఓం జుంగ్ తన పుస్తకం 'మోడ్రన్ మాన్ ఇన్ సర్చ్ ఆఫ్ సోల్' లో రోగులను గురించి చర్చిస్తూ వీరిలో చాలామంది వారి ఉజ్వల భవిష్యత్తుపై భరోసాను పోగొట్టుకున్నారు. ఏ చికిత్స ద్వారానైనా వీరిని సాధారణ స్థితికి తేవటం కష్టం. పోగొట్టుకున్న విశ్వాసాన్ని మళ్ళీ పొందగలిగితేనే వారు రోగాల నుండి విముక్తిని పొందగలుగుతారు అన్నాడు.

**అధిక పరిశ్రమ, పౌష్టికాహారం లేకపోవడం వలన కంటే కూడా మానసిక సమన్వయం కోల్పోవడం ఎక్కువ అలసటకు కారణమవుతుంది.** తొందరపాటు, ఆవేశం, తడబాటు, దిగులు, భావుకత వలన కలిగే భావావేశాలు మానవులలో అత్యధిక అలసటను కలిగిస్తాయని మనోవైజ్ఞానికులు నిర్ధారించారు. నిరాశ నుండి కలిగిన కోపం, విసుగు, తీరని కోరికలు, సామర్థ్యానికి మించిన ఆకాంక్షలు, పరస్పర విరుద్ధమైన ఆలోచనలు, అంతర్యుద్ధం, అనిశ్చిత ధోరణి, ఆత్మహీనత, చేయవలసిన పనిపై అయిష్టత, అపజయం కలుగుతుందే మోనన్న అనుమానం, అవిశ్వాసం, భయం, మొదలైన కారణాల వలన కలిగే అలసట పూర్తి రోజంతా కష్టపడినా కూడా రాదు.

మన శక్తి సామర్థ్యాలకు హద్దులను, సమన్వయాన్ని ఏర్పరుచుకోగలిగితే ఒత్తిడిలేని జీవితాన్ని, తేలికగా జీవించ గలగటమే కాక, ప్రసన్నంగా సంతృప్తికరంగా జీవించ వచ్చు. ఈ చల్లదనాన్ని, సువాసనను మన సమీపంలోని వారందరూ కూడా పొందవచ్చు.

ఆంగ్లేయ రచయిత వేకన్ వృద్ధాప్యంలో చాలా బీదవాడు అయ్యాడు. అతను పుస్తకాల పట్ల అధికంగా ఆకర్షణతో సంపాదనపై అశ్రద్ధ వహించటం వలన ఒకరోజు ఆయన భార్య వృద్ధాప్యంలో ధనం లేకపోవటం ఎంత కష్టం? ఈ స్థితి మీకు కష్టమనిపించటం లేదా? అని అడిగింది.

వేకన్ శాంతంగా - "ధనం సంపాదించటం తేలికే. ధనం ప్రోగు చేయాలనుకుంటే పని కూడా చేస్తాను. కానీ జీవితాన్ని జీవించటం ఎంత కష్టం? నేను ఆ కళను నేర్చుకోవడం ఆరంభిస్తున్నాను. ఈ అనుసంధానంలో, ప్రయోగంలో ఆనందం లభిస్తుంది."

మానసిక స్థిరత్వమే మంచి ఆరోగ్యానికి ఆధారమని మనం ఒప్పుకోవాలి.

మస్తిష్క, మానసిక స్థితుల ప్రభావం శరీరంలోని బాహ్య అంతర్ అవయవాలపై ఉంటుందనేది కాదనలేని నిజం. ఈ ప్రభావం మనపై శుభకరమా, అశుభకరమా అనేది మనపైనే ఆధారపడుతుంది. ఒంటరితనం, ఒత్తిడి, ఆవేశం, ఉత్తేజంతో నిండి బాధాకరమైన జీవితం కావాలా లేక సుఖ-సంతోషాలను అందిపుచ్చుకుని పూలలాగా వికసిస్తూ ఉండాలా అనేది పరిస్థితులపై కాక మనదృష్టి కోణంపై ఆధారపడి ఉంటుంది.

*- అనువాదం: శ్రీమతి ఎ.ఆర్. నిర్మల*

**ఇంట్లోవారితో ప్రేమగా మాట్లాడండి. ప్రపంచ శాంతికి ఇంత కన్నా చేయవలసినది ఏమి లేదు**

యుగ నిర్మాణ యోజన

# మహాకాలుని గీత-సత్సంకల్పాలు - 10

## వ్యక్తి విలువను అతని విద్యార్హత, సంపద ద్వారా కాక అతని సత్కర్మలు, సదాలోచనల ద్వారా గుర్తిస్తాము

మానవుడు ఉన్నతమైన విలువలను తాను పాటిస్తూ ఎంతవరకు ఇతరుల చేత పాటింపచేయగలుగుతున్నాడో అనే దానిని బట్టి అతను ఎంతటి శ్రేష్ఠమైన వ్యక్తి అనేది అంచనా వేయవచ్చు. కొన్ని సమయాలలో మనకు ఉపయోగపడే సాధనాలు కత్తి, కట్టె (అంటే బెదిరించో, దండించో పాటించేలా చేయడం). కానీ ఇటువంటి సాధనాలను ప్రోత్సహించలేము, అలాగని తప్పని చెప్పలేము. ఈ వస్తువులను ఇతరులను బాధ పెట్టేందుకు ఉపయోగిస్తే నిందించాలనిపిస్తుంది, రక్షించేందుకు ఉపయోగిస్తే ప్రోత్సాహించాలనిపించడం సహజం. మానవుని యొక్క శ్రేష్ఠత, యోగ్యతలనేవి కూడా ఇలాంటి సాధనలే. వాటిని ఎక్కడ ఉపయోగిస్తున్నారనేది అతని యొక్క ఆలోచనలు, పనుల ద్వారా మనకు అర్థమవుతుంది. అవి కనుక సదుపయోగపడితే ఆ రెండు సాధనాలు కూడా సదుపయోగపడినట్లే. అలా కాకుండా దురుపయోగం చేస్తే సాధనాలు కూడా దురుపయోగమైనట్లే. మనిషి యొక్క గౌరవ ప్రతిష్ఠలు మంచి ఆలోచనలు, మంచి ప్రవృత్తుల ద్వారానే ఇనుమడిస్తాయి. వాటి ఆధారంగానే అతనికి గౌరవము, సన్మానము లభిస్తాయి.

ఏ పని చేయడం ద్వారా కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించి ప్రశంసించబడతాయో ఆ పని చేసేందుకు, ఆ మార్గంలోనే నడిచేందుకు ప్రజలకు సహజంగానే ప్రోత్సాహం లభిస్తుంది. మనం ఎవరినైనా ప్రశంసించేముందుగాని, నిందించేముందు గాని, గౌరవించేముందుగాని, వ్యతిరేకించేముందుగాని కొంచెం జాగ్రత్తపడగలిగితే ప్రజలను చెడుమార్గం వైపుకు పోనివ్వకుండా మంచి మార్గంలోనే ముందుకు సాగేందుకు చాలావరకు ప్రేరణనివ్వగలుగుతాము. విజయము, యోగ్యత, సంపదలు, వైభవాలను కూడబెట్టినవారిని అందరూ మెచ్చుకుంటారు. చమత్కారాలకు అందరూ అభివాదం చేస్తారు. కానీ ఇది చాలా తప్పు. ప్రజలు సుఖసౌకర్యాల కోసమే కాక, కీర్తిప్రతిష్ఠలు పొందాలనే తాపత్రయంతోనే సంపదను కూడబెడతారు. ఈవిధంగా సంపద ఉన్నవారికి, వైభవం ఉన్నవారికి సమాజంలో కీర్తిప్రతిష్ఠలు లభిస్తూ ఉంటే ఆకలితో మాడిపోయే వ్యక్తి కూడా ఆకలిని మర్చిపోయి వాటినే పొందాలని తపిస్తాడు. అందుకు అతను దేనినైనా వదులుకునేందుకు వెనకాడడు. కళ్ళు మూసుకుపోయిన ప్రజానీకం విజయం సాధించిన వారిని ప్రశంసిస్తారు. అపజయం పొందిన వారిని తక్కువ దృష్టితో చూడడం వల్లనే వారు రోషంతో విజయం సాధించేందుకై ఎటువంటి అవినీతిని అయినా, దుర్మార్గాన్ని అయినా చేసేందుకు కూడా వెనకాడడం లేదు. నీతిమార్గంలో, సదాచారముతో ధనమును సంపాదించిన వారికే ఆదరణ లభించాలి. అంతేకానీ అధర్మమార్గంలో, అవినీతితో సంపాదించిన సంపదతో ధనవంతులుగా మారిన వారిని మనం ఆదరిస్తే వారిలో ఉన్న ఆ అపరాధ ప్రవృత్తికి ప్రోత్సాహం లభిస్తుంది. అపరాధాలు చేసేందుకు చేయూతనిచ్చిన వారమవుతాము. ఇతరులను సన్మార్గంలో నడిపించేందుకు లేదా మంచి వైపు దారి మళ్ళించేందుకు మన దగ్గరున్న ఒకే ఒక సాధనమేమంటే 'ఆదరించడం, నిరాదరించడం'. **ఓటు వేయడమనేది చిన్న సంఘటనే కావచ్చు కానీ దాని ఫలితం చాలా దూరం వరకు వెళ్తుంది.** అదేవిధంగా ఆదరించటం ద్వారా ఎన్నో సుదూర పరిణామాలు సంభవమవుతాయి. ఓట్ల లెక్కింపులో వచ్చే చిన్నపాటి తేడా మొత్తం సంతులనాన్నే తలక్రిందులు చేసేస్తుంది. ఎన్నుకోబడ్డ వ్యక్తి యొక్క వ్యక్తిత్వమును అత్యంత విలువైన స్థానము వరకు తీసుకువెళ్ళి జాతీయ, అంతర్జాతీయ రంగాలలో అతను అప్రతిహతంగా దూసుకు పోయేందుకు దోహదపడుతుంది. ఈ విధంగా ఓటు వేయడం వలన అసంభవాలను ఏవిధంగా సాకారం చేసి చూపిస్తుందో అదే ప్రకారంగా మనదగ్గరుండే ఆదరణ అనే బుద్ధి

**విద్యాగంధాన్ని అందరికి అందించాలి**

వివేకపూరితమైన పాత్రను పోషించగలిగితే చెడు మార్గం వైపుకు పరిగెడుతున్న అడుగులను ఆపవచ్చు మరియు సన్మార్గంలో నడిచేందుకు సంకోచించే బాటసారులకు చక్కటి ప్రేరణ, ప్రోత్సాహము లభించి వారు ఆ దిశవైపుకు తత్పరతతో అగ్రగాములయ్యేందుకు తోడ్పడుతుంది.

ఎవరైతే బాధలను సహిస్తూ కూడా తమ జీవితాలను ఆదర్శములకు అంకితం చేస్తారో వారికి అంతటా గౌరవం లభించాలి. వారిని అందరు ముక్తకంఠంతో ప్రశంసించాలి. ఎవరైతే తప్పుడు మార్గంలో ఉన్నతిని సాధిస్తారో వారికి ఎలాంటి తోడ్పాటు, ప్రశంసలు లభించకుండా చేయాలి. అవాంఛనీయ కార్యములయందు పాల్గొనడమంటే ఒక రకంగా వాటిని ప్రోత్సహించడమే అవుతుంది. ఇలాంటి కార్యక్రమాలలో శ్రేష్ఠులైన మహాపురుషులు పాలుపంచుకుంటే ప్రజలు వారు ఆ కార్యములనకు మద్ధతునిస్తున్నారనుకొని అందరు సహాయం చేసేందుకు ముందుకు వస్తారు. ఈ విధంగా అనుచిత కార్యములతో మనం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమర్ధించి చివరికి వాటిని పెంచేందుకు సాయపడినవారముగా గుర్తింపు పొందవలసి వస్తుంది.

మనం వ్యక్తి విలువను అతని సాఫల్యాలు, విజయాలు మరియు సంపదల ద్వారా కాక అతననుసరించే నీతిమార్గం తద్వారా అతను సాధించే సాఫల్యాల ద్వారానే గుర్తించాలి. అవినీతి మార్గంలో కోటీశ్వరుడైన వ్యక్తి మన దృష్టిలో విలువలేని వాడుగా చూడబడాలి. ఉన్నత ఆదర్శాలను రక్షిస్తూ, జీవితాంతం వాటిని ఆచరిస్తూ ఎలాంటి విపత్కర పరిస్థితులలోనైనా వాటిని విడిచిపెట్టని వ్యక్తి పేదవాడైనా సరే, అతను అపజయాలను పొందేవాడైనా సరే అభినందనీయుడే. అలాంటివారికే గౌరవ ప్రతిష్ఠలు, సహకారము అందరి నుండి లభించాలి. ఎప్పటివరకైతే ప్రజలు నింద, ప్రశంసల యొక్క ఆదరణ నిరాదరణ యొక్క కొలమానాలు మార్చరో అప్పటివరకు తప్పులు చేసేవారంతా మీసాలు త్రిప్పుతూ, తమ విజయాలను చూచి గర్వపడుతూ దినదినాభివృద్ధి చెందుతూ ఇంకా విశృంఖలంగా విజృంభిస్తుంటారు. సదాచార పరాయణులై, పరిమితమైన జయాపజయాలను సాధించేవారు ఖిన్నులై, నిరాశకులోనై సన్మార్గము నుండి తప్పుకుంటారు అనే విషయాన్ని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా గుర్తించుకోవాలి. యుగనిర్మాణ సత్సంకల్పాల ఈ ప్రేరణ 'వ్యక్తి విలువకు గీటు రాయి వ్యక్తి సాఫల్యము, యోగ్యత, అంతస్థులు కాక అతని సద్భావనలు, సత్కర్మలని గుర్తిస్తాము' అనే సంకల్పానికి బలమైన ప్రేరణనివ్వడం జరిగింది. పాత్రతను వికసింప చేసుకోవడమనేది అనేకానేక సంపదలు, విభూతులను పొందేందుకు ఏకైక మార్గము.

– అనువాదం: వల్లీ శ్రీనివాస్

## ఆత్మవిశ్వాసి ఎప్పుడూ సఫలం పొందగలడు

*ఒక సాధారణ కుటుంబంలో పుట్టి తన యోగ్యత, పట్టుదల పురుషార్థపు బలం మీద "బెంజమిన్ డిజరాయలీ" బ్రిటన్ పార్లమెంటుకు సభ్యునిగా ఎన్నుకోబడినప్పుడు, సంపన్న కుటుంబాల నుండి వచ్చిన ఇతర సభ్యులు ఆయనను చాలా చులకనగా చూసేవారు. ఎందుకనో తెలియదు, పాతసభ్యులంతా తమతో కలవడానికి ఆయనకు అవకాశం ఇచ్చేవారు కాదు. బహుశః డిజరాయలీ వేష-భాషలు, స్థితి-గతులు రాజోచితంగా లేనందున కావచ్చు. ఆయన సాధారణ వస్త్రాలను ధరించి, పేదవారి లాగా ఉన్నందున కావచ్చు. ధనమే ప్రధాన దృష్టిగలవారు, పేదవానిని ఎందుకు ఆదరిస్తారు. ఆయన కూడా ఉన్న ఇతర సభ్యులు, ఆయనను ఎంతో ఉపేక్షిస్తూ, ఆయన సభలో మాట్లాడటానికి లేచినప్పుడు, మాట్లాడకుండా చేసినప్పటికి, డిజరాయలీగారు తన మనోబలం మీద స్థిరంగా నిలబడి, తన ఉపన్యాసం చేయనీయని సభ్యులతో ఇలా అన్నారు. "మీరందరూ ఏదో ఒకరోజు నా ఉపన్యాసం తప్పకుండా వినవలసి వస్తుంది." అని.*

*ఈ మాట డిజరాయలీ కాదు అన్నది... ఆయనలోని ఆత్మ విశ్వాసం ఇలా పలికినట్లుంది. ఆయనకు తన ఆంతరిక శక్తుల మీద అపార విశ్వాసమున్నది. ఆయనకు తన పద్ధతిలో ఎలా లెక్కలు వేసుకోవాలో బాగా తెలుసు. భవిష్యత్తునకు సంబంధించి, ఆయన ఎదుట ఒక సునిశ్చిత ప్రణాళిక ఉంది. ఆ ప్రణాళికను దృఢంగా క్రియాన్వితం చేయుట కొరకు, కృతనిశ్చయంతో సంకల్పం చేసుకోవటం జరిగింది.*

– అనువాదం: జి. చెన్నకేశవరావు

**నిజమైన భక్తి అంటే ప్రక్కవారిని ఆదుకోవడమే**

### కుండలినీ మహావిజ్ఞానం-3

# కుండలినీ సాధనతో ప్రాణాగ్ని ప్రజ్వలన

కుండలినీ శక్తి జాగరణ దాని ఉత్థపన (పైకి లేపడం) కఠినమైన పని. దాని కొరకు అసంయమ జీవితానికి అడ్డుకట్ట వేయవలసి ఉంటుంది. అసంయమంతో ఉత్సాహం, ఆనందం కలుగుతాయి, ప్రసన్నత కూడా లభిస్తుంది. స్వాదేంద్రియానికి (నాలుక) కు ఎన్ని రకాల రుచులు చూపిస్తే అంత ఆనందం కలుగుతుంది. ఎన్ని తిన్నా తనివి తీరదు. అది అలవాటుగా మారుతుంది. జననేంద్రియ విషయముల పరిస్థితి కూడా ఇంతే. కాముకుల ఆలోచనలు ఆకాశానికి పాతాళానికి తాకుతుంటాయి, క్రియలో అతిగా పోతుంటారు. వ్యభిచారికి మానసిక తృప్తి ఉండదు, శరీరం అలసిపోతుంది. కానీ మనస్సు మార్పు కోసం, ఇంకా ఇంకా కావాలని అర్రులు జాచుతుంటుంది. ఇతర ఇంద్రియముల విషయం కూడా ఇలాగే ఉంటుంది. మనస్సు 11వ ఇంద్రియము. దానికి మూడింటి మీద రుచి-లోభం, మోహం, అహంకారం. శరీరం బద్ధకం, అజాగ్రత్తకు లోనవుతుంది. సామాన్యజీవనం ఇలాగే ఉంటుంది. పశువుల వంటి, ప్రేతపిశాచముల వంటి దుష్ప్రవృత్తులు అధోదిశగా క్రింద పడవేస్తుంటాయి. వీటిని ఆపగలగటానికి అసాధారణ ప్రయత్నం అవసరమవుతుంది. కానీ సముద్రపు నీటిని మంచి నీటిగా మార్చడం కూడా కఠినమైన పనే. బావులలోని నీటిని, అతిలోతుగా ఉండే చమురు బావులలో నుండి చమురును వెలికి తీయడానికి శక్తివంతమైన పరికరాలు కావలసి వస్తుంది. బరువులను పైకి ఎత్తటానికి క్రేన్ కావలసి ఉంటుంది. ఇక పరికరాలను అమర్చడం, ఉపయోగించడం, వాటిని సవ్యంగా ఉంచుకొనడం ఒక పెద్ద పని. వీటిని నడిపేందుకు సుశిక్షితులైన ఇంజనీర్లు కావాలి. వారికి జ్ఞానంతోపాటు తత్పరత, తన్మయత అవసరమవుతాయి.




1. సహస్రార చక్రము
2. ఆజ్ఞా చక్రము
3. విశుద్ధి చక్రము
4. మణిపూరక చక్రము
5. స్వాధిష్ఠాన చక్రము
6. మూలాధార చక్రము
7. మేరుదండం - దేవయానం

కుండలినీ యొక్క సంయమం, జాగరణ, ఉత్థాపన-ఈ మూడు ఒకదానికంటే ఒకటి కఠినమైనవి. ఇంద్రియ సంయమం, అర్థ సంయమం, సమయ సంయమం మొదలైనవి పాటించవలసి ఉంటుంది. గుర్రాలకు కళ్ళెంవేసి అదుపు చేసినట్లు ఏనుగును అంకుశాన్ని ఉపయోగించి అదుపులో ఉంచే విధంగా అర్థ సంయమం, సమయ సంయమం మొదలైన వాటిని పాటించవలసి ఉంటుంది. నీటి లక్షణం పైనుంచి క్రిందకు పడటం. ఆ లక్షణాన్ని మార్చి పతనోన్ముఖ ప్రవాహాన్ని క్రింద నుండి 1000 అడుగుల పైకి తీసుకెళ్ళాలంటే శక్తివంతమైన మోటారు పంపులు కావలసి ఉంటుంది. ఈ పని సాధారణ ప్రయాసతో జరగవు.

సంయమంతో కూడిన ప్రాణాగ్ని ప్రజ్వలన చేసే ప్రయత్నంలో ఉన్న సాధకుని వికసించిన ఆత్మచేతన, దేవశక్తుల రూపంలో సాకారం అయి పనిచేస్తుంది. దీనికి కొన్ని సుప్రసిద్ధ ఉదాహరణలు ఉన్నాయి. మహాత్ముడైన జడభరతుడు రాజర్షి భరతుని అవతారమే. సింధు రాజు రహూగణునికి అతని పల్లకిని మోస్తూనే ఆత్మజ్ఞానం ప్రదానం చేశాడు. అతనిని ఒకసారి ఒక సర్దార్ పట్టుకుని భద్రకాళి ముందు బలి ఇవ్వడానికి నిలబెట్టాడు. వధించడానికి పురోహితుడు ఖడ్గం తీసుకువచ్చాడు. జడభరతుడు నిర్వికారంగా నిల్చుని ఉన్నాడు. అతని ఆత్మతేజంతో భద్రకాళి జాగృతమయింది. ఆమె పురోహితుని చేతిలోంచి ఖడ్గమును లాక్కుని ఆ దుర్మార్గులను

**ప్రతి క్షణాన్ని ఆస్వాదించాలి**

వధించింది. ఆత్మసత్తాలో ప్రచండ శక్తి, అంతులేని సామర్థ్యం ఉంటాయి. శరీరంలో ఉన్న విద్యుత్తు జాగృతం అయినప్పుడు ఆగ్నేయాస్త్రంవలె పనిచేస్తుంది, ప్రతికూల పరిస్థితులను నిలవరిస్తుంది.

శివుని భార్య సతీదేవి తన తండ్రి దక్షుడు చేసిన యజ్ఞంలో అవమానం భరించలేక యోగాగ్నితో తన శరీరాన్ని భస్మం చేసుకున్నది. నల మహారాజు పత్ని దమయంతి అడవిలో తన శీలరక్షణ కొరకు నేత్ర దృష్టితో వ్యాధుని అగ్నికి ఆహుతి చేసింది. ఇవన్నీ నిద్రాణమై ఉన్న శరీర భాండాగారంలోని శక్తులను జాగృతం చేయడం వలన కలిగిన ఫలశృతులు.

సామాన్యంగా నిద్రిస్తున్న వారిని మేలుకొల్పడంలో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. నిద్రిస్తున్న పిల్లలను, పెద్దలను బలవంతంగా నిద్రలేపితే వారు చాలా కోపిస్తారు. నిద్రిస్తున్న పామును లేపడం చాలా ప్రమాదకరం. పరమాణువు లోపల దాని నాభి కేంద్రంలో అపారమైన శక్తి నిద్రాణమై ఉన్నది. దానిని కనుక విచ్ఛేదన చేస్తే భయంకరమైన విస్ఫోటం జరిగి సర్వనాశనం చేస్తుంది. నాగసాకి, హిరోషిమాలలో అణు విస్ఫోటనం వలన లక్షలాదిమంది సర్వనాశనం అయ్యారు, చుట్టుప్రక్కల ప్రాంతమంతా సర్వనాశనం అయింది. అగ్ని పర్వతాలు ప్రేలడం వలన కొలంబియాలోను, మెక్సికోలోను జరిగిన వినాశనం గురించి వినే ఉంటారు. హెలెనాలో అగ్ని పర్వతం ప్రేలిపోయి ఒక వారం రోజులపాటు వెలుతురు కనిపించలేదు. నల్లటి ధూళి ఆకాశాన్ని కప్పి వేసింది. నిద్రిస్తున్న కుండలినీ శక్తి అటువంటిది. నిద్రిస్తున్న కుంభకర్ణుని ఏనుగుతో త్రొక్కించవలసి వచ్చింది. కుండలిని విషయం కూడా అటువంటిదే. అది నిద్రిస్తున్న స్థితిలో ఉన్నప్పుడు దైనందిన జీవితం మామూలు పనులలో నిమగ్నమయి ఉంటుంది, జీవితం కుంటి నడక నడుస్తుంటుంది. రైలుకు క్రొత్త శక్తివంతమైన ఇంజన్ జోడించినప్పుడు చాలా వేగంగా వెళ్తుంది. కుండలినీ సాధన చేసేవారికి కూడా ప్రారంభదశలో ఇటువంటి ప్రమాదాలు ఎదురవుతాయి. దాని ప్రభావం మామూలు పిల్లగాలివలె కాక తుఫానువలె ఉంటుంది. గాలిలో చక్రవాకం వలె, నీటిలో సుడిగుండంవలె కుండలినీ నడక ఉంటుంది. మహాయోగ విజ్ఞానంలో ఋషి అంటాడు.

**మూలాధారే ఆత్మశక్తిః కుండలినీ పరదేవతా**
**శాయితా భుజగాకారా సార్ధిత్రయ బలయాన్వితా**
**యావత్సా నిద్రితా దేహే తావజ్జీవః పశుర్యథా**
**జ్ఞానం న జాయతే తావత్ కోటియోగవిధేరపి**
**ఆధార శక్తి నిద్రాయాం విశ్వం భవతి నిద్రయా**
**తస్యాం శక్తిప్రబోధేన త్రైలోక్యం ప్రతిబుధ్యతే**

ఆత్మశక్తి కుండలిని మూలాధార చక్రంలో మూడున్నర, చుట్లు చుట్టుకుని సర్పిణివలె శయనిస్తుంది. అది నిద్రిస్తున్నంత వరకు జీవి పశువువలె తయారవుతాడు. ఎంత ప్రయత్నం చేసినా కూడా అతనికి జ్ఞానం కలుగదు. ఆధారశక్తి నిద్రిస్తున్నంత కాలం అతని ప్రపంచం నిద్రిస్తూనే ఉంటుంది. అది జాగృతమైతే అతని భాగ్యము, ప్రపంచం నిద్రలేస్తాయి.

ప్రాణాగ్ని ప్రజ్వలన, ఉద్దీపన అపరిమితమైన గందర గోళాన్ని సృష్టిస్తుంది. తుఫానులతో పాటు సుడిగాలి వచ్చినప్పుడు, పూరిపాకలు ఎగిరిపోతాయి, పెద్ద పెద్ద చెట్లు పడిపోతాయి. ఎండుటాకులు, ధూళికణాలు ఆకాశాన్ని అందుకుంటాయి. నదిలోని సుడిగుండాలు నావను తల్లక్రిందులు చేస్తుంది. సముద్రంలోని సుడిగుండాలు పెద్ద పెద్ద ఓడలను పాతాళానికి పంపిస్తాయి. పిడుగు పడినప్పుడు దాని చుట్టుప్రక్కల తగలబడి పోతుంది.

కుండలినీ జాగరణలో కూడా అటువంటి ఆపదలు ఎదురవుతాయి. దీనిలో సాహసమేగాక, వివేకం, జాగ్రత్త అవసరమవుతాయి. బద్ధకము, అజాగ్రత్త కూడనివి. సర్కస్‌లో సన్నని తీగపై, నడిచేవారు ఎలా సంతులన నిభాయించు కుంటాడో, అదే ప్రకారంగా కుండలినీ జాగరణ ప్రక్రియలో కూడా సాధకుడు ఉచ్ఛస్తరీయ స్థాయి జాగ్రత్త అవసరమవుతుంది. సావధానంగా లేకపోతే ప్రమాదం జరగవచ్చు.

ఈగలు, దోమలు రోజంతా గుట్టలు గుట్టలుగా గ్రుడ్లు పెడుతుంటాయి. చేపలు కూడా ఒకే సమయంలో వందల, వేల గ్రుడ్లు పెడతాయి. వాటికి పిల్లల పాలన పోషణ గురించిన ఆలోచన అవసరం లేదు. కానీ మనుష్యుని విషయంలో గర్భస్థ శిశువు విషయంలో చాలా జాగ్రత్త వహించవలసి వస్తుంది. ప్రసవ సమయంలో తల్లి, మరణంతో సమానమైన వేదనపడి బిడ్డను కంటుంది. కొన్ని సంవత్సరాల వరకు ఆహార విహారాలలో, ఆరోగ్యం గురించి జాగ్రత్త వహిస్తుంది. కుండలినీ జాగరణ మనుష్య శిశువు ప్రసవం, పోషణ చేయడంతో సమానమైనది. ఇది తేలికైన పని కాదు, చాలా కఠినమైన

**జీవితంలోని ప్రతిక్షణం ఎంతో సంతోషంగా, అద్భుతంగా చేసుకోవాలి**

పని, బాధ్యతతో కూడినది. చాలా అప్రమత్తంగా ఉండాలి లేకపోతే ప్రమాదాలు ఎదురవుతాయి.

తేళ్ళ పుట్టుక విచిత్రంగా ఉంటుంది. దాని పొట్టలో అనేక పిల్లలు ఒకేసారి పెరిగి పెద్దదవుతాయి. అవి పెద్దవయినప్పుడు బయటకు రావాలనుకుంటాయి కాని రాలేవు ఎందుకంటే తేలు యొక్క జననేంద్రియ ఛిద్రం (మార్గం) చాలా చిన్నదిగా ఉంటుంది. అవి దానిలోనించి బయటకు రాలేవు. అవి పెద్దదవుతున్న కొద్దీ ఆకలి సతాయిస్తుంది. అవి తల్లి పొట్టనే తినటం ఆరంభిస్తాయి. అక్కడ ఉన్న మాంసాన్ని తిని బయటకు వస్తాయి. తల్లి త్రేలు పొట్ట పగిలి ప్రాణాలు పోగొట్టుకుంటుంది.

కుండలినీ సాధన వలన లభించే సిద్ధుల పుట్టుక కూడా ఈ విధంగానే ఉంటుంది. శాస్త్రకారుల వాక్యాలను అనుసరించి సిద్ధులు జాగృతమైనప్పుడు అవి సాధకుని రక్తాన్ని త్రాగి, మాంసాన్ని తింటాయి, అస్థిపంజరం మిగులుతుంది. ఇది ఒక విధమైన కాయకల్పం, పేరుకుపోయి ఉన్న చెత్తా చెదారం తీసివేయబడి క్రొత్త అంకురం ఉత్పన్నమవుతుంది. తెలివైన తోటమాలి ఈ విధంగానే చేస్తాడు. చెట్లకు ఉన్న ఎండిపోయిన ఆకులు, కొమ్మలు తీసివేస్తాడు. అందువల్ల అవి కొత్త చిగుళ్ళు వేసి, పువ్వులు పూస్తాయి, కాయలు కాస్తాయి. చెట్లు గుబురుగా పెరుగుతాయి. అందంగా ఉంటాయి. కుండలినీ జాగరణలో సాధకుడు తన చెడు సంస్కారాలను, కషాయ కల్మషాలను వదిలించుకోవలసి వస్తుంది. చెట్టును కొంచెం కత్తిరిస్తున్నప్పుడు చెట్టు చిన్నదయినట్లు కనుపిస్తుంది. కానీ అలా ఎక్కువ కాలం ఉండదు. క్రొత్త కొమ్మలు, పువ్వులు రావడం మొదలవుతుంది. శిశిర ఋతువు పోయి, నవవసంతం వస్తుంది. ఫల పుష్పములతో నిండిన శోభ, సంపద దృష్టి గోచరమవుతుంది.

కుండలినీ జాగరణ ఒకరకమైన అగ్ని పరీక్ష. బంగారాన్ని పుటం పెట్టి శుద్ధి చేసినప్పుడు దానిలో కలిపిన ధాతువులు మండిపోతాయి. బంగారానికి ఏమి కాదు, దాని కాంతి శోభ ఇంకా పెరుగుతుంది. ఆ బంగారాన్ని గురించిన సందేహం పటాపంచలవుతుంది. దాని విలువ సరిగ్గా చెప్పగలుగుతారు. కుండలినీ జాగృతమయినప్పుడు సాధకుడు అపరాశక్తిశాలి కాగలడు. శరీరం ముందువలెనే ఉంటుంది. కానీ ఎలాంటి విద్యుత్తు జాగృతమవుతుందంటే దానితో అంతః జాగరణ జరుగుతుంది. బాహ్య వాతావరణమును కూడా పరివర్తన చేయగలుగుతుంది.

అగ్ని ప్రజ్వలించడం వలన అనేక పనులు చేసుకోవచ్చు. దానితో తడిగా ఉన్న ఇటుకలు, కుండలు కాలి గట్టిపడతాయి. ధాతువులను శుభ్రపరచవచ్చు. కుండలిని యొక్క అగ్ని అంతరాళములలో వెలిగినప్పుడు చలి అప్పటికప్పుడు దూరమవుతుంది. అగ్నితో ఆకలి మంటను ఆర్పే చక్కని వంటకాలు తయారు చేసుకోవచ్చు. ఇంకా అనేక అనేక రకాల పనులు బాహ్య జగత్తులో చేసుకోవచ్చు. కుండలినీ జాగరణ వలన భౌతిక ప్రయోజనాలు చాలా ఉన్నాయి, అనేక కష్టాలు నివారింపబడతాయి. అగ్నిని దేవపూజంలో కూడా ప్రయోగిస్తారు. దీపం, అగరుబత్తీ, హారతి, హవనంలో అగ్నిని ఉపయోగిస్తారు. దైవీశక్తుల సాన్నిధ్యం కొరకు, సంపర్కం పెంచుకొనడం కొరకు కూడా అగ్ని యొక్క ఉపయోగం ఉన్నది. అగ్నితో గ్యాస్ వెల్డింగ్‌తో ఇనుప ముక్కలను అతికించవచ్చు. అది అతుక్కున్న చోట విరిగిపోతాయన్న భయం ఉండనే ఉండదు. సాధారణంగా ఉపాసనలో భావనాత్మక ఆటుపోట్లు వస్తుంటాయి. ఒక్కొక్కసారి భక్తిభావన ఎక్కువగా ఉంటుంది, అది పాలు పొంగినట్లు పొంగి మరల మామూలు స్థితికి వస్తుంది. కాని కుండలినీ జాగరణ జరిగినట్లయితే ఆ భావన శాశ్వతంగా ఉంటుంది.

గడ్డి వేసవి కాలంలో ఎండిపోయి, మరల వర్షాలు పడినప్పుడు చిగురిస్తుంది. ఎండిపోయిన మనుష్యుని చెడు సంస్కారములు కూడా పరిస్థితి కారణంగా తిరిగి జీవంత మవుతాయి. విశ్వామిత్రుడు తపస్వి, ఋషి. కానీ మేనకకు లొంగిపోయాడు, గృహస్థుడయ్యాడు. సంతానాన్ని పొందాడు. సాధకుని సంస్కారాలు సమూలంగా దహించబడితే అటువంటివి తలెత్తే ప్రమాదం ఉండదు. శుకదేవుని స్థితి ఆయన తండ్రి వ్యాసుల వారికి భిన్నంగా ఉండేది. వేదవ్యాసుడు తల్లి బలవంతం మీద అంబిక, అంబాలికలతో సంతానోత్పాదనకు ఒప్పుకున్నాడు, కానీ శుకదేవుడు జన్మిస్తూనే తపస్సు చేసుకునేందుకు అడవులకు వెళ్ళాడు. తండ్రితోపాటు ఎంతమంది ఆపాలని ప్రయత్నించినా ఆయన ఆగలేదు. ఇంద్రుడు ఆయనను పరీక్షించడం కొరకు అప్సరస రంభను పంపించారు. కానీ ఆయన ఆమెను తిరస్కరించి పంపించేశారు. ఇదే కుసంస్కారములను దహించడం అంటే. కుండలినీ శక్తి సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలనే మూడు కర్మలను భస్మం చేస్తుంది. దీనిలో తపింపబడిన సాధకుడు కాలిన ఇటుకవలె గట్టిబడతాడు.

**భవిష్యత్తు మీద నమ్మకం లేనివారినే గతం వెంటాడుతుంది**

ఆయుర్వేదం తెలిసినవారు రస, భస్మాలను తయారు చేస్తారు. అవి శతపుటి, సహస్రపుటి, గజపుటి అనే అగ్ని సంస్కారములతో తయారు చేయబడతాయి. వాటికి సంజీవని అనే ఉపమానం ఇవ్వబడింది. ఇది కూడా అగ్ని సంస్కారమే. కుండలినీ యోగాగ్నిగా చెప్పబడింది. ఇది ఒకరకంగా ప్రాణాగ్ని ప్రజ్వలన యజ్ఞ ప్రక్రియ. సామాన్య ధాతువులు రసముగా, భస్మంగా తయారయి సంజీవనివలె పనిచేసినట్లు దీనిలో పక్వం చేయబడిన సాధకుడు తయారవుతాడు. కుండలినీ అగ్నిలో తపించబడిన వ్యక్తి కూడా అసమాన్యుడు కాగలడు. అతని సామర్థ్యములు అసాధారణ రూపములో వికసించడం చూడవచ్చు.

ఆవిరి చెల్లాచెదరవుతుంటే దానికి ఏ మహత్వం ఉండదు. అది అలా గాలిలో ఎగిరిపోతుంది. కానీ దానిని ఒకచోట బంధించి ఉంచితే దాని శక్తితో రైలు ఇంజన్ పరుగెత్తుతుంది. ప్రెషర్ కుక్కర్లో నిమిషాలలో అన్నం ఉడుకుతుంది. ఇదే విధంగా శరీరంలో నిద్రాణమై, చిందరవందరగా పడి ఉన్న శక్తి కుండలినీ జాగరణ ప్రయోగం ద్వారా ఏకత్రితమవుతుంది. అప్పుడు ఆత్మిక రిద్ధులు, సిద్ధులు అనాయాసంగా లభిస్తాయి. వాటి ద్వారా అనేక ప్రయోజనములు సమకూరుతాయి.

మనిషి శరీరంలో శక్తివంతమైన విద్యుత్తు భాండాగారం నిండి ఉన్నది. కాని అది చెల్లాచెదురై ఉన్నది. అందువలన దాని ప్రభావం కనుపించదు. కానీ దానిని కుండలినీ జాగరణతో సమీకరించి మూలాధార చక్రంలో కేంద్రీకరించ గలిగితే దాని పరిణామం కూడా సువిస్తృత శక్తి యొక్క ఏకీకృత స్థితిని పొందుతుంది. ఈ కేంద్రీభూతమైన విద్యుచ్ఛక్తిని ఉపయోగించడం వలన ఆశ్చర్యజనకమైన ఫలితాలు లభిస్తాయి.

*– అఖండజ్యోతి, జనవరి 1987*

## గురు ప్రేమ

*గురువును కాలు పెట్టి తన్నినా యోగమయింది (స్పర్శ వలన). 95000 సంవత్సరాల క్రిందటి యదార్థ సంఘటన.*

*ఈజిప్టులోని అడవులలో ఒక పండు ముదుసలి ఉండేవాడు. ఆయనకు దాహంతో నాలుక పిడచకట్టుకు పోతూ ఉంది. నోరు తడారిపోతూ ఉండగా, అదే దారి వెంటపోతున్న యువకుడైన బాటసారితో, దాహంగా ఉంది, కాసిని మంచి నీళ్ళు ఇవ్వు నాయనా అని అర్థించాడు. అసలే బందిపోటు దొంగ, తీసికోవటమే కాని, ఇవ్వటం అలవాటు లేనందున ఈసడించుకుంటూ అలవాటు కొద్దీ కాలితో వేగంగా ముదుసలిని ఒక తన్ను తన్ని తిడుతూ వెళ్ళిపోయాడు. ఈ సంఘటనలో యువకుని చెంతనున్న తోలు సంచిలోని నీరు చింది కొన్ని చుక్కలు ముదుసలి ముఖముపైన పెదవులపై పడ్డాయి. తదుపరి ముదుసలి, యువకుడు ఇరువురూ అనేక జన్మలనెత్తారు. అలనాటి బందిపోటు యువకుడు 1920లో అలహాబాద్‌లో "లీడర్" అనే ఆంగ్ల పత్రికకు ఎడిటర్‌గా పనిచేస్తున్న సమయం. అలనాటి ఆ పండు ముదుసలి, పరిణామక్రమంలో ఎదిగి ఒక గొప్ప ఋషిగా హిమాలయాలలో ఉంటున్నాడు. ఈ ఋషి సత్తముడు తన సాధనా జ్ఞానాన్ని మానవాళికి అందించదలచి, సరియైన వ్యక్తికొరకు తన దివ్య చక్షువులతో వెదుకనారంభించాడు. అలనాడు ఈజిప్టు అడవులలో తనను వెటకారంగా చూస్తూ మంచి నీరివ్వకుండా కాలితో తన్నిన వ్యక్తి ఆయన దృష్టిలో పడ్డాడు. అతడే తన పనికి సరియైన, వ్యక్తిగా భావించిన హిమాలయ ఋషి పుంగవుడు "లీడర్" పత్రిక ఎడిటర్‌ను తన పనికై నియోగించాడు. 5 నుండి 6 సంవత్సరాల పాటు ఆ ఎడిటర్‌ను అనునయించి తన పనికి అనుకూలంగా మార్చుకొన్నాడు. అటుపిమ్మట అతని చేత "ఈసోటరిక్ బుద్ధిజమ్" అనే గ్రంథాన్ని వ్రాయించాడు. అలనాడు కాలితో తనకు తెలియకుండానే ఋషి దాహార్తిని లేశమంత చల్లార్చిన ఆ యువకుని మేలును, ఈ రీతిగా ఈ ఋషి రూపంలో అతనికి, గురువుగా వచ్చి తన ఋణాన్ని తీర్చుకున్నాడు. ఈవిధంగా గురువులు తమను అంటి పెట్టుకున్న వారిపై ప్రేమను కురిపిస్తూ తెరచాటున ఉండి వారికి పేరు ప్రఖ్యాతులను ఆర్జించుకొనే అవకాశాన్ని అందిస్తారు.*

*– మూలం: డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారుగారి ఉపన్యాసాల నుండి*
*సేకరణ: ఎ. వేణుగోపాల రెడ్డి*

**మీలో మీరు ప్రశాంతంగా ఉంటే చుట్టుప్రక్కల ప్రశాంతంగా ఉంటుంది**

ఫ్లయింగ్ సాసర్స్

# అన్యగ్రహ జీవులు పృథ్వీ మీదకు రాక

భూమి మీదకు ఇతర గ్రహవాసులు ఎగిరే పళ్ళాలు (Flying Saucers) మీద వచ్చిన దాఖలాలను గురించి ఎన్నో చర్చలు ప్రపంచమంతా జరిగాయి. ఇప్పుడు ప్రతి ఆదివారం టెలివిజన్‌లో ప్రొజెక్టు U.F.O. అనే ఒక సీరియల్‌ని కూడా ప్రసారం చేస్తుంది. ఇది ఒక కథ గాక, ఇతర గ్రహవాసులు గురించి తీసిన ఒక లఘు సినిమా. దీని ద్వారా అంతరిక్షపరిశోధన చేయు శాస్త్రజ్ఞుల కృషి తెలుస్తుంది. ప్రాచీన ఇతిహాస కాలపు గుర్తులు అక్కడక్కడ కనిపించుట జరిగింది. అన్నిటికన్నా ముఖ్యమైన విషయం గమనించవలసిందేమంటే మానవ హృదయంలో కనిపించే ఆదర్శవాదము, సదాశయనీతి ఇంకా యోగాభ్యాస ఆధారం మీద లేక ఒక్కోసారి ఎటువంటి శ్రమ లేకుండా కూడా అతీంద్రియ శక్తుల వికసింపబడటం 'డార్విన్' మహాశయుని జీవ పరిణామ సిద్ధాంతంలో లయబద్ధంగా సరిపోవటం లేదు. పరిణామ వికాససిద్ధాంతం మానవేతర చిన్న జీవ- జంతువులకు కొంత వరకు అన్వయం జరుపవచ్చు కానీ మానవుల విషయంలో మాత్రం సరికాదు. మనిషి అనే ప్రాణి శారీరిక మానసిక క్షేత్రాలలో విలక్షణమైన ఎన్నో అనుభూతులు బీజరూపంలో నిక్షిప్తమై ఉన్నాయి, వ్యక్తి వికాసం గురించి ఏ చిన్న ప్రయత్నం జరిపినా, అతనికి అవి తమ విలక్షణ విభూతులను పరిచయం చేయుట జరుగుతుంది. ఇదేమిటి? అన్న ప్రశ్నకు జవాబు అతని వంశ క్రమపరంపర ఆధారం మీద ఇచ్చుట సాధ్యం కాని పని.



ఆధ్యాత్మికవాది ఈ రహస్యానికి సమాధానం ఈ విధంగా ఇచ్చుట జరిగింది. మానవులు దైవీ పరివారపు సమూహంలో ఒక భాగం. వారు దేవతల సంతానం. పురాతత్వవేత్తలు, జీవ శాస్త్రజ్ఞులు ఇలా అనుకుంటున్నారు - మనిషి అనే ప్రాణిని సమాజంలో అనేక దృష్టికోణాలలోనుంచి చూస్తే "మానవుల సంరచన ఏవో రసాయనిక పదార్థాల పరిణితి కాదని వారంతా వికాస క్రమంలో మేఘాలపై తేలుతూ లేక, జలంలో, స్థలంలో సంచారము చేయు పక్షులుగానో లేక ఏ ఇతర జీవరాశిగానో ముందుగా ఉన్నట్లు తేల్చి చెప్పటం ఎంతో కష్టం." అయితే కొంతమంది జీవ వైజ్ఞానికులు మానవులు ఏదో ఒక అన్యగ్రహం నుండి భూమిమీదకు దిగి ఉండవచ్చని, ఈ భూమికంటే కూడా ఎంతో పురాతనమైన, వికాసం చెందిన నాగరికత కలిగిన ఎన్నో గ్రహతారకలు ఈ విశాల బ్రహ్మాండంలో ఉండి ఉన్నట్లు విశ్వసిస్తున్నారు.

ఇందుకు నిదర్శనం భూమిమీద పడిన ఎగిరే పళ్ళాల (Flying Saucers) అవశేషాలు. మెరుస్తూ, గిర్రున తిరుగుతూ, మాయమవుతున్న వీటిని ఒక ప్రకృతి చమత్కారంగా లేక భ్రమగా అనుకొన్నప్పటికీ, అలా క్రింద పడిన అవశేషాల గురించి ఏమనుకోవాలి? ఇంతేగాక అటువంటి ప్రాణుల అస్థిత్వం కూడా ఆలోచించగల రహస్యమేనని నమ్మవలసి వస్తుంది. ఎగిరే పళ్ళాల ద్వారా భూమికి దిగిన తరువాత కొన్ని పరిస్థితుల వలన తిరిగి వెళ్ళలేకపోయి ఉండవచ్చు. ఈ సత్యాన్ని గమనించగా తేలిన విషయం ఏవో ప్రాణులు ఈ భూమికి వచ్చినట్లు బలమైన సాక్ష్యం లభిస్తుంది? ఈ అవశేషాలను, ఆగంతుకులను ఎవరు చూసారో, ఎవరి చేతికి చిక్కాయో, అటువంటి వారిపై ఎటువంటి విషయం బైటకు చెప్పకూడదనే ఆంక్షలు వేయటం జరిగింది. దీన్ని ఎంతో గోప్యంగా ఉంచుట జరిగింది. అంతరిక్షపు వెదుకులాటలో మనుష్యులు రహస్య శోధన కొరకు చేస్తున్న ప్రయత్నాలలో అంతర్ గ్రహవాసులు ఆగమనపు సంబంధమైన విషయాలు ఉపయోగపడుతాయన్న ఆలోచనతో ఇలా రహస్యాలను దాస్తున్నారా? సహయోగికిగాని లేక విపక్షాలకు గాని ఈ విషయాలు తెలియకుండా చేయాలనుకుంటునట్టు భావించవచ్చు.

అమెరికాలోని న్యూ మెక్సికో క్షేత్రంలో 1946 నుండి 1948 వరకు ఎన్నో ఎగిరే పళ్ళాలు కనిపించినందున, ఈ విషయం నమ్మవలసి వచ్చింది. ప్రపంచంలోని అన్య స్థానాలలో కాకుండా కేవలం ఈ క్షేత్రంలో నిరంతరం అవి ఎందుకొరకు దిగుతున్నాయో అంతుబట్టని విషయం. బహుశః పురాతన కాలంలోని నాగరికత అవశేషాలు ఈ క్షేత్రంలోనే ఎక్కువగా కనిపించినందువలన కావచ్చు. ఆ కాలపు నాగరికత గురించి సంపర్కం పెట్టుకొని,

**ఎంత ఎదిగినా ఒదిగి ఉండటమే మంచిది**

ఆనాటి సభ్యత యొక్క ప్రతినిధిత్వం చేయగలవారి అన్వేషణ నిమిత్తం, ఈ క్షేత్రాన్ని గుర్తించిన కారణంగా ఇక్కడే ఆ ఫ్లయింగ్ సాసర్స్ దిగుతున్నట్లు అనుకోవాలి.

1947 జులైలో ఒక ఎగిరే పళ్ళెం భూమిని ఢీకొని పడిపోవటం జరిగింది. అప్పుడు అమెరికాలోని రహస్య గుప్తచార విభాగం వారికి అటువంటి విచిత్ర వస్తువుల వివరాలు అందినందున వెదుకులాట గస్తీని తీవ్రతరం చేసి, ఆ వస్తువు గురించి తెలుసుకొనటానికి ప్రయత్నించుట జరిగింది. జూన్ 25న ఇంతకు క్రితం డా॥ ఆర్.ఎఫ్.సెన్‌సెబాబర్ అనే ఆయన ఇటువంటి ఘటన చూచుట జరిగింది. ఆయన దీనిని ప్రత్యక్షంగా చూసిన వారితో మాట్లాడుట జరిగింది. 27 జూన్‌లో మేజర్ 'జార్జి విల్ బాక్స్' కూడా దానిని చాలా దగ్గరగా చూచుట జరిగింది. ఆయనే కాదు, ఆయన ధర్మపత్ని కూడా దగ్గరగానే చూసింది. ఈ సందర్భంలో అంతకుముందు అనగా జూన్ 26న ఇటువంటి అద్భుత ప్రమాణాన్ని డా॥ లియో ఆరగిహ అనే ఆయన కూడా చూసాడు. ఇవి జరిగిన వారం తరువాత ఇటువంటి అనుకూల-ప్రాతికూలలన్నిటిని జోడించి 'రిజవెల్' అనే స్థానీయ పత్రికా విలేఖరి పత్రికలో వార్తను ప్రకటించేందుకు ప్రయత్నించే సమయంలో రహస్య గూఢాచారుల నుండి ఆ వార్తను ప్రకటించ కూడదనే ఆదేశం అందుకోవటం జరిగింది, ఇది ఎంతో రహస్య మైనదని ప్రతిబంధం వేయడం జరిగింది. ఇటువంటి నిషేధమే వాయుసేన మీద కూడా విధించుట జరిగింది. ఈ విషయం ఏ మాత్రం బయట పడకూడదని, ఎవరితో చెప్పకూడదనే ఆంక్షలు పెట్టుట జరిగింది.

తరువాత ప్రభుత్వం తరపున ఒక సైనిక ఆఫీసులో ప్రెస్ కాన్ఫరెన్స్ (Press Conference) ఏర్పాటు చేసి ఈ ఒక్క ముక్కే చెప్పుట జరిగింది.

"అదొక వాతావరణంతో ఏర్పడిన మార్పులని అంతకు మించి మరేమి కాదని" వివరణ ఇచ్చారు. దీనికి సంబంధించి జన సమూహంలో ఏం జరిగిందనే దాని గురించి వాదోపవాదాలు జరిగాయి. అయితే 'బ్రిటన్ రాయల్ ఫోర్స్' కి సంబంధించిన ఒక అధికారి 'రాయబెల్' క్షేత్రంలో ఒక ఎగిరేపళ్ళెం పడినట్లు చెప్పాడు.

వీటన్నింటికి విరుద్ధంగా ప్రత్యక్షంగా చూసిన సాక్ష్యాల మీద ఆంక్ష విధించుట జరిగింది. శ్రీమతి 'బెనెవ' అనే ఆమె ఆ పళ్ళెం భూమిని ఢీ కొనటం స్వయంగా చూసినట్లు చెప్పింది. అంతేగాక దానిలో కొంతమంది చనిపోయిన వారిని కూడా చూసినట్లు ప్రకటించింది.

ఇక రెండవ సూచన ప్రకారం 1947లో 'సెంట్ అగస్టాయాన్' మైదానంలో కూలిపోయిన ఎగిరే పళ్ళెంలో 26 మంది మృతులు; ఒక జీవించి ఉన్న ప్రాణి ఉన్న విషయం, విస్తృత వివరణతో 'స్ప్రింగ్ ఫీల్' పేరుగల గూఢాచారి సేకరించినప్పటికి, అతనిని కూడా ఈ రహస్యాన్ని బయటకు చెప్పకూడదని ఆదేశించుట జరిగింది.

ఇటువంటి ఆంక్షలునప్పటికి, ఒక సైనికుడు తన కుమారునకు వ్రాసిన ఉత్తరంలో పడిపోయిన ఎగిరే పళ్ళెం గురించి, దానిలో మృతుల గురించి, జీవించి ఉన్న వారి గురించి సమాచారం ఇచ్చుట జరిగింది. ఆ లేఖలో ఆ ప్రాణులు పొడవు 4 అడుగులని, వారి శరీరాలు బలంగా ఉండినట్లు, వస్త్రాలు ధరించలేదని వ్రాసాడు. ఈ ఉత్తరం పత్రికల వారికి చిక్కింది. ఈ వార్త ప్రజలందరికి అంది చర్చలు జరిగాయి. ఆ తరువాత ఆ మృతప్రాణుల గురించి గాని, జీవించి ఉన్న శరీరం గురించి గాని ఎటువంటి సమాచారం లభించలేదు.

ఈ క్రింది వివరణ జరిగిన విషయం గురించి కొంత తెలుసుకొనుటకు అవకాశమేర్పడుతుంది. రష్యాలో, ఇతర దేశాలలో, పర్వతాలలో అరణ్యాలలో లేక జలాశయాలలో కూడా ఇటువంటి ఘటనలు, జరిగి వాటిని తెలుసుకున్నవారున్నారో, వారందరి మీద "Top Secret" వంటి ఆంక్ష విధించి, అదుపు లోకి తీసుకోవటం ఎంతో ఆశ్చర్యకరమైన విషయం.

అంతరిక్షపు విమానం భూమి మీదకు వచ్చినప్పుడు అందులో కొంతమంది జీవించి ఉన్నవారు వెనుదిరిగి తమ జన్మగ్రహానికి చేరి పృథ్వి వర్తమానపు స్థితిని వివరించగల అవకాశముంది.

నిశ్చయంగా ఇది ఒక ఆక్రమణ మాత్రం కాదు. అందుచేత మనకు ఏ అంతరిక్షీయుల నుండి ప్రమాదం వాటిల్లగలదనే భయం చెందవలసిన పనిలేదు. ఇదొక వెదుకులాట ప్రయత్నమే! దీని ఉద్దేశ్యం పరస్పరం ఇచ్చి-పుచ్చుకోగల సహాయోగంతో కూడిన ప్రగతిశీలతకు కారణం కావచ్చు. ఇది ఒక మంచి నాగరికతతో కూడిన వారితో చెలిమిగాను, లేక పరస్పరం ఇతర అవసరాలను తీర్చుకోగల విధానం కూడా అయి ఉండవచ్చు.

*– అఖండజ్యోతి, జులై 1985*

*అనువాదం: జి. చెన్నకేశవరావు*

**వినమ్రత అంటే అందరిలోను భగవంతుని దర్శించే ప్రయత్నమే**

కుటుంబ నిర్మాణం

# కుటుంబానికి మూలం - దాంపత్య జీవితం

దాంపత్యజీవితము మీదనే వ్యక్తిగతమైన ఉన్నతి, కుటుంబ వికాసము, సామాజిక పురోగతి ఆధారపడి ఉంటుంది. పతీపత్నుల సహయోగము, ఏకాత్మత, పరస్పర ఆత్మోన్నతి, త్యాగము, సేవ మున్నగువాటి చేత దాంపత్యజీవితము యొక్క సుఖము, స్వర్గానుభూతి సహజముగానే ఒనగూడుతాయి. తద్వారా మనిషి యొక్క అంతరంగిక, బాహ్యజీవన వికాసములో చాలా గొప్ప సహాయము లభిస్తుంది. ఆరోగ్యకరమైన, సంతులితమైన, సౌందర్యవంతమైన దాంపత్యజీవితము స్వర్గమునకు చేర్చే నిచ్చెనవంటిది. మానవ జీవితమునకు ప్రేరణ ఇస్తుంది.



సుదీర్ఘ జీవన లక్ష్యమును ఎన్నుకొనుటలో భార్యాభర్తలు అన్యోనంగా కలసి సాగించే యాత్రను వైవాహిక జీవితము సహజము, సుగమముగావిస్తుంది. స్త్రీ శక్తి స్వరూపిణి. పురుషుడు పౌరుషమునకు ప్రతీక! ఒకటి లేకుండా రెండవది నిరర్థకము. శక్తి పౌరుషము సమానముగా ప్రవహిస్తూ ఏకత్రాటిపై సాగుట అన్నది నవసృజనకు, నవనిర్మాణమునకు ఆవశ్యకం. వీటి అసంబద్ధత, అసమానతలే అవరోధము, హాని, పతనానికి కారణమవుతాయి. దంపతుల మధ్య విరోధము, ద్వేషము, స్వార్థములనే అగ్ని రగిలినప్పుడు దాంపత్య జీవితములోని సౌందర్యవికాసములు, ప్రగతి, మహత్వపూర్ణమైన అవకాశాలు ప్రథమదశలోనే క్షీణించిపోతాయి.

పతీపత్నులు సంసారరథమునకు రెండు చక్రముల వంటివారు కనుక వైవాహిక జీవితములో తమ భాగస్వామిని ఎన్నుకొనుటలో ఎంత అప్రమత్తముగా ఉంటే, దాంపత్య జీవితము అంత సంపూర్ణముగా సుఖమయము, స్వర్గము వంటిదై, ఉన్నతి, ప్రగతిలతో అలరారుతుంది. ఇద్దరిలో ఒకరు అయోగ్యులు, బలహీనులయినా గృహస్థజీవన రథము ప్రమాదమునకు గురై ఒకప్రక్కకు ఒరిగిపోతుంది. తత్కారణముగా పతీపత్నుల జీవితమేకాదు, కుటుంబ, సమాజ జీవనములో సైతము ప్రగతి కుంటుపడుతుంది. ఎందుకంటే దాంపత్య జీవితము మీదనే కుటుంబమనే భవన పునాదులు నిలిచి ఉంటాయి కనుక. **చక్కని కుటుంబము ద్వారా మంచి సమాజము నిర్మితమవుతుంది.** అందుచేత స్త్రీ-పురుషుల జీవితములో సరైన జీవిత భాగస్వామిని ఎన్నుకొనుట అన్నది ఒక మహత్వపూర్ణమైన అంశము.

గొప్ప గొప్ప ఆశలు, ఆకాంక్షలతో యువతీ-యువకులు వైవాహిక జీవన సూత్రముతో ముడిపడతారు. వివాహ వేడుకలు ఘనముగా జరుగుతాయి. ప్రారంభములో దంపతుల మధ్య చోటుచుసుకునే కొంగ్రొత్త ఆకర్షణ కారణముగా సుఖమయ జీవితమును అందిపుచ్చుకుంటారు. అయితే ఈ స్థితి ఎక్కువ కాలము కొనసాగదు. నెమ్మదిగా వీరి వైవాహిక జీవితము కలహం, అశాంతి, ద్వేషంవంటి అగ్నిలో జ్వలించడము ఆరంభమవుతుంది.

ఇక అప్పుడు వివాహ సమయములో పురోహితుడు సంప్రదాయమును అనుసరించి వేద మంత్రోచ్చారణ ద్వారా పలికించిన ప్రతిజ్ఞలకు వ్యావహారిక జీవితములో ఎట్టి స్థానము ఉండదు. జీవితము ఇరువురికి భారమవుతుంది. బాహ్య కారణముల వలనకాక భార్యాభర్తల మధ్య నడవడిక, ఆచరణలలో పెచ్చరిల్లిన వికృతులే దీనికి కారణమవుతాయి. ఈ లోటుపాట్లను, పొరపాట్లను చక్కదిద్దుకుంటే జీవితములో సంతోషము వెల్లివిరుస్తుంది.

దాంపత్య జీవితము సుఖ సమృద్ధులతో అలరారేందుకు 'వ్యావహారిక జీవితములో ఒకరి భావాలను మరొకరు గౌరవించుట అన్నదే మహత్వపూర్ణ స్థానమును అలంకరిస్తుంది.'

**కోపాన్ని సమస్యలపైకి మళ్ళించి పరిష్కారాలు వెదకాలి**

భార్యాభర్తలు సైతము నిరంతరము ఒకరు మరొకరి భావనలను, విశ్వాసములను గౌరవించాలి. అయితే లోకములో ఇందుకు విరుద్ధముగా స్వీయఆకాంక్షలు, భావనలు, ఆలోచనలకే ప్రాధాన్యమివ్వబడుతున్నది. ఎదుటివారి భావనలను నిర్దయగా కాలరాస్తున్నారు. తత్ఫలితముగా ఇద్దరి ఐకమత్యము, సహయోగములు చక్కగా పరిమళించవలసిన స్థానములో అసంతోషమనే దుమారం చెలరేగుతుంది. భార్యాభర్తలు తమ ఇచ్ఛానుసారం పెత్తనం చెలాయిస్తూ బలవంతముగా ఎదుటి వారిచేత పనులు చేయిస్తే కనుక వారి పట్ల మనస్సులో కోపం, ద్వేషము ఎగసిపడతాయి. ఇద్దరూ ఎదుటివారి భావాలను, అభిరుచులను గాలికొదిలేసి చిన్న చిన్న విషయాలకే మంకుపట్టు పడితే అది చిలికి చిలికి గాలివానగా మారి సంసారము భారంగా మారుతుంది. తత్కారణముగా రగిలిన అశాంతి, చిరాకుల వలన ఇద్దరి వ్యవహారములు శృతిమించి రాగానపడి, కొట్లాటకు దారితీసి చివరకు అది పరస్పర ఆరోపణలకు స్థానమిస్తుంది.

పతీపత్నులు సదా ఒకరి భావాలను, ఆలోచనలను, స్వతంత్ర అస్థిత్వమును మరొకరు గమనములో ఉంచుకుంటూ వ్యవహారశైలిని నడపటమనేది దాంపత్యజీవితమునకు ఆవశ్యకమైన సూత్రము. ఇది కొరవడిన కారణముగానే ఈనాడు వైవాహికజీవితము అశాంతికి నిలయముగా మారుతున్నది. తమ ఇష్టానికి విరుద్ధంగాను, ధనలేమిచేత భర్తలు తమ భార్యలు కోరే ఖరీదైన కోర్కెలను తీర్చలేక ఇబ్బందులకు గురి అవుతారు. అలాగే భర్తల స్వేచ్ఛాజీవితము కూడా భార్యల అసంతోషమునకు దారితీస్తుంది.

ఇతరుల భావనలను, స్వేచ్ఛను, ఆలోచనలను గౌరవించక పోవటానికి ముఖ్య కారణము 'అవిద్య'! విశేషముగా స్త్రీల అవిద్య కారణముగా వారిలో మానసిక పరిణతి కొరవడు తున్నది. అందుచేత పురుషులు తీరిక దొరికినప్పుడు భార్యలను విద్యావంతులను చేస్తే, ఆ కుటుంబములో ఆనందము గుబాళిస్తుంది.

ఇద్దరూ యోగ్యులైనప్పటికీ ఒక్కొక్కసారి ఎదుటివారి నడవడిక నచ్చకపోవటము అన్నది స్వాభావికమే. అప్పుడు కొంత ఓర్పునేర్పుతో మెలగి, పరస్పరము క్షమించుకోగలిగితే గనుక పరిస్థితి చక్కబడుతుంది. అంతేకాక ఒకరి లోపాలను మరొకరు సవరించగలుగుతారు. తులసీదాసువంటి మహాత్ములు ఈ మార్గమునే అనుసరించి గయ్యాళి స్వభావముగల తమ భార్యలను దారికి తెచ్చుకున్నారు.

భారతీయ స్త్రీలు అనాదిగా మగవారి కటు స్వభావమును, దుడుకైన వ్యవహారమును, స్వేచ్ఛాయుత జీవితమును సహిస్తూనే ఉన్నారు. వీరి ఉన్నత ఆదర్శము అనేది ఈ త్యాగము, ఓర్పు, పాతివ్రత్యములతోనే నిలబెట్టబడినది. భార్యాభర్తలు ఎదుటివారిలో ఉన్న బలహీనతలను ప్రక్కనపెడుతూ దాంపత్య జీవితమును ముందుకు నడిపించాలి.

భారతీయ సంస్కృతిలో గల అర్ధనారీశ్వరతత్త్వము జగమెరిగినదే! స్త్రీని-అర్ధాంగి అని, పురుషుడిని-అర్ధనారీశ్వరుడని చెప్పిన మాట అక్షరసత్యము! దంపతులు తమ మధ్య దాపరికాలు, రహస్యాలు లేకుండా మసలుతూ తమ పట్ల ఇతరులలో విశ్వాసమును, మనోసారూప్యతను చిగురింప చెయ్యాలి. అలాగే ఇద్దరు మోసము, రహస్యము, కుయుక్తులు లేకుండా బాహ్యజీవితమును వెళ్ళబుచ్చాలి. లేదంటే ఎదుటి వారిలో సందేహములు తలెత్తుతాయి.

'కార్యేషు-దాసి, కరణేషు-మంత్రి, భోజ్యేషు-మాత, శయనేషు-రంభవలె తన భార్య ఉండాలని పురుషులు ఆకాంక్షిస్తారు. అదేరీతిలో భార్యలుకూడా తమ భర్తలు తమ సుఖదుఃఖములలో పాలుపంచుకోవాలని, గురువువలె మార్గ దర్శనము వహించాలని, రక్షణ కల్పించాలని కోరుకుంటారు. అయితే ఇలా తాము కోరుకున్న ఆకాంక్షలు నెరవేరనప్పుడు భార్యాభర్తలు ఒకరిపట్ల మరొకరు అశాంతితో రగులుతూ అసంతోషముతో (సంతోషం లేకుండుట) వ్యవహరిస్తారు.

ఇతరుల భావాలను మన్నిస్తూ, ఒకరి ఉన్నతికి మరొకరు పాటుపడాలి. పురుషులు స్త్రీలను విద్యావంతులను చేసి, తర్వాత పరస్పరము క్షమాశీలత, ఉదారత, ఓర్పు, సహనం, అభిన్నత, మానసికతృప్తిని పంచుకుంటూ జీవననౌకను విహరింప జేయాలి. పురుషులు ఈ విషయములో ఎక్కువ శ్రమించాలి. ధైర్యము, వివేకములను చూపిస్తూ ఒకరినొకరు అర్థము చేసుకుంటూ, తమ స్వభావము, ఆచరణలలో మార్పు-చేర్పులు చేసుకొని దాంపత్యజీవితమును సుఖమయము చేసుకోవాలి.

పతీపత్నులలో చెలరేగు దురాలోచనలు వైవాహికజీవన మాధుర్యములో ఒక్కొక్కసారి వగరును పుట్టించవచ్చు, తద్వారా

**ఉత్సాహం జీవనధర్మం - నిరుత్సాహం మృత్యువుకు చిహ్నం**

ఒకరిపట్ల మరొకరికి గల ప్రేమ, ఆత్మీయత, స్నేహము మొదలైనవి అంతరించిపోతాయి. పురుషులు తమ భార్యల పనులలో శృతిమించి కలుగజేసుకుంటే అది దుష్ప్రభావాలకు దారితీస్తుంది.

పురుషులు తమను అన్ని విషయాలలో ప్రశంసించాలని స్త్రీలు ఆకాంక్షిస్తారు. భర్త నుండి లభించే చిన్నపాటి ప్రశంసకు ఏదీ సాటి రాజాలదని భావించటమేకాదు, తన అస్థిత్వమును సైతము మర్చిపోతారు.

భర్త కటువచనములను విన్న భార్య సదా అతనికి దూరంగా ఉండాలని కోరుకుంటుంది. భర్తమీద తనకున్న అక్కసును మరోరూపములో ఇంకోదానిమీద వెళ్ళగ్రక్కుతుంది. అంతేకాక భర్తనుండి తాను పొందలేని ప్రేమ, ఆత్మీయతాను రాగములను మరొక చోట వెదుక్కునే ప్రయత్నము చేస్తుంది. కొన్నిసార్లు మనోవైకల్యము కూడా పొందుతుంది. భర్తమీద గల సహజమైన ప్రేమ క్షీణించిపోతుంది. అత్త వారింటిలో అందిపుచ్చుకోవాల్సిన ప్రసన్నత, ఉల్లాసములు పోయి, ఆ స్థానములో నిరాశ, ఖిన్నత, నీరసము పాదుకుంటాయి.

అలాగే స్త్రీలు తమను ఉపేక్షిస్తే పురుషులు అధోగతి పాలవుతారు. భార్య కటువచనములు విన్న గొప్ప గొప్ప మహాత్ముల ధైర్యమే సడలిపోతుంది. చరిత్రలో అటువంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. నెపోలియన్, లింకన్, టాల్‌స్టాయ్ మొదలగువారు భార్యాబాధితులే.

భార్య కర్కశత్వముతో విసుగుచెందిన వ్యక్తి ఆదర్శ వంతుడైనచో అతడు దార్శనికుడుగా మారి ఆధ్యాత్మిక కర్మల వైపు దృష్టిసారిస్తాడు. ఉదాః భర్తృహరి. అలా కాకుండా ఈ స్థితిని ఎదుర్కొనే సామాన్యమైన, అల్పబుద్ధిగల వ్యక్తి వేశ్యాలోలుడు, త్రాగుబోతు, వ్యసనపరుడుగా మారిపోతాడు. ఇంటిలో భార్య ప్రేమ, సద్భావనలు లభించని పురుషుడు ఆ ప్రేమను మరోచోట పొందాలనుకుంటాడు. లేదా మత్తుకు బానిసై తన వ్యధలను మర్చిపోవాలనుకుంటాడు. కర్కశమైన, శుష్కమైన గృహవాతావరణము ఎంతోమందిని జీవితములో అపరాధులుగా నిలబెడుతుంది.

భార్యభర్తలలో ఎక్కువతక్కువ భేదములుండవు. ఇరువురు సమానమే! తమ తమ స్థానములలో ఇద్దరికి సమస్థాయి, మహత్వమున్నది. పురుషుడు జీవనక్షేత్రములో శ్రమ, పురుషార్థముల ఆసరాతో ప్రగతి అనే నాగలిని దున్నితే; స్త్రీ అందులో నవ-జీవనము, నవ-చేతన, నవ-సృజనలనే విత్తనాలను నాటుతుంది. పురుషుడు జీవనరథ సారథి అయితే స్త్రీ ఆ రథమునకు ఇరుసు వంటిది. పురుషుడు చాకచక్యముతో రథమును తోలుతుంటే-స్త్రీ సువ్యవస్థతతో కూడిన సాధనా-సౌకర్యాలు నిలిచేలా సంరక్షిస్తుంది. అయితే అజ్ఞానము, అభిమానముల చేత పురుషులు స్త్రీలకు ఉండే ఈ సమాన హోదాను మన్నించటము లేదు. తత్కారణముగా అసమానత చోటుచేసుకొనుట వలన, అవగాహన కొరవడుటచేత దాంపత్య జీవితములో విషము చిందుతుంది. కాపురము కూలిపోతుంది. కనుక పతీపత్నులు ఒకరినొకరు మన్నించుకుంటూ, భావాలను గౌరవిస్తూ ముందుకు సాగినప్పుడు జీవననౌక సురక్షితముగా ముందుకు సాగుతుంది.

*- పరమపూజ్య గురుదేవుల వాఙ్మయం 61 (1.16) నుండి*
*అనువాదం: శ్రీమతి లక్ష్మీరాజగోపాలు*

## నేను పునాదిరాయిలా ఉండదలచాను

*ఒకసారి లాల్ బహదూర్‌శాస్త్రిని, ఆయన స్నేహితుడు ఇలా అడిగాడు - "మీరు ఎల్లప్పుడు పొగడ్తలకు దూరంగా ఉంటారు. స్వాగత సత్కార సభలకు దూరంగా ఉంటూ, వానిని నిరాకరిస్తూ ఉంటారు. దీనికి కారణమేమిటి?"*

*శాస్త్రిగారు నవ్వుతూ ఇలా సమాధానమిచ్చారు. "మిత్రమా! ఒకసారి లజపతిరాయ్ నాతో ఇలా అన్నారు- "లాల్ బహదూర్! తాజ్‌మహల్ నిర్మాణంలో రెండు రకాలైన రాళ్ళను వినియోగించారు. మొదటి రకం చాలా ఖరీదైనవి. వీనిని భవన నిర్మాణంలో పై భాగమందు ఉపయోగించుట జరిగింది. రెండవ రకాన్ని (సాధారణ రాళ్ళను) తాజ్‌మహల్ పునాదిలో వాడారు. ఈ రెండవ రకంపై ఎవ్వరు తమ దృష్టిని నిలపరు. మేము మా జీవితంలో ఈ రెండవ రకం రాళ్ళలా (పునాది రాళ్ళలా) ఉండదలచాం. మీరు కూడా ప్రశంసలకు, ఆదర సత్కారాలకు ఎల్లప్పుడు దూరంగా ఉండదలచారా?" అని అడిగారు. అందువల్ల నేను కూడా ఆ విధంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నాను.*

*ఇది శాస్త్రీజీ ఔన్నత్యము - వ్యక్తిత్వం.*

*- అఖండజ్యోతి మార్చి, 2013*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**వెయ్యి మైళ్ళ ప్రయాణమైన ఒక అడుగుతోనే మొదలవుతుంది**

సమాజ నిర్మాణం

# సభ్య సమాజం యొక్క స్వరూపం, దాని ఆధారం

ఇతరుల కష్ట సుఖాలలో పాలుపంచుకునేవారు; సుఖ సౌఖ్యాలను పంచుకుంటూ, పరస్పరం స్నేహంతో, వాత్సల్యంతో ఉంటూ, ఇతరులను సంతోషపెట్టే ప్రయత్నం చేసేవారు నివసించే సమాజాన్ని దేవ సమాజం అంటారు. ఎక్కడైతే జన సమూహం ఇటువంటి పరస్పర సంబంధాలు కలిగి ఉంటుందో, అక్కడ స్వర్గీయ పరిస్థితులు/వాతావరణం నెలకొని ఉంటాయి. కాని ఎప్పుడైతే ప్రజలు న్యాయ-అన్యాయాలు, ఉచితానుచితాలు, ఆలోచనలను విడిచిపెట్టి తమ సంపదలను, పరపతిని స్వార్థానికి మాత్రమే ఎక్కువగా వాడినప్పుడు దుఃఖం, ద్వేషం, అసంతృప్తి మొదలైనవాటి ప్రాబల్యం పెరుగుతుంది. దోపిడీలు, వేధింపులు పెరిగిన కొద్దీ వివాదాలు, శత్రుత్వం, సంఘర్షణలు చోటుచేసుకుంటాయి. పాపం, దురాచారం, అవినీతి, కపటం, అపరాధ ప్రవృత్తులు పెరిగిన కొద్దీ ప్రగతి ఆగిపోతుంది, పతనం ప్రారంభమవుతుంది. చాతుర్యం, విజ్ఞానం, పరిశ్రమల ఆధారంగా ఆర్థికస్థితిని మెరుగుపరుచుకోవచ్చు, కానీ నిజమైన శాంతి, ప్రగతి మాత్రం మనుష్యుల మధ్య పరస్పర స్నేహం, మర్యాద, సహకారాల మీద ఆధారపడి ఉంటుంది. కానీ ఇవి లేకపోతే ఎన్ని వసతులు సౌకర్యాలు ఉన్నప్పటికి సుఖశాంతులు కానరావడం కష్టమే.

మంచి సమాజంలోనే మంచి వ్యక్తిత్వాలు ఉద్భవిస్తాయి, బలపడతాయి, వర్ధిల్లుతాయి. కలుషితమైన సమాజంలో, రాబోయేతరాలు వరుసగా మరింత బలహీనపడతాయి, దిగజారిపోతాయి. పురాతనకాలంలో, భారతదేశంలో ఉన్నతమైన సామాజిక స్థాయి ఉన్న రోజుల్లో నరరత్నాలు జన్మించాయి. ప్రతిచోట ఎంతోమంది మహాపురుషులు కనుపించేవారు. కానీ నేడు నీచత్వం, క్రూరత్వం పెరుగుతున్న కొద్దీ పిల్లలు కూడా విచ్చలవిడి, అనారోగ్య, అసభ్య, అనైతిక మరియు సగం పిచ్చి మనోభూమితో పుడుతున్నారు. పెద్దయ్యాక వారిలో చాలామంది నికృష్టంగానే జీవనాన్ని సాగిస్తారు. ధనసంపాదన, పెద్ద హోదాలు, బుద్ధి కుశలత దృష్ట్యా ఎవరు ఎంత సాఫల్యాన్ని పొందినా భావనలలో, కర్తృత్వంలో నీచత్వం ఉంటే సామాజిక దృష్టిలో అతను అవాంఛిత వ్యక్తిగానే గుర్తింపబడతాడు. అతని సాఫల్యం అతనికి వ్యక్తిగతంగా ఉపయోగపడచ్చు కాని దేశానికి, సమాజానికి, ధర్మానికి, సంస్కృతికి ఏ మాత్రం ఉపయోగపడవు.

మనసులో అందరి పట్ల వినయం, విధేయత, సజ్జనత్వం, కృతజ్ఞత, కర్తవ్యపరాయణత మొదలైన భావనలతో కూడిన వ్యవహారాన్ని అవలంబించుకోవాలి. ఇతరుల కష్ట సుఖాలను తమవిగా భావించి, ఒకరికొకరు సహకరించు కోవడంలో ఆనందాన్ని అనుభవించే విధంగా మానసిక నిర్మాణం జరగాలి. ఆదర్శంగా జీవించడంలో ఒకరిని మించి ఒకరు ప్రయత్నం చేస్తూ పోటీ పడాలి. పశు ప్రవృత్తులను నిర్మూలించి, మానవ సభ్యత నిరంతరం అభివృద్ధి చెందడానికి కావలసిన ప్రణాళికలను ప్రచారం చేస్తేనే నూతన నిర్మాణమనే లక్ష్యాన్ని చేరుకుంటాం. శ్రేయస్సు అనేది సంస్కృతి మీద మాత్రమే ఆధారపడుతుందనే విషయాన్ని ఎప్పుడూ మర్చిపోకూడదు.

కొందరు మత్తు పదార్థాలకి, ఫ్యాషన్లకి, సినిమాలకి, ఆడంబరాలకి, విలాసాలకి డబ్బును నీళ్ళలాగా ఖర్చుపెట్టేసి చివరికి బీదరిక అరుపులు అరుస్తారు. సంపాదన పెంచడానికి ప్రభుత్వ ప్రణాళికలు, ప్రభుత్వేతర పద్ధతులు వస్తున్నాయి, జీతాలు పెంచాలని మొరపెడుతూనే ఉంటారు; కానీ మితవ్యయం అలవాటు చేసుకుని, ప్రతిపైసాను సద్వినియోగపరిచే ప్రవృత్తి పెరిగితే తప్ప ఆర్థిక మాంద్యం తొలిగే అవకాశాలు లేవు. అతిగా ఖర్చు పెట్టేవారి దగ్గర కొండంత ధనమున్నా సరిపోదు.

ధనవంతులను గౌరవించడమనే కలుషిత సామాజిక దృష్టికోణం వల్ల ప్రజలు ధనాన్ని ఆర్జించడానికి ఎన్ని తప్పు దోవలు పట్టడానికైనా సంకోచించరు. ధనవంతులు తమ దగ్గరున్న డబ్బుతో భోగాలను అనుభవించడంలో తప్పు లేదు; కాని వారి దగ్గర డబ్బున్నదన్న ఒకే కారణానికి వారికి మర్యాద దక్కడం అనుచితం. పరమార్థ పరాయణులకు, సదాచారులను మాత్రమే గౌరవించాలి. ఏ సమాజంలో ఆస్థిని బట్టి మనిషి

**గొప్ప పనులన్నీ చిన్న పనుల సముదాయమే**

గొప్పతనానికి విలువకడతారో, అది ఎప్పటికీ ప్రగతి శిఖరాలను అధిరోహించలేదు. ప్రజాసేవకులు, ఆదర్శవాదులు గౌరవాన్ని పొందటం లేదు, డబ్బున్నవారు ఇష్టారాజ్యం చేస్తున్నారు, ఇలాంటి పరిస్థితిలో సమాజం పతనమయ్యే ప్రమాదమున్నది. మనం ఈ దిశలో జాగరూకత వహించాలి.

కుటుంబం సమాజానికి ఒక చిన్న ప్రతిరూపం. సమాజంలో ఒక భాగమైన కుటుంబాన్ని వికసింపజేసే బాధ్యత ప్రతి గృహస్థుపై ఉంచబడింది. **కుటుంబపోషణ భారంతో పాటు వారి గుణ, కర్మ, స్వభావాలను పరిశుద్ధపరిచే ప్రయత్నం కూడా ఇంటిపెద్ద చెయ్యాలి.** ఈ రోజుల్లో దీనిని ఎవరూ పట్టించుకోవటం లేదు. నూతన సమాజ నిర్మాణానికి గృహస్థు లందరు తమ తమ కుటుంబాల నూతన నిర్మాణ కార్యక్రమంలో నిరంతరం అభిరుచి చూపించడం చాలా అవసరం. ఇందులో భాగంగా, మొట్టమొదట భార్యాభర్తలిద్దరు పతివ్రత, పత్నీవ్రత ధర్మాలను పాటిస్తామని వాగ్దానం చేయాలి. కుటుంబనిర్మాణ రథం సాఫీగా సాగిపోవడానికి భార్యాభర్తలిద్దరు రెండు శరీరాలు, ఒక ఆత్మగా పరస్పరం ప్రేమ, సహకారాలతో, ఆదర్శపూరిత జీవనాన్ని గడపాలి. తమ ఆదర్శాలతోనే భార్యాభర్తలు కుటుంబాన్ని ప్రగతిపథంలో నడిపించగలరు. పిల్లలలో మంచి సంస్కారాలు నాటాలంటే, ముందు తల్లిదండ్రులు వాటిని తమ స్వభావంలో ఒక భాగంగా మార్చుకోవాలి; అప్పుడు పిల్లలు వాటిని అనుకరించి, నిజమైన శిక్షణను పొందగలరు. సమాజ నవనిర్మాణం దాంపత్యజీవనాన్ని వికసింపచేసుకుంటేనే జరగగలదు, అందుకు భార్యను మలిచే ముందు స్వయంగా ఇంటిపెద్ద మారాలి. ఈ విధంగా ఆత్మ నిర్మాణ ప్రక్రియ మొదలుపెట్టడం ద్వారా కుటుంబం, సమాజం మరియు భావితరాల అభివృద్ధి సాధ్యపడుతుంది. ఈ విషయాన్ని ప్రజలందరి మనస్సులలో బాగా నాటుకునేటట్టు చేయాలి. సమాజ నవనిర్మాణానికి ఇదే మూలాధారం.

సమయపాలన, వివేకంతో డబ్బు ఖర్చు పెట్టడం, సజ్జనత్వం, ఓర్పు, శ్రమను గౌరవించడం, శిష్టాచారం, నిజాయితీగా సంపాదించడం, అనైతికతను ద్వేషించడం, ప్రసన్నమైన ముఖాకృతి, ఆహార విహారాలలో సంయమనం, సమాజ శ్రేయస్సు కోసం స్వార్థాన్ని త్యజించడం, న్యాయాన్ని వివేకాన్ని గౌరవించడం, పవిత్రత, సరళత్వంఅనేవన్నీ మన సామాజిక గుణాలవ్వాలి. ఏ సముదాయంలో ఈ సత్ప్రవృత్తులు ఉంటాయో అక్కడ కొద్దిపాటి సాధనతోనే అభివృద్ధి సాధ్యమవు తుంది. కాని ఈ ప్రవృత్తులు లేని చోట, ప్రగతికి అవసరమైన లెక్కలేనన్ని సాధనలున్నా ఆ సమాజం రోజురోజుకీ దుర్గతి పాలవుతుంది.

పౌరులందరికీ తమ వ్యక్తిత్వ వికాసానికి, ప్రగతికి సమానమైన అవకాశాలను ఇచ్చేదే సభ్య సమాజం. ఈ మార్గంలో వచ్చే అవరోధాలన్నిటినీ తొలగించాలి. జాతి, లింగ భేదాల వల్లనే కాక, ఆర్థిక స్తోమత లేకపోవడం వలన, సామర్థ్యం ఉన్నా స్తోమత లేక మనసు చంపుకుని కూర్చోవలసి వస్తుంది. ప్రతి వ్యక్తికి ప్రగతికి అవకాశం కలిపించే సామాజిక న్యాయాన్ని ఏర్పర్చాలి. సమపాళ్ళలో ధనవితరణ జరగాలి, అంటే ఊరికే కూర్చుని తిని, తిరిగే సౌకర్యం ఉండకూడదు, అదే విధంగా ఎంత కష్టపడినా కూటికీ, గుడ్డకీ గతిలేని పరిస్థితి రాకూడదు. దోపిడీదారులు, బాధితుల వర్గాల్లో భేదం రూపుమాపాలి. ప్రతి వ్యక్తికీ తన శ్రమకు తగ్గ లాభం లభించే అవకాశం కల్పించాలి. అటువంటి సమాజానికే సభ్యసమాజం అని పిలిపించుకునే అధికారం ఉంటుంది.

నిజానికి అటువంటి సమాజంలోనే ప్రజలు సుఖంగా ఉండగలరు. ఇటువంటి మెరుగైన సమాజం దానంతటదే తయారవదు. మంచి నేతృత్వంతో, ముందుండి నడిపించే సజ్జనుల సమూహంతోనే తయారవుతుంది. గొప్ప వ్యక్తుల సంఖ్య తగ్గిపోయి, సామాజిక వాతావరణంలో ఉత్కృష్టతను నిలువరించే రచనాత్మక ప్రయత్నాలు తగ్గిపోతే సమాజం స్థాయి దిగజారడం మొదలవుతుంది. సమాజం దిగజారితే, పౌరులు కూడా నికృష్టులుగా, దీనంగా, దౌర్బల్యంతో అథోపతనం చెందుతారు. మంచి సమాజం మంచి మనుషులను రూపొందిస్తుంది; మంచి మనుషులు మంచి సమాజాన్ని తయారు చేస్తారు. రెండు అన్యోన్యాశ్రితాలే. కోడి నుండి గుడ్డా, గుడ్డు నుండి కోడా?; విత్తనం నుండి వృక్షమా, వృక్షం నుండి విత్తనమా? అనే ప్రశ్నల్లాంటిదే ఇది కూడా, మనుష్యుల వల్ల సమాజమా, సమాజం నుండి మనిషా? నిజానికి రెండూ విడదీయలేనివి. మంచి వ్యక్తులు కావాలి అంటే మంచి

**చివరిదాకా తోడుండేది 'నా' అనుకున్న వాళ్ళే**

సమాజాన్ని నిర్మించడానికి కలిసి కృషి చేయాలి. మంచి సమాజం నిర్మిస్తే కానీ మంచి మనుషులు తయారవరు. వినియోగ సౌకర్యాల అభివృద్ధి, చక్కటి లోక వ్యవహారం సర్వతోముఖ సుఖశాంతులను అందివ్వగలవు. ప్రఖర ప్రజ్ఞావంతులు, సుసంస్కృత వ్యక్తిత్వం కలిగిన వారు మాత్రమే వీటిని అందివ్వగలరు.

వ్యక్తిగత స్వార్థం దృష్ట్యా ఆలోచించినా, కుటుంబహితాన్ని చూసుకున్నా, దేనికైనా ఒక సుసంస్కృత సమాజంలో ఉంటేనే మంచి అవకాశాలు దొరుకుతాయి. చెడ్డవారి మధ్య, చెడు వాతావరణంలో చేసే ప్రయత్నాలేవీ ఫలించవు. నిప్పంటుకున్న చోట, కలరా వ్యాపించిన ప్రాంతంలో, శుచిగా, జాగరూకతతో ఉన్న కుటుంబాల నిర్వహణ కూడా ఇబ్బందిగా ఉంటుంది. దొంగలు, దుష్టులు ఉన్నచోట సజ్జనులు సుఖంగా ఉండలేరు. ప్రశాంతంగా ఉందామన్నా దుష్టులు ఉండనివ్వరు. ఏదో ఒక ఉపద్రవం లేవనెత్తి సామరస్యం లేకుండా చేస్తారు. మన కుటుంబాన్ని ఎంత సంస్కారవంతంగా మారుద్దామన్నా, చుట్టుపక్కల వాళ్ళ గాలి సోకక మానదు, నికృష్టపు ఆకర్షణలు కుటుంబ సభ్యుల్లో కూడా దుర్బుద్ధుల సంస్కారాలు నింపక మానదు. పక్కింట్లో వేశ్యలుంటే, సదాచారులు కూడా మానసిక మర్యాదలు కోల్పోతారు.

– పూజ్యగురుదేవుల వాఙ్మయం నెం. 46 (1.1) నుండి

*అనువాదం: శ్రీ ఎం.వి.ప్రసాద్, జయలక్ష్మి*

## ఆవేశానికి మారు పేరే పిశాచం

*వనవిహారానికై వాసుదేవుడు, బలదేవుడు, సాత్యకి గుఱ్ఱాల మీద బయలుదేరారు. దారి తప్పటం వలన ఒక ఘోర అరణ్యంలో చిక్కుకున్నారు. అక్కడ నుండి ముందుకు సాగడం, వెనుకకు మళ్ళటం కూడా అసాధ్యమే. గత్యంతరం లేక ఆ రాత్రి ఒక చెట్టుక్రింద గడపటానికి నిశ్చయించుకున్నారు. గుఱ్ఱాలను కట్టేసి ముగ్గురూ మూడు ఝాములు పహారా కాయాలని సంకల్పించారు. ఒకరు రక్షణ బాధ్యత తీసుకోగా మిగిలిన ఇద్దరూ నిద్రించారు. చెట్టుపైనుండి ఒక పిశాచం దిగి మొదట పహారా కాస్తున్న సాత్యకిని మల్లయుద్ధానికి రమ్మని రెచ్చగొట్టింది. సాత్యకి దానికి తగినట్లే బదులు పలుకుతూ దెబ్బకు దెబ్బతో మొదటి ఝామంతా యుద్ధం చేశాడు. పహారా గడువు ముగియటంతో ఒళ్ళంతా హూనమై సాత్యకి సొమ్మసిల్లి నిద్రపోయాడు. తిరిగి పిశాచం రెండవ పహారా కాస్తున్న బలదేవుని రెచ్చగొట్టింది. బలదేవుడు దానితో సమంగా రెచ్చిపోయి యుద్ధంచేసి దుర్గతిపాలయ్యాడు. మూడవ ఝాము పహారా వాసుదేవునిది. అతడిని కూడా పిశాచం యుద్ధానికి రమ్మన్నది. కానీ వాసుదేవుడు ఎంత రెచ్చగొట్టినా కిమ్మనక చిరునవ్వుతో నీవు నా నిద్రను, బద్ధకాన్ని పోగొట్టడానికి ప్రత్యక్షమైన దేవతలా ఉన్నావు అంటూ పోరాటం ప్రారంభించారు. ఈసారి పిశాచం యొక్క శక్తి వృద్ధి చెందక, క్రమంగా క్షీణించసాగింది. వాసుదేవుని సహృదయత, సౌమ్యవ్యవహారం ముందు పిశాచం యొక్క శక్తి ఎంతగా క్షీణించిందంటే అది చిన్న కీటకంగా మారిపోయింది. వాసుదేవుడు దానిని ఉత్తరీయం కొంగులో కట్టి గట్టిగా ముడివేశాడు. హాయిగా నిద్రపోయి ఉదయాన్నే నిత్యకర్మలు ఆచరించిన అనంతరం తిరిగి బయలుదేరటానికి సన్నద్ధమవుతుండగా సాత్యకి బలదేవులు రాత్రి పిశాచంతో జరిగిన తమ అనుభవాలను వినిపించసాగారు. వాసుదేవుడు నవ్వి ఉత్తరీయపు ముడిని విప్పి పిశాచాన్ని గుప్పిట్లో పెట్టుకొన్నాడు.*

*ఆశ్చర్యంతో చూస్తున్న వారితో "పిశాచం అంటే ఎవరో కాదు కుసంస్కార జనితమైన క్రోధం. మాటకి మాట పెంచటం వల్ల ఎదుటివారి క్రోధం రెట్టింపవుతుంది. సహృదయతతోను, ఉపేక్షతోను నిలబడగలిగితే వారి క్రోధం, బలం క్రమంగా క్షీణించిపోతాయని తెలియజేశాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

*అనువాదం: శ్రీమతి నేమాని గౌరీసావిత్రిదేవి*

**చిన్న పని అయినా, పెద్ద పని అయినా ఒకే శ్రద్ధతో చేయాలి**

మనం - మన ఆరోగ్యం

# ఆరోగ్యంగా ఉండటానికి ముఖ్యమైన సిద్ధాంతములు-2

ఆహారం తీసుకోవటానికి ఎంత ప్రాముఖ్యత ఇస్తామో అంతే ప్రాముఖ్యత ఆహారము యొక్క అరుగుదల, మల విసర్జనకు కూడా ఇవ్వాలి. పొట్టలో ఆహారానికి ఎప్పుడూ ఖాళీ ఉండాలి. మలవిసర్జన జరిగిన తర్వాత మాత్రమే రెండవసారి ఆహారాన్ని స్వీకరించాలి. ఒకవేళ పొట్ట శుభ్రం అవకపోతే ఎనీమా (enema) తీసుకోవాలి. ఇది కొంత కఠినమైన పద్ధతి, కానీ ఎవరైనా చికిత్సకుని (doctor) వద్ద దీనిని నేర్చుకొనవచ్చును. ప్రారంభములో ఎనీమా ఉపయోగించటానికి ఇంకొకరి సహాయం అవసరమవుతుంది. కానీ అభ్యాసం తర్వాత ఎవరికి వారే దీనిని చేసుకొనవచ్చును. ఎనీమా పరికరం ఏ మందుల దుకాణమునందు అయినా లభిస్తుంది. విరోచనం అవడానికి మందులు వాడటంకంటే ఈ ఎనీమా ఉపయోగించటం అధిక శ్రేయస్కరం.

తక్కువ తినడం వలన ఎవరూ నీరసించిపోరు. నిజానికి ఎక్కువగా తినటం ఒక విధమైన దోషము. దీనివలన అజీర్ణ సమస్య వస్తుంది. ప్రతిరోజు ఈ విధంగా ఎక్కువగా తినటం జరుగుతూ ఉంటే జీర్ణవ్యవస్థ అస్తవ్యస్థమవుతుంది. ఆహారం లేక ఎంతమంది అయితే మరణిస్తున్నారో అంతమంది ఆహారం ఎక్కువగా తీసుకోవటం వలన మరణిస్తున్నారన్నది అతిశయోక్తి కాదు. ఆరోగ్యం కొరకు జీర్ణక్రియ సక్రమముగా ఉండాలి. కేవలం కొద్ది ఆహారముతోనే శరీరానికి కావలసిన శక్తి లభిస్తుంది. కానీ ఆహారము జీర్ణమైన తర్వాత మాత్రమే ఆహారము యొక్క శక్తి శరీరానికి వంటబడుతుంది.

ప్రపంచములో మూడువంతుల రోగములు అజీర్ణము వలననే వస్తున్నాయి. జీర్ణముకాని ఆహారము మురుగులాగా పొట్టలోనే ఉంటుంది (stagnate). ఈ మురుగు (జీర్ణము కాని ఆహారము) విషమును ఉత్పన్నం చేస్తుంది. ఈ విషము శరీరము లోపలగల గాలితో, రక్తముతో కలసి శరీరమంతా వ్యాపిస్తుంది. శరీరము లోపల ఎక్కడైతే దుర్బలముగా ఉంటుందో, ఎక్కడైతే దూరటానికి స్థలము దొరుకుతుందో అక్కడ ఈ విషం తిష్ట వేస్తుంది. అప్పుడు ఆ ప్రదేశములో వాపులు, కడుముకట్టడం, నొప్పులు, కురుపులు మొదలైనవి బయటపడతాయి. ఎవరిలో అయితే సహనశక్తి, రోగనిరోధక శక్తి (immunity) తక్కువగా ఉంటుందో వారినే రోగకారక క్రిములు మరియు వాతావరణములోని మార్పులు ఇబ్బందులకు గురిచేస్తాయి.

శారీరిక దుర్బలతలు (physical weakness), రోగాలు రావటానికి ముందు బయటపడే లక్షణాలు (symptoms). రోగాలు రావటానికి ఇతర కారణములు కూడా ఉన్నప్పటికీ, అన్నిటికన్నా ముఖ్య కారణము ఆహారము యొక్క క్రమశిక్షణ లేకపోవడమే. నాలుక రుచులకోసం అర్రులు చాచకుండా ఉన్నప్పుడు, శరీరము స్వయముగా తనకు కావలసిన, తనకు యోగ్యమైన పదార్థములను ఆహారముగా కావాలని సంకేతమిస్తుంది. పొట్ట నిండినప్పుడు ఆహారం ఇంకచాలు అనే సంకేతములు లభిస్తాయి. కానీ పదార్థముల మీద ఇష్టం వలన పొట్టనిండినా కూడా మరికొంత ఆహారాన్ని స్వీకరిస్తూ ఉంటాము. శరీరానికి సరిపడని ఆహారమును తింటున్నప్పుడు నాలుక ఆ పదార్థము వద్దు అని సంకేతము ఇస్తుంది కానీ చాలాసార్లు పరిస్థితుల వలనో లేక వేరెవరి కోసమో శరీరానికి సరిపడని ఆహారాన్ని స్వీకరిస్తూ ఉంటాము. ఆరోగ్యాన్ని కాపాడుకొనే విషయములో ఆహారంలో పై విషయములు పాటిస్తే సగం పని అయినట్లే.

ఆహారము తర్వాత కాలకృత్యములకు సంబంధించిన ప్రశ్న వస్తుంది. అయితే దీనిని కూడా ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఆహారములో ఏవిధముగా అయితే జాగ్రత్తలు తీసుకున్నామో అదేవిధంగా జాగ్రత్తపడాలి. మలమూత్ర విసర్జనకు సంబంధించిన విషయములలో సహజసిద్ధ ప్రక్రియను బలవంతముగా ఆపకూడదు. ఎప్పుడు మల మూత్రములను విసర్జించవలసిన అవసరం వచ్చినా ముఖ్యముగా మలవిసర్జనకు సంబంధించి వెంటనే ఆ కార్యమును (పనిని) పూర్తిచెయ్యాలి. ప్రాతఃకాలమందు మరియు సాయంకాల భోజన సమయానికి ముందు కొంత సమయాన్ని మలమూత్ర విసర్జనకై కేటాయించాలి. ఒకవేళ వీటి విసర్జనకు సంబంధించి శరీరము తగిన సంకేతాలను ఇవ్వకపోయినా సమయానుసారము (టైమ్ ప్రకారము) ఈ

**తగవులు లేని సంసారం ఉండదు**

కార్యక్రమము ముగించుకొనుట శరీరానికి మంచిది. ఈ విధంగా చెయ్యడం వలన కొద్ది సమయములోనే శరీరానికి ఇది ఒక అలవాటుగామారి శరీరం తదనుగుణముగా ఈ కార్యక్రమానికి సంసిద్ధత చూపుతుంది. ఎప్పుడు బడితే అప్పుడు కాలకృత్యములు తీర్చుకోవచ్చు అనే ఆలోచన వలన జీర్ణవ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమవుతుంది. భోజనాంతరం మూత్రవిసర్జన చెయ్యడం ఒక మంచి అలవాటు. ఇదేవిధముగా నిద్రించటానికి పూర్వంకూడా మూత్ర విసర్జన చెయ్యటం వలన నిద్రాభంగం జరగకుండా ఉంటుంది.

మల విసర్జనకు సంబంధించిన అంగములేకాక నోరు, ముక్కు, స్వేదరంధ్రాలు మొదలైన వాటి ద్వారా కూడా శరీరము లోపలి మలినాలు విసర్జించబడతాయి. అందువలన వీటినన్నింటిని రోజూ శుభ్రపరచుకోవాలి. దంతధావనము (పళ్ళు తోముకోవటానికి) కొరకు బూడిదను శుభ్రమైన బట్టలో జల్లించి దానిలో కొద్దిగా ఆవనూనెను కలిపి దంతములను శుభ్రపరచుకోవడం లాభదాయకం. దంతములతోపాటు నోరు, నాలుక, చిగుళ్ళు మొదలైనవి కూడా శుభ్రపరచుకోవాలి. వీటి శుభ్రతపైన దృష్టి పెట్టకపోతే దంతక్షయము, నోటి కురుపులు, దుర్గంధభరితమైన శ్వాస మొదలైన రోగాలు సంభవించడం జరుగుతుంది. ముక్కులోని శ్లేష్మము (చీమిడి) తరచుగా ఎండిపోయినట్లు అవుతుంది. అందువల్ల ముక్కును రోజు శుభ్రపరచుకోవాలి. కళ్ళలో కూడా పూసలు ఏర్పడి కనురెప్పలు అంటుకుపోయినట్లు అవుతాయి. భారతదేశంవంటి ఉష్ణ దేశాలలో రోజూ స్నానం చేయటం ఎంతో అవసరం. అతి శీతలమైన దేశాలలో ఈ విషయమై కొంత సడలింపు ఉన్నప్పటికీ భారతదేశంవంటి ప్రదేశాలలో అన్ని ఋతువులలోను స్నానము చేయవలసిన అవసరం ఉంటుంది. ఎందుకంటే శరీరముపైగల స్వేదరంధ్రముల నుండి మలినములు బయటకు వస్తుంటాయి. స్నానం చేసేటప్పుడు గరకుగా ఉండే బట్టతోకాని, పీచుతోకాని రుద్దుకొని స్నానం చేయాలి, లేకపోతే శరీరము మీద మలినములు (మురికి) మొత్తం శుభ్రంకాక కొన్ని శరీరముపై ఉండిపోతాయి. దీనివలన నెమ్మది నెమ్మదిగా కొన్ని కొన్ని స్వేద రంధ్రములు పూడుకుపోతాయి. స్వేద రంధ్రములు పూడుకుపోవడం వలన కొంత వేడి శరీరములోనే ఉండిపోయి శరీరము లోపల అనేక ఇబ్బందులకు కారణమవు తుంది. చర్మపు ముడతలలో ఉన్న మలినములు (మురికి) గజ్జి, తామర, అట్టలాగా, చిన్న చిన్న పొక్కుల రూపములో (మొటిమలు) బయటకు వస్తాయి, వీటివలన చేయవలసిన పనులలో చురుకుదనం తగ్గుతుంది. స్నానం చేసేటప్పుడు నీటిలో మునక వెయ్యడం, చెంబుతో గబగబా పోసుకోవడం వంటివి చేయ కూడదు. శరీరము యొక్క ప్రతి ఒక్క భాగము ముఖ్యముగా జుట్టు, చంకలు, తొడలు, జననేంద్రియాలు, గజ్జలు మొదలైనవి బాగా శుభ్రపరచుకోవాలి. చర్మాన్ని ఎంత బాగా రుద్దాలంటే అది ఎర్రపడిపోవాలి. దీనివలన స్నానం యొక్క వాస్తవిక అవసరమును తీర్చినట్లు అవుతుంది. శరీరంపైపైన నీటిని పోసుకుని స్నానం చెయ్యడం వలన కేవలము నామమాత్రముగా స్నానం చేసినట్లు అవుతుంది.

నిద్రించే సమయములో పూర్తిగా ముసుగుతన్ని (ముఖము కూడా కప్పుకొని) నిద్రించకూడదు. దీనివలన లోపలికి పీల్చుకున్న ఆక్సిజన్‌తోపాటు, అంతకుముందు బయటకు వదిలిన కార్బన్‌డైఆక్సైడ్ మొదలైన విషతుల్యమైన వాయువుల కూడా తిరిగి ఊపిరితిత్తులలోకి చేరతాయి. శరీరానికి కావలసినంత ఆక్సిజన్ లభించకపోవడం వలన అనేక రకాల రుగ్మతలు ఉత్పన్నమై ఆరోగ్యం పాడవుతుంది. శరీరానికి బాగా చలి అనిపించినప్పుడు తలను, చెవులను కప్పుకోవడం వంటి ఉపాయాలను పాటించాలి కాని పూర్తిగా ముసుగుతన్ని నిద్రపోకూడదు.

ఇవేకాక శారీరిక పరిశుభ్రతకు సంబంధించి చిన్న చిన్న విషయాలను సాధారణముగా మరచిపోతూ ఉంటాము. కాళ్ళు మరియు చేతుల యొక్క వేలిగోర్లు ఎప్పుడు కత్తిరించుకొని శుభ్రంగా ఉంచుకోవాలి. లేకపోతే గోళ్ళలోని హానికారక క్రిములు ముక్కు, నోటి ద్వారా శరీరములోకి ప్రవేశించి అనేక రోగాలకు కారణం అవుతాయి. చిన్న చిన్న అజాగ్రత్తల వలన అనేక రోగాలు వస్తాయి.

ఆరోగ్యానికి శుభ్రతకు, అనారోగ్యానికి (రోగాలకు) అపరిశుభ్రతకు అవినాభావ సంబంధమున్నది. ఎక్కడైతే అపరిశుభ్రత ఉంటుందో అక్కడే రోగాలు ఉంటాయి. చెత్త ఎక్కడైతే పేరుకొనిపోయి ఉంటుందో అక్కడ పరిసరాలు దుర్గంధభరితంగా, అందవిహీనంగా ఉండటమేకాక అనేక రోగాలు వ్యాపింపచేసే స్థావరములుగా తయారవుతాయి. అందువలన శరీరము మాత్రమేకాక ఉపయోగించే ఉపకారాలు కూడా పరిశుభ్రంగా ఉండాలి.

**అధిక భోజనం ఆయువును, ఆరోగ్యమును క్షీణింప చేస్తుంది**

దుస్తులను నిత్యము సబ్బుతో ఉతకాలి. జుట్టు కుదుళ్ళలో నుండి కొన్ని రకాల స్రవాలు వస్తుంటాయి, కాబట్టి రోజూ తలస్నానం చెయ్యాలి. లేనిచో బయటకు వచ్చిన ఆ స్రవాలు ఎండి, చుండ్రుగా మారి శిరోజాలు అట్టకట్టుకుపోతాయి. దీనివలన పేలు వస్తాయి. అవి ఎక్కువ అయితే ఈపులు (పేల గుడ్లు) పెడతాయి. ఈ చుండ్రు ఎక్కువ అవడం వలన ఒకవిధమైన చాలా చిన్నవి, సన్నవి అయిన నల్లటి క్రిములు జుట్టు కుదుళ్ళలో ఏర్పడతాయి. ఈ చుండ్రు ఎక్కువై శరీరముపై, దుస్తులపై రాలుతూ ఉండటం వలన కనురెప్పలలో, చంకలలో, గజ్జలలో ఈ క్రిములు చేరి నెమ్మదిగా రక్తాన్ని పీలుస్తూ ఉంటాయి. అందువలన శిరోజాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. బట్టలను శుభ్రంగా ఉంచుకోవడం వలన క్రిములు బట్టల ద్వారా శరీరములోకి ప్రవేశించకుండా చాలా వరకు ఆపగలము. రోజూ ఉతకలేని దుస్తులు మరియు పక్క బట్టలను ఎండలో ఆరవేయడం ద్వారా వాటి మలినాలను కొద్దిగా అయినా తొలగించవచ్చును. శారీరిక పరిశుభ్రత వలననే చాలావరకు రోగాలు రాకుండా ఉంటాయి.

వంటగది, స్నానపు గదులు మరియు మరుగుదొడ్లు సరైన విధముగా శుభ్రత పాటించకపోతే అవి దుర్గంధభరితమై వాసన వెదజల్లుతూ క్రిమికీటకాదులకు ఆవాసమవుతాయి. మురికి కాలువలలో ఆహార వ్యర్థపదార్థాలు కలవడం వలన కీటకాలకు, దోమలకు, ఈగలకు పుష్కలముగా ఆహారము, నీరు, గాలి లభించే ఆ ప్రదేశాలను అవి తమ సంతానోత్పత్తి కేంద్రాలుగా చేసుకుంటాయి. ఇటువంటి ప్రదేశాలను బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ వంటి క్రిమినాశకములను ఉపయోగిస్తూ తరచూ కడుగుతూ ఉండాలి. త్రాగునీరు ఉంచుకొను ప్రదేశాలలో కూడా చల్లదనం వలన అనేక క్రిమికీటకాలు చేరడానికి అవకాశం ఉంటుంది. మట్టికుండలలోని నీరు త్రాగుతున్నట్లైతే తరచూ ఆ కుండలను మారుస్తూ ఉండాలి. మట్టి కుండలలోని నీరు త్రాగేవారు రెండు కుండలను ఏర్పాటు చేసుకొని ఒకదానిని ఉపయోగిస్తున్నప్పుడు రెండవ కుండను ఎండలో ఉంచాలి. రోజు విడిచి రోజు ఈవిధంగా కుండలను మారుస్తూ ఉండటం వలన నీటి ద్వారా క్రిమికీటకాలు చేరకుండా నివారించవచ్చు. త్రాగునీరు, తినే పదార్థాలు, నూనె, నెయ్యి, పాలు, పెరుగు, పండ్లు మొదలైన ఆహార పదార్థాలపై ఎల్లప్పుడు మూతలు ఉంచాలి. తినే పదార్థాలను ఎల్లప్పుడు మూతలు ఉన్న గిన్నెలలో, లేక డబ్బాలలోనే ఉంచాలి. లేకపోతే బల్లులు, చీమలు, సాలెపురుగులు, ఈగలు, దోమలు, బొద్దింకలు మొదలైనవి ఆ పదార్థములను తాకే, వాటిపై వాలే ప్రమాదము ఉన్నది. సంచులలో పెట్టిన ఆహార పదార్థములను కూడా ఈ క్రిమికీటకాలు వదలవు. వాటి విషపూరితమైన లాలాజలము, మలమూత్రములు ఆ పదార్థములను తినే వ్యక్తుల కడుపులోకి చేరి అనేక రోగాలకు కారణమవుతాయి. తగు జాగ్రత్తలు పాటించడం వలన వీటి నుండి రక్షించుకొనవచ్చును.

ఇంటి తలుపులలో, కిటికీలలో, పై కప్పులలో కూడా కొన్ని రకాల కీటకములు నివాసం ఉంటాయి. సంవత్సరములో రెండు మూడు సార్లు సున్నములో నీలిమందు కలిపి గోడలకు సున్నమును వేయాలి. దీనివలన ఇల్లు అందముగా కనపడటమే కాక కీటకములు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. నేల రోజు శుభ్రం చేసుకోవాలి. అందినంత వరకు గోడలను దులుపుకోవాలి. కానీ ఇంటి పై కప్పు, కిటికీలు, తలుపులను రోజు శుభ్రం చేయడంలో అశ్రద్ధ చూపిస్తుంటారు. శరీరము, దుస్తులలాగా ఇంటిని కూడా ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

*– పూజ్య గురుదేవుల వాఙ్మయం 39 (1.3) నుండి*
*అనువాదం: శ్రీమతి అరుణా సీతారాం*

## ధర్మం - న్యాయం గెలిచి తీరుతుంది

*మహాభారత యుద్ధం ముగిసింది. అర్జునుడు కృతజ్ఞతా పూర్వకంగా శ్రీకృష్ణభగవానుని చరణాల స్పృశిస్తూ "మీ వలన మాకు విజయం సిద్ధించింది" అన్నాడు. కానే కాదు ధనుంజయా! ధర్మం మీ పక్షాన ఉండుటచే మీకు విజయం ప్రాప్తించింది. శ్రేష్ఠత మరియు సఫలతలు ధర్మాన్నంటి ఉంటాయి. అందువలననే అత్యంత బలశాలియైన రావణుడు, వానరసేనను నిలువరింపజాలకపోయాడు" అని బదులు ఇచ్చాడు శ్రీకృష్ణుడు. అదే రీతిలో మానవుడు న్యాయ-ధర్మ మార్గాలను అనుసరించినచో, ఎన్ని ప్రతికూలతలు ఉన్నా కూడా స్వయంగా విజయాన్ని వరించి తీరతాడు.*

*– అఖండజ్యోతి, జూన్ 2013*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**బలవంతులు ఆశయాల సాధనకై జీవిస్తారు - దుర్బలులు ఆశల కొరకు జీవిస్తారు**

జీవించే కళ

# ఇచ్చేవారు ఎప్పుడూ నష్టపోరు

ఇచ్చేవాడికి ఎవరైతే అడ్డుతగులుతుంటారో, వారు కుళ్ళిపోతారు. ఇచ్చేవారు ఎప్పుడూ పొందుతూనే ఉంటారు. చిన్న మడుగులలో ఉన్న నీరు ఎండిపోవచ్చు. తరిగిపోవచ్చు, పాచి పట్టవచ్చు, కానీ ప్రవహించేటటువంటి వాగులలో నీరు ఎండిపోదు, తరిగిపోదు మరియు పాచిపట్టదు పైగా ఎంతో స్వచ్ఛత కలిగి ఉంటుంది. వాటి ప్రవాహానికి ఎప్పుడూ ఆటంకం ఉండదు. ఎవరైతే విధి విధానాలకు విరుద్ధంగా కూడబెడుతూ, కూడని పనులు చేస్తుంటారో, అటువంటి వారికి కొంచెమే లభిస్తుంది. అక్షయమైనటువంటి వరదానాన్ని పొందడానికి వారికి అర్హత ఉండదు.

భూమి తన సహజ సిద్ధమైనటువంటి తత్వం నుంచి నిరంతరం వనస్పతులను ఇస్తూనే ఉంటుంది. అనాదికాలం నుంచి ఈ క్రమం నడుస్తూనే ఉన్నది. ఈ భూమి మీద ఉండేటటు వంటి ప్రతిప్రాణి భూమి నుండే ఆహారాన్ని స్వీకరిస్తుంది. ఇంత మంది ప్రాణులు తిన్నా కూడా ఈ భూమి యొక్క భాండాగారానికి ఎటువంటి లోటు రాదు. వనస్పతుల నుండి రాలిన ఆకులు, ప్రాణుల యొక్క మలమూత్రములు భూమి సారమును పెంచుతాయి. ఈ విధంగా ప్రకృతి తన వరదానాలుగా ప్రాణులకు అనుదానాలను, వైభవమును నిరంతరం ఇస్తూనే ఉంటుంది. అందరి కడుపులను నింపే ఈ ప్రకృతి తన కడుపును ఎప్పుడూ ఖాళీగా ఉంచుకోదు.

వృక్షములు, వనస్పతులు తమ పచ్చదనముతో కూడిన శక్తిని ప్రతిప్రాణికి నిరంతరం ప్రసాదిస్తూనే ఉంటాయి. ఎప్పుడైనా ఈ ఖజానా ఖాళీ అయిపోతుందేమోనని అనిపిస్తుంటుంది. కానీ వాటి యొక్క మూలాలు (వేళ్ళు) భూమి లోతులలోకి బాగా పాతుకుపోయి ఉంటాయి. కనుక వాటి వేళ్ళు అనంతమైన జీవన శక్తిని కలిగి ఉంటాయి. ఆ విధంగా ప్రకృతి నిరంతరం ప్రాణులకు తన శక్తిని అందిస్తూనే ఉంటుంది.

సముద్రము మేఘాలకు ఇస్తుంది. మేఘాల యొక్క దప్పిక ఎప్పటికీ తీరదు. ఈ మేఘాలు సముద్రంలోని నీరంతటిని ఖాళీ చేస్తాయేమోననిపిస్తుంటుంది. కానీ అది సృష్టి ఆది నుంచి ఇప్పటి వరకు జరుగలేదు. నదులు సముద్రం నుంచి నీటి భాండాగారాన్ని తీసుకుని ఇంటింటికి చేర్చాలనే ఒట్టును (నియమాన్ని) పెట్టుకున్నాయి. ఆ నదులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని పరిపూర్ణంగా ఇప్పటికి నిర్వహిస్తూనే ఉన్నాయి. సముద్రము ఇప్పటి వరకు ఎండిపోలేదు, నదులు తాము తీసుకున్న బాధ్యతను పరిపూర్ణంగా నిర్వహిస్తూనే ఉన్నాయి.

నదులలోని నీరు ఎండాకాలంలో తగ్గుతుంది. మేఘాలు నదుల మీద అంత ఎక్కువగా వర్షించజాలవు. వాటివలన సముద్రము ద్వారా మేఘాల నుండి ఇవ్వబడినటువంటి వరదానాలు రావల్సినంత పూర్తిగా రావు. ఈ లోటును హిమాలయాలలో పేరుకున్న మంచు పూర్తి చేస్తుంది, ఏ నదిని నష్టంలో ఉండనివ్వదు. మంచు కరుగుతుంటుంది, నదుల యొక్క కడుపులను (గర్భాన్ని) పూర్తిగా నింపుతుంటుంది. కరిగిపోయినటువంటి హిమాలయాలు ఎండిపోవాలి. కానీ అది జరుగదు. ఆకాశపు ఖజానాలో ఎంత మంచు పడి ఉన్నదంటే అది నదులకు ఇవ్వబడినటువంటి పనిని పూర్తి చేయగలదు. హిమాలయ శిఖరాలు వేల సంవత్సరాలకు పూర్వము ఏ విధంగా మంచుతో కప్పబడి ఉన్నాయో, ఇప్పుడు కూడా అవి ఆ విధానంలోనే ఉన్నాయి.

ఆకులు రాలే కాలంలో ఆకులు రాలి నేలమీద పడతాయి. దానివలన భూమికి ఎరువు దొరుకుతుంది. అందుచేత దాని సారము తగ్గకుండా ఉంటుంది. పసుపు పచ్చని ఆకులు భూమిపై రాలగానే వృక్షము యొక్క కోశాగారము నిండుతుంటుంది. దానివలన వృక్షము మొదటికంటే ఇంకా పచ్చదనంతో ఉంటుంది. ప్రతికొమ్మ చిగుళ్ళను తొడుగుతుంటుంది. పండ్లు పండటములో కూడా ఇదే ప్రక్రియ జరుగుతుంటుంది. కోసుకునే వారికి నష్టము ఉండదు. వీటికి కష్టము ఉండదు. సంవత్సరమునకు రెండుసార్లు ప్రతి కొమ్మకు క్రొత్త పండ్లు వస్తాయనేది అక్షర సత్యము.

అదేవిధంగా ఉన్ని ఉచ్చే గొర్రెలకు కూడా ఇటువంటి నియమమే వర్తిస్తుంది. పిల్లలకు, పెద్దలకు వెచ్చదనానికి కావలసిన దుస్తులను ఉన్ని రూపంలో గొర్రెలు ఇస్తుంటాయి. వాటి శరీరంపై ఉండే ఉన్నిని కత్తిరించేవారు కత్తిరిస్తూనే ఉంటారు. అలా కత్తిరించిబడిన వెంటనే కొత్త ఉన్ని వాటి శరీరాలపై వస్తూనే ఉంటుంది. ఇచ్చినది ఎప్పటికైనా తిరిగి వస్తుంది? వీటిని లెక్కపెట్ట వలసిన పనిలేదు. ఈ సత్యాన్ని విశ్వసించాలి. ఇచ్చేవాడి ఖజానా ఎప్పుడూ ఖాళీ కాదు. రేపు కాకపోతే ఎల్లుండి. ఇప్పుడు కాకపోతే మరొకసారి వచ్చి తీరుతుంది ఈ చేత్తో ఇస్తాడు, ఆ చేత్తో తీసుకుంటాడు.

*– అఖండజ్యోతి, జనవరి 1985*

*అనువాదం: కె. సరోజినిదేవి*

**ఆశయం లేని జీవితం చుక్కానిలేని నావ వంటిది**

పూజ్య గురుదేవుల అమృతవాణి

# యుగపరివర్తనలో మన బాధ్యత - 1

పరమపూజ్య గురుదేవుల వాక్కులలో ఉన్న తేజస్సు, ఓజస్సు, తీక్షణత శ్రోతల అంతరంగమును కుదిపివేస్తాయి. తమ యొక్క ఈ చారిత్రాత్మక ప్రబోధములో పూజ్యగురుదేవులు శ్రోతలను జాగృతము చేస్తూ, వారిని సాధారణ ప్రయోజనాలకోసము పిలిపించలేదని తెలియజేస్తున్నారు. ఇది యుగసంధివేళ, యుగపరివర్తన సమయము. దైవత్వమునకు, అసురత్వమునకు మధ్య జరుగుతున్న ఈ సంగ్రామములో మనము మన పాత్రను, బాధ్యతను నిర్ణయించుకోవాలి. ఎందుకంటే ఇది నిద్రించతగిన సమయము కాదు. మనము మెలకువగా ఉండి, ఇతరులను మేల్కొల్పవలసిన సమయము! మానవత్వము పతన పరాభవములనే అఘాతములోకి జారిపోయినట్లు విదితమవుతున్న ఈ సమయములో జాగరూకులైన వ్యక్తుల బాధ్యతలు మరింతగా పెరుగుతున్నాయి. జీవనీవిద్యను దీక్షగా అధ్యయనము చేసినవారినుండి మన జీవితము యొక్క దిశానిర్దేశముల గురించి హృదయంగమము చేసుకుందాము రండి!



**ప్రత్యేక ప్రయోజనము కొరకు ప్రత్యేకమైన ఆహ్వానము!**

గాయత్రీ మంత్రమును మాతో పాటు ఉచ్చరించండి!

**ఓం భూర్భువఃస్వః తత్సవితుర్వ రేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్॥**

ఈరోజు మన శిబిరము సమాప్త మవుతున్నది. ఎంతో ముఖ్యమైన లక్ష్యము కోసము క్షణము తీరికలేకపోయినప్పటికీ కొద్దిపాటి సమయమును కేటాయించి మిమ్మల్ని ఇక్కడకు పిలిపించడము జరిగినది. 'ఇక్కడ ప్రతిరోజు జపము చేయిస్తున్నారు. అనుష్ఠానం, హవనం చేయిస్తున్నారు. వ్యాఖ్యానము చెప్పబడుతున్నది' అని మీకు అనుభవమైనది. అయితే నా దృష్టిలో ఇవన్నీ ఏమంతా ముఖ్యమైనవి కావు. మీరు కోరుకుంటే ఈ పనులన్నీ మీ ఇంటిలోనే చేసుకొనవచ్చు. ఉపన్యాసము కూడా మీరు ఇంటిలో ఉండే వినవచ్చు. ఉపన్యాసము మరేమిటో కాదు. నాలో మెదిలిన ప్రతి భావము, ప్రతి ఆలోచన అఖండజ్యోతి రూపములో ప్రచురింపబడుతున్నది. అదే ఉపన్యాసము కూడా! గాయత్రీమహావిజ్ఞాన్‌లో గాయత్రీ మంత్రమును గురించి విస్తారముగా వివరించియున్నాను. దూరప్రాంతములనుండి మిమ్మల్ని ఇక్కడికి పిలిపించినది, ఎంతో ముఖ్యమైన మూడు విషయములను గురించి చెప్పటానికే! అవి -

ఇది చాలా ప్రత్యేకమైన సమయము. ఇలాంటి సమయము మరలరాదు. లక్షల సంవత్సరము లలో ఒక్కసారి మాత్రమే ఇలాంటి సమయము వస్తుందనే అంశమును గుర్తుంచుకోండి. ఇప్పుడు యుగము మారుతున్నది. యుగసంధి జరుగు తున్నది. ఇలాంటి సమయము మరెన్నడూ రాదనేవిధముగా ప్రస్తుత సమయములో విప్లవము ఏర్పడుతున్నది. ఒకప్పుడు భారతదేశములో స్వాతంత్ర్యము కోసము యుద్ధము జరిగింది. ఆ సమయము మరల రాదుకదా! అప్పుడు ధైర్యము చూపించినవాళ్ళూ, పోరాటము చేసి కారాగారమునకు వెళ్ళిన వారు లాభాన్వితులైనారు.

**యుగపరివర్తన సమయము యొక్క సంధిసమయము**

ఈ యుగసంధ్యాసమయములో మీరు, మేము కూడా ఉన్నాము. యుగము మారుతున్న ఈ మహత్వపూర్ణమైన సమయములో మానవజాతికి జీవన్మరణముల సమస్యలు రెండూ ఇమిడి ఉన్నాయి. ఇందులో మానవజాతి శాశ్వతముగా

జీవితం నిరాడంబరంగా, ఆశయాలు ఉన్నతంగా ఉండాలి

నశించిపోవచ్చు. ఈ భూమి శూన్యముతో నిండిపోవచ్చు. మానవజాతి, ఇతర జీవజంతువులు నామరూపాలు లేకుండా అంతమైపోవచ్చు. లేదా 'యుగసంధివేళలో, ప్రస్తుతమున్న పరిస్థితులన్నీ మారిపోయి, తిరిగి మానవులలో దైవత్వం ఉదయించి, మొత్తము వాతావరణమంతా మనము రామ రాజ్యమని చెప్పుకునే సత్యయుగము అనబడే స్వర్గీయ వాతావరణం నెలకొనేటటువంటి సమయము కూడా రావచ్చు!'

ఇటువంటి సమయము యొక్క విలువను, ప్రాముఖ్యతను మీరు అర్థము చేసుకోవాలి. అలా అర్థము చేసుకోలేకపోతే, మిమ్మల్ని మీరు గుర్తించలేరు. సమయమును గుర్తించలేరు. చాలామంది చాలావిధాలుగా మరణిస్తుంటారు. వారి గురించి ఎవ్వరికీ తెలియదు. కానీ సమయము యొక్క ప్రాముఖ్యతను గుర్తించినవారు భగత్‌సింగ్‌లాగా చిరస్థాయిగా నిలిచిపోతారు. సరియైన సమయములో సరియైన లాభమును పొందటమనేది తెలివిగలవారి పని.

ఈ యుగపరివర్తన సమయములో జీవాత్మకు అప్పగించ బడిన బాధ్యతలను మీరు నెరవేర్చగలిగితే మంచిది. అలా నెరవేర్చకపోతే ప్రపంచము అంతంకావచ్చు. అణ్వాయుధముల కన్నా ఇంకా ఎక్కువశక్తిగల మారణ ఆయుధములు తయారవుతున్నాయి. ఇప్పుడు కిరణములతో తయారుచేయబడే ఆయుధములను ఉపయోగిస్తే ఎట్లా ఉన్న ప్రపంచము అట్లాగే కుప్పకూలిపోతుంది. అంటే కూర్చున్నవారు కూర్చున్నట్లే, నిలుచున్నవారు నిలుచున్నట్లే, నిద్రించేవారు నిద్రిస్తున్నట్లే యథాతథముగా నిర్జీవమైపోతారు. అటువంటి శక్తివంతమైన మారణాయుధాలను ఈనాడు ప్రపంచములో తయారు చేస్తున్నారు. ఒకే ఒక్క మనిషి లక్షలకోట్ల సంవత్సరముల నాగరికత కలిగిన ఈ మానవ ప్రపంచమును అంతము చెయ్యగలడు.

## మానవత్వము యొక్క పతన-పరాభవములు!

మానవుడు నానాటికీ హీనంగా, అల్పంగా, నీచంగా తయారవుతున్నాడు. ఈ నీచత్వము ఇదేవిధముగా కొనసాగుతూ, స్థిరపడుతుంటే, మనిషి సాటిమనిషిని చంపి తినేసే పరిస్థితి కూడా రాగలదు. మనిషి సాటిమనిషి పట్ల తన కర్తవ్యమును గురించి ఏమాత్రము ఆలోచించటం లేదు. కేవలము తన హక్కుల గురించే ఆలోచిస్తుంటాడు. సంపద కోసము, ఆస్తుల కోసము అన్నదమ్ములు కూడా ఒకరి మరణమును మరొకరు కోరుకునేంత భయంకరముగా మారిపోతున్నారు. ఆకృతి మనిషి రూపములో ఉన్నప్పటికీ, బుద్ధి రాక్షసత్వపు అంశలో ఉంటున్నది. ఇదే ప్రవృత్తి కొనసాగితే, రాబోయే 50 లేదా 100 సంవత్సరములలో మనిషి మనిషిని చూసే భయపడే రోజులు వస్తాయి. ఇప్పటివరకు మానవుడు పామును, పులిని, సింహమును చూసి, భూత ప్రేతములను చూసి భయపడు తున్నాడు. కానీ ఇకముందు మనిషి మరొక మనిషిని చూస్తేనే వణికిపోయే పరిస్థితి వస్తుంది. ఈనాడు మనిషి గౌరవానికి, నిజాయితీకి విలువలేదు. మానవునిలో విశ్వాసమనేది నశించి పోయింది.

విశ్వాసమనేది నశించిపోయిన కారణముగా ఈనాడు మనిషి మంచి మనుష్యుల కోసం తహతహలాడుతున్నాడు, అన్వేషిస్తున్నాడు. మనుష్యులు సర్వత్రా ఉన్నారు. కానీ విశ్వసించదగిన మనిషి ఒక్కడూ లభించడము లేదు. ప్రస్తుతము మనమందరము పయనిస్తున్న స్వార్థపరత్వము నిండిన ఈ మార్గమే గమ్యస్థానమనుకుంటే; అక్కడే మన బుద్ధి, తెలివితేటలు పనిచేస్తూంటే, మనిషి తన సాటిమనిషికి భయంకరముగా తయారవటమనేది నిశ్చయము. అప్పుడు మనిషి తేలు, పాము, సింహముకన్నా కూడా క్రూరమైన జంతువుగా, హింసాత్మకముగా మారతాడు. స్వంత సోదరుడిని, తండ్రిని కూడా కిరాతకముగా హింసించి వధిస్తాడు. స్వార్థపరులు నివసించే ఈ భూమి అంతముకాక తప్పదు. కాబట్టి ప్రపంచము 'నాశనము' దిశగా పయనిస్తున్నదని ఖచ్చితముగా తెలుస్తున్నది.

## పెరిగిపోతున్న జనసంఖ్య దృష్ట్యా భయావహమైన పరిస్థితి ఎదురవుతున్నది

నానాటికీ పెరిగిపోతున్న జనసంఖ్యను చూస్తే ఈ ప్రపంచము యొక్క మనుగడ విపత్కర పరిస్థితులలోకి నెట్టివేయ బడుతున్నది అని అర్థమవుతుంది. చీమలు, దోమలు, క్రిమి కీటకాదులవలె మనుష్యులు కూడా పుడుతూ, చస్తుంటారు. వాళ్ళు మనుషులవలె సక్రమముగా జీవించలేరు. ఇలాంటి భయంకర దృశ్యముతోపాటు, ఇంకొకవైపు బంగారు భవిష్యత్తుతో కూడిన ఒక చక్కని కల కూడా ఈ కళ్ళముందు కదలాడుతున్నది.

**జీవితం సుఖంగా ఉంచుకోవాలనుకుంటే ఇతరుల జీవితాలతో పోల్చుకోకు**

ఆ కలను సరియైన విధముగా సాకారము చేయగలిగితే మనిషి తనవంటి మరొక మనిషిని తయారు చేయగలుగుతాడు. మనిషి లోపల మానవత్వమును వికసింప చేయగలుగుతాడు. మనిషి తన ఆలోచనలను, జీవన విధానమును ఇంకొంచెము విశాలముగా మలచుకొనగలిగితే మనిషి లోపల దైవత్వము ఉదయించటమేకాదు, భూమిపై స్వర్గావతరణ కూడా జరుగుతుంది.

### మానవునిలో దైవత్వము ఉదయించడము, భూమిపై స్వర్గావతరణ

భగవంతుడు, దేవతలు ఏయే ప్రదేశములలో ఉంటారో, ఆ వాతావరణమంతా 'స్వర్గము'తో సమానముగా విలసిల్లుతుంది. ఈ కలను సాకారము చేసుకొనగలిగితే, ఈ ప్రపంచము ఎంత బాగుంటుందో మీరు ఊహించగలరు. ప్రాచీనకాలములో సుఖసౌకర్యాలకు చెందిన ఉపకరణములు, రవాణా సదుపాయములు, సమాచారసాధనాలు మొదలైనవేమీ లేకపోయినప్పటికీ ప్రజలు సుఖసంతోషములతో హాయిగా ఉండేవారు. కానీ ప్రస్తుతకాలములో ఈ సాధనోపకరణముల సహాయముతో మనిషి ఉండవలసినంత ఉత్సాహముగా, ఉల్లాసముగా లేడు. అందుకు ముఖ్యకారణము మనిషిలో నిజాయితి, అవగాహన లోపించడమే.

నాయనా! ఒకవైపు స్వర్గముగా భావించబడే మన స్వప్నము ఉన్నది. మరియొకవైపు నరకముగా చెప్పుకునే వినాశనపు అఘాతమున్నది. మన రథము ఈ రెండింటి మధ్యా నిలబడి ఉన్నది.

**'సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయమేఽచ్యుత'**

స్వర్గమనే ఉన్నతి ఒక వైపు, నరకమనే పతనము ఒక వైపు ఈ రెండింటికీ మధ్యనున్న మన రథము ఏ మార్గము వైపు పయనించాలో, వివేకవంతుడైన మానవుడు నిర్ణయించుకోవాలి. ఈనాడు మనిషిపైన దౌర్జన్యము చెయ్యడము జరుగుతున్నది. రావణుని కాలానికీ, ఇప్పటి కాలానికీ తేడా ఏమీ లేదు. పద్ధతి అదే.

అప్పుడు పరిస్థితిని చక్కదిద్దటానికి భగవంతుడైన శ్రీరామ చంద్రమూర్తి భూలోకమునకు పంపించబడినారు. ఆయన ఒంటరిగా రాలేదు. ఆయనతోపాటు అనేకమంది దేవతలు– వానరులు, ఎలుగుబంట్లు, పక్షుల (జటాయువు, సంపాతి) రూపములో శ్రీరామునికి సహాయముగా భూమిపై జన్మించారు. వారంతా శ్రీరామునితో కలిసి పనిచేసి రాక్షస సంహారానికి సహాయము చేశారు. అలాగే శ్రీకృష్ణుడు కూడా ఒంటరిగా రాలేదు. ఆయనతోపాటు ఐదుగురు దేవతలు పంచ పాండవుల రూపములో జన్మించారు. కుంతీదేవి ఐదుగురు దేవతలను ఆహ్వానించగా వారు తమ అంశతో ఐదుగురు పుత్రులను ఆమెకు ప్రసాదించిన విషయము బహుశా మీకు తెలిసే ఉండవచ్చు. వారే పంచపాండవులు. అలాగే మరికొంత మంది దేవతలు గోపబాలురు, గోపాలకులైన శ్రీకృష్ణునితోపాటు జన్మించారు. వారంతా గోవర్ధనపర్వతమును ఎత్తటానికి గోవిందునికి సహాయము చేశారు.

*(సశేషము)*

*– అఖండజ్యోతి, మార్చి 2013*

*అనువాదం: శ్రీమతి కృష్ణకుమారి*

## శ్రీ గాయత్రీ శతకం

**103.** ***తుది 'ప్రచోదయాత్' అనగానే ముదము చెంది***
***పతిత కందించు నాదేవి పరమశాంతి***
***అట్టి తరుణాన మంత్రమ్ము హాయిగూర్చు***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:– మంత్రంలో చివరిభాగమైన 'ప్రచోదయాత్' అని పలుకగానే ఆ వేదమాత సంతసించి సాధకునికి పరమ శాంతిని కలిగిస్తుంది. ఆ సమయాన ఆతని హృదయంలో బ్రహ్మానందాన్ని కలుగజేస్తుంది ఆ తల్లి.*

**104.** ***పూలసారము తేనెగా పొదమునట్లు***
***పాలసారము నేయిగా పరగునట్లు***
***వేదసారము తానౌచు వెల్గుచుండు***
***విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత***

*తా:– పూలలోని సారమంతా తియ్యని తేనెగా తయారగునట్లు, పాలలోని సారమంతా కమ్మని నేయిగా మారునట్లు, వేదాలలోని సారమంతా సాక్షాత్తు తానుగా మారి వెలుగుతూ ఉంటుంది వేదమాత గాయత్రీమాత.*

*రచన: సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

**గతాన్ని విశ్లేషించి, భవిష్యత్తును అనుసంధానించి వర్తమానంలో జీవించుటయే విజేతల లక్షణం**

నా వారితో నా మాట

# నవనిర్మాణానికి మూలాధారం



అక్టోబరు 5వ తారీఖు నుండి నవరాత్రులు ప్రారంభమవుతాయి. మరల మరోసారి ఆంతరిక మాలిన్యమును కడిగివేసుకొని అంతరంగ జీవితమును తీర్చిదిద్దుకునే మంచి అవకాశము మనకు లభించింది. విశ్వవ్యాప్తంగా ఉన్న మన ఆత్మీయ గాయత్రీ పరిజనులందరికీ అంతరంగ జీవితమును సంస్కరించుకోవడమనేది ఎంత గొప్ప విశేషకార్యమో తెలిసే ఉంటుంది. వాస్తవానికి మన కంటికి భౌతికంగా కనిపించే మనిషి స్వరూపము ఏదైతే ఉన్నదో అది శరీరము, బుద్ధి, నడవడిక, శ్రమశీలత, శ్రద్ధ, పురుషార్థములన్నీ కలగలిసి ఉన్న స్వరూపము. ఈ బాహ్య స్వరూపము యొక్క బలము మీద ప్రాపంచిక విజయాలు ఎన్నైనా సాధించవచ్చు.

నవయుగ ఆగమనము యుగపరివర్తన, ప్రత్యావర్తన అనే కార్యక్రమములను ఆంతరిక సామర్థ్యము వికసించి ఉన్న వ్యక్తులు మాత్రమే నిర్వహించగలరు. ఈనాడు మనకు సరస్సులు, చిన్నకుంటల ద్వారా వచ్చే జలరాశి సరిపోదు. గంగ, యమున వంటి విశాలమైన జలరాశి అవసరమవుతుంది. ఎవరైతే బ్రహ్మ విద్యను తమ జీవితానికి ఆధారంగా చేసుకున్నారో వారు మాత్రమే పరమాత్మ చేతనత్వముతో తమను తాము అనుసంధానించుకోగలుగుతారు. వారు మాత్రమే కొన్ని విశేష కార్యములు చేయడం సంభవమౌతుంది. పెద్ద పెద్ద కార్యములను విజయవంతంగా నిర్వహించగలిగేవారే యుగ పరివర్తనకు ఉపయోగపడతారు. బ్రహ్మవిద్యయైన ఈ మహామంత్రము పేరే గాయత్రి. ఇందులోని ప్రతి అక్షరములో నిక్షిప్తమై ఉన్న తత్వజ్ఞానము యొక్క వ్యాఖ్యానముతోనే సమస్త వేదజ్ఞానం, బ్రహ్మజ్ఞానం విస్తరించింది.

ఈ పంక్తుల ద్వారా భౌతిక సామర్థ్యములను, సంపదలను తక్కువ చేయడం లేదు, అయితే వీటన్నింటికీ మూలమైన ఆధారం ఆంతరంగిక సంపన్నత మరియు విశేషమైన తపస్సు మరియు పుణ్యములు మాత్రమే అని చెప్పడం జరుగుతున్నది. అంతేకాదు మరో వాస్తవం ఏమంటే లౌకికమైన భౌతిక సాధనాలు ఎంత గొప్పవైనప్పటికీ వాటికి ఒక పరిధి ఉంటుంది. వాటిపై ఆధారపడి విస్తృతమైన మార్పు తీసుకురావడం సంభవం కాదు. చాలా దేశాలు భౌతికమైన సాధనాలతోను, శక్తితోను విస్తృత మార్పు తీసుకు రావాలని ప్రయత్నించాయి. కానీ కొద్దిపాటి సఫలతను మాత్రమే సాధించగలిగాయి. ఈ కొద్దిపాటి సాఫల్యము కూడా బలప్రయోగము తోను, ఒత్తిడితోను మాత్రమే సాధ్యపడింది. అది మాత్రమేకాక ఎవరికి ఎప్పుడు అవసరమనిపిస్తే అప్పుడు వారు అక్కడ తమ స్వార్థము కొరకు సామాజికమైన, జాతీయపరమైన అపరాధములు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. వీటన్నింటికి కారణం ఒక్కటే, వ్యక్తిని ప్రభావితం చేసి నిర్దేశించగలిగే మార్గమును చూపించగలిగే ప్రయత్నములు జరగకపోవడమే.

ఇటువంటి ప్రయత్నములు కేవలం బ్రహ్మవిద్య ద్వారా ఆత్మశక్తిని సముపార్జించిన వ్యక్తి మాత్రమే చేయగలడు. వ్యక్తికి బాహ్య ప్రపంచమే సర్వస్వం కాదు అని ఇందుమూలంగా అందరూ గ్రహించాలి. అతని మూలస్వరూపము అతని చేతన మాత్రమే. అక్కడే అతని శ్రద్ధావిశ్వాసాల మూలములు ఉన్నాయి. అతని యొక్క ఈ చేతనతోనే నిష్ఠలన్నింటికీ పోషణ లభిస్తుంది. ఈ శ్రద్ధావిశ్వాసాలను, నిష్ఠలను సంస్కరించు కోకుండా, శోధించకుండా చేసే ప్రయత్నములన్నీ వృథా ప్రయాసగానే మిగిలిపోతాయి. ఈ శ్రద్ధావిశ్వాసాలను సంస్కరించుకొని, నిష్ఠను పెంచుకొనడమే యుగపరివర్తనకు మూలాధారము. ఇంతటి మహత్వపూర్ణ కార్యము గాయత్రీ సాధన చేసి ఆ తత్వజ్ఞానముతో తమను తాము వికసింప చేసుకున్న ఆత్మశక్తి సంపన్నులు మాత్రమే చేయగలరు. శరీరబలము, బుద్ధిబలము, మనోబలము, ధనబలము ఎంత గొప్పవైనప్పటికీ వాటన్నింటికీ ఒక పరిధి ఉంటుంది. అంతే కాదు వీటిని ఉపయోగించే విధానము కూడా మానవుని చేతనత్వంపై ఆధారపడి ఉంటుంది. చేతనత్వస్థాయి తక్కువగా ఉంటే ఈ బలములేవీ లోకహితమునకు కానీ, ఆత్మహితమునకు కానీ ఉపయోగపడవు. అలాకాక చేతనత్వము సంస్కరింపబడి

**దైవాన్ని మెచ్చుకునే భజనలు కట్టిపెట్టు - దైవం మెచ్చుకునే పనులు మొదలుపెట్టు**

ఉంటే అన్ని సాధనలు లోకకళ్యాణానికి, ఆత్మకళ్యాణానికి చక్కని మార్గమును ఏర్పరుస్తాయి. వాటి ఫలితములు కూడా సర్వదా, సర్వత్రా అనుకూలంగానే ఉంటాయి.

గాయత్రీసాధన ద్వారా సముపార్జించుకున్న ఆత్మశక్తితోను, మానవుని యొక్క వ్యక్తిగత, సమిష్టిగత సంస్కరణల ద్వారా సాధించగలిగే నవయుగ ఆగమనమును గురించి విశ్వవ్యాప్తంగా ఈనాడు మనం చర్చించు కుంటున్నాము. దానికి ఉన్న ఏకైక మార్గము ఆత్మ వికాసం ద్వారా లోక వికాసం అనగా ఆత్మను సంస్కరించడం ద్వారానే లోకమును సంస్కరించడం వీలవుతుంది. ఎందుకంటే మానవునియందు దైవీయ గుణములను ఉదయింపచేసి, పృథ్విపై స్వర్గతుల్యమైన పరిస్థితులను తీసుకురావడం అనేది సంభవమైన పనే. ఈ మహత్వపూర్ణమైన లక్ష్యమును సాధించేందుకు కావలసిన ఆధారం, మార్గదర్శనం అంతా గాయత్రీసాధన ద్వారా, గాయత్రీ తత్వదర్శనం ద్వారా మనకు లభిస్తుంది.

శాస్త్రములు, సాధకులు అంతా గాయత్రీమంత్రమును గురుమంత్రమని వెల్లడించారు. గురువు యొక్క చేతనత్వం ద్వారా లభించే శ్రద్ధ, ప్రేరణ, భావసంవేదన, క్రమశిక్షణ యొక్క ప్రకాశము అన్నీ ఈ మంత్రమునందే నిక్షిప్తమై ఉన్నాయి. అందుచేతనే ఇది మహామంత్రము, గురుమంత్రము. మనకు లెక్కలేనన్ని మంత్రములు ఉన్నాయి. అందులో వైదిక, తాంత్రిక, పౌరాణిక, శామర, డామర మొదలైనవి. ఇవి మాత్రమే కాదు ఇంకా ఎన్నో ఉన్నాయి. వీటి సంఖ్యను, చేసే విధానములను లెక్కించడం సాధ్యం కాకపోవచ్చు. ఇటువంటి స్థితిలో గురువు యొక్క మహిమతో జోడింపబడి ఉన్న గాయత్రీమంత్రము శ్రేష్ఠమైనది. ఆధ్యాత్మికవేత్తలందరూ గురువు చేసే రెండు మహత్వపూర్ణ కార్యములను గురించి చెప్పారు. 1. జ్ఞానమును వృద్ధి పొందించుట, 2. అశుభములను నివారించుట. గురువు వలెనే గాయత్రీమంత్రములో కూడా రెండు భాగములు ఉన్నాయి. 1. సృజనాత్మక విభాగము, 2. విధ్వంసక విభాగము. గాయత్రీమంత్రములోని సృజనాత్మక శక్తి బ్రహ్మవిద్య, విధ్వంసక శక్తి బ్రహ్మాస్త్రం.

గాయత్రీ మహాశక్తిని యుగశక్తిగా చెప్పుకునేప్పుడు ఆ శక్తి 1. పరిత్రాణాయ సాధూనాం, 2. వినాశాయచ దుష్కృతాం అనే అవతార ప్రతిజ్ఞను నిలబెట్టుకుంటుందని చెప్పాలి. సృజన (సృష్టి), విధ్వంసము ఇవి రెండూ ఒకదానికొకటి పూరకములు. కొత్త నిర్మాణము చేయాలంటే పాతదానిని పడగొట్టాలి. పొలంలో కొత్తపంటను వేయాలంటే పాతపంటను తీసివేయాల్సిందే. బట్టలకు కొత్తరంగును వేయాలంటే ముందుగా దాన్ని పట్టి ఉన్న మురికిని ఉతికి శుభ్రం చేయడం చాలా అవసరం. ఏ రంగంలోనైనా సత్యమేమిటంటే నూతన నిర్మాణము కొరకు పాతవాటిని తీసివేయక తప్పదు. గాయత్రీ సాధన చేస్తున్నప్పుడు ఈ సత్యములను మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకోవాలి, మననం చేసుకోవాలి, చింతన చేయాలి. అది వ్యక్తిగత సాధన చేసే సందర్భమైనా, సామూహికసాధన చేసే సందర్భమైనా ఈ రకమైన చింతన చేయడం తప్పనిసరి.

గాయత్రీ యొక్క 24 అక్షరములలో పరివర్తనను తీసుకు రాగలిగే సూత్రాలన్నీ ఉన్నాయి. భారతీయ సంస్కృతిలో చెప్పబడిన 24 అవతారములకు సంబంధించిన క్రియాకలాపా లన్నింటికీ గాయత్రీ మంత్రములో అంతర్గతంగా ఉన్న ఈ సిద్ధాంతసూత్రములే ఆధారము. బయటకి గాయత్రీ మంత్రమును గురించి ప్రకటించినా, ప్రకటించకపోయినా ఏదో ఒక రూపంలో అవి అన్నీ గాయత్రీమంత్రము యొక్క బ్రహ్మవిద్యను, బ్రహ్మాస్త్రమునే ప్రయోగిస్తాయి. అధర్మము, అవినీతి, ఆపదలను నివారించి; ధర్మమును, నీతిని, సత్ప్రవృత్తులను వృద్ధిపొందించడమనే కార్యమును అవతార ప్రక్రియలన్నీ అనుసరించాయి. యుగాంతర సమయం లోనే ఈశ్వరీయ శక్తి అవతరిస్తుంది. ఎప్పుడైతే పరివర్తన, ప్రత్యావర్తన చేయడం తప్ప మరో మార్గం ఉండదో అప్పుడు భగవంతుని చేతనత్వము ప్రకటీకృతమవుతుంది. గడిచిన యుగాలలో కూడా అవతారములు అవతరించినప్పుడు ఆనాటి యుగపరిస్థితులకు అనుగుణ్యంగా అవి తమ అవతారలీలలను సృజించుకొని అవతార ప్రక్రియను సంపూర్ణం చేశాయి. ఈనాటి పరిస్థితులు వేరుగా ఉన్నాయి. ప్రారంభంలోని యుగముల యందు అసురుల ఆక్రమణ నేరుగా జరిగేది. వారివల్ల, వారి ఆక్రమణల వల్ల సమాజవ్యవస్థ మొత్తం ఛిన్నాభిన్నమైపోయేది. కానీ ఈనాటి ఆసురీ ఆక్రమణలు అన్నీ వ్యక్తిగతంగా, సామూహికంగా వ్యక్తుల మానసిక స్థితి పైన ఆక్రమణ చేసే పద్ధతిని అవలంబిస్తున్నాయి. అవి ఇటువంటి మోసపూరితమైన ప్రణాళికలను తయారుచేసుకొని అందుకు అనుగుణ్యంగా ప్రజల మనస్సులలో అనేక రకాల వికృతులను, చెడు ఆలోచనలను ఉత్పన్నం చేస్తున్నాయి. ఈ కారణంగానే ఈనాడు ఆదర్శములకు,

**విజయం సాధించాలంటే ఆశయం దృఢంగా ఉండాలి**

మర్యాదలకు విలువ ఇచ్చేవారు ఎవరూ లేరు. ఈ రకంగా ఆదర్శాలకు కట్టుబడి ఉండటం బాధాకరమైనదిగా భావిస్తున్నారు. భగవంతుని విశ్వసించేవారు, మందిరాలు, దేవాలయాల్లోకి వెళ్ళి నమస్కరించనివారు ఈనాటికీ లేకపోలేదు. నిజమైన ఆస్తికత, భగవద్భక్తి ఉన్నవారు ఈనాడు ఎక్కడా కనిపించడం లేదు. భగవంతుడి తత్వాన్ని సవ్యంగా అర్థం చేసుకొని ఆయన గుణాలను ధారణ చేసి జీవించేవారు ఎక్కడా లేరు. ఇందువల్లనే అందరూ ధర్మమును స్వార్థానికి, తమ ఆకాంక్షలను, కోరికలను తీర్చుకోవడానికి ఉపయోగిస్తున్నారు. ఇటువంటి కపట నాటకాలు వేసే ఆస్తికులకంటే నాస్తికులే శ్రేష్ఠులు. వారే సమాజానికి కొంచెం ఎక్కువగా ఉపయోగ పడతారు.

ఈసారి నవయుగము యొక్క యుగశక్తి అవతరణ ప్రక్రియ అసురతను నిర్మూలించి, దైవత్వమును ఉదయింప చేయడం అనే సనాతన ఉద్దేశ్యమును సంపూర్ణం చేస్తుంది. ఇందుకొరకే మనమంతా గాయత్రీ సాధనను మహా అభియానముగా చేస్తున్నాము. శరన్నవరాత్రులు అనే మహా పర్వదినాలు ఈ ప్రక్రియను ఇంకా తీవ్రంగా, తీవ్రతరంగా, అతి తీవ్రంగా కొనసాగించేందుకు ఉపయోగపడతాయి. ఈ పరిస్థితులకు అనుగుణంగా మన పరిజనులందరు నిరంతరం ప్రయత్నం చేయాలి. అవాంఛనీయతలు, ఆసురీ శక్తులను ఓడించేందుకు ధర్మయుద్ధం జరుగుతున్న ఈ ధర్మక్షేత్రంలో అంతఃకరణ లోతుల్లోకి వెళ్ళి యుద్ధం చేయవలసి వస్తుంది. ప్రజల మానసికస్థితులను సంస్కరించడం ద్వారా వారి నమ్మకాలను, విశ్వాసాలను, ఆలోచనలను, సంస్కరించడం అనే నవయుగనిర్మాణ ప్రక్రియలో పాలుపంచుకునే పరిజను లందరూ గాయత్రీమాత యొక్క నిజమైన సంతానముగా చెప్పబడతారు. అందుచేత వీరందరూ మహాకాలునికి లీలా సహచరులుగా తమ బాధ్యతలను నిర్వహించవలసి ఉంటుంది.

ఈ లక్ష్యమును పూర్తిచేసేందుకు గాయత్రీమంత్రము యొక్క తత్వజ్ఞానమును గురించి ప్రతి ఒక్కరికీ తెలియచేసి తద్వారా యుగశక్తి యొక్క చేతనత్వమును విస్తరింపచేయడం ఈ కార్యక్రమము యొక్క మొదటిచరణం. మన పరిజనులంతా కొన్ని సంవత్సరాలుగా అఖండజ్యోతి పత్రికను, పూజ్య గురుదేవుల ద్వారా రచించబడిన సాహిత్యమును గురించి ప్రచారం చేస్తున్నారు. కానీ ఇప్పుడు మనమంతా ఒక నూతన విధానమును అనుసరించాలి. **అందులో భాగంగా ప్రచారానికి మాత్రమే మనము పరిమితం కాకుండా మన ప్రయత్నాలు అన్నీ ఆచరణ దాకా చేరుకోవాలి.** ఇందుకొరకు ప్రాంతీయ స్థాయిలో ఉన్న పరిజనులందరూ తమతమ క్షేత్రములందు అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి) పాఠకులందరినీ సమావేశ పరిచి అఖండజ్యోతి (యుగశక్తి గాయత్రి) పాఠక పరీక్ష అని ఒక కార్యక్రమాన్ని నిర్వహించాలి. యుగసాహిత్యంపై కూడా ఇటువంటి ప్రయత్నం చేయవలసి ఉంటుంది. గాయత్రీ సాధన చేసేటప్పుడు కూడా సామూహిక సాధనకు ప్రాముఖ్యతను ఇవ్వాలి.

గాయత్రీసాధన వల్ల వ్యక్తిగత సాఫల్యాలు లెక్కలేనన్ని లభిస్తాయి. వీటి పరిణామాలు కూడా ఉత్సాహమును కలుగ చేస్తాయి. కానీ ఇప్పుడు మనం చేసే గాయత్రీసాధనా ప్రయోగము సామూహిక లక్ష్యములను సాధించేందుకు చేస్తున్నాము. ఇందుకొరకు మనము ప్రణాళికా బద్ధముగా ప్రయత్నము చేయవలసి ఉంటుంది. ఆసురీతత్వముల యొక్క అంధకారము మనకు విసిరిన సవాలును ఎదుర్కొని దాన్ని ఓడించాలంటే గాయత్రీసాధన యొక్క బ్రహ్మాస్త్రమే ప్రయోగించ వలసి ఉంటుంది. మన పరిజనులు ప్రస్తుతం ఈ పనే చేయాలి. ఈ నవరాత్రి పర్వదినములు ఈ లక్ష్యములను సాధించేందుకు మనకు వచ్చిన విశేష అవకాశంగా భావించాలి. గాయత్రీ సాధన ద్వారా జరిగే సూక్ష్మపరివర్తనలు మామూలు కంటికి కనిపించకపోయినా ఖచ్చితంగా జరిగి తీరతాయి. పరివర్తనా ప్రక్రియ జరిగిన తరువాత ఆసురీశక్తులన్నీ నిస్తేజమై జీవం కోల్పోయి ప్రాణరహితంగా అయిపోతాయి. అప్పుడు దైవీ శక్తులు, దైవీ ప్రవృత్తులు నలువైపులా కాంతులీనుతూ వ్యాపించడం మొదలవుతుంది. అప్పటివరకు మనమంతా ఈ మహాప్రయత్నమును చేస్తూనే ఉండాలి. ఈ మహాకార్యము యుగశక్తి గాయత్రి చేతనత్వమును నిరంతరం విస్తరింప చేయడం వల్లనే సాధ్యమవుతుంది. నిరంతరము నియమితంగా, సామూహికంగా గాయత్రీ సాధన చేస్తూ ఉండడం మరియు ఆ తత్వజ్ఞానము యొక్క రూపమైన యుగసాహిత్యమును ప్రచారంలోకి విస్తృతంగా తీసుకురావడమనే రెండు ఉపాయాల ద్వారా యుగశక్తి గాయత్రి ప్రభావము మనకు ప్రత్యక్షంగా కనపడుతుంది.

*– అఖండజ్యోతి, అక్టోబర్ 2013*

*అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్*

**విద్య కూడా వినయం లేకపోతే శోభించదు**

### ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ - సప్తమ అధ్యాయం (మొదటి ప్రకరణం)

# యుగాంతరీయ చేతన-లీల సందోహ ప్రకరణం

**ఉమాశంకర సంవాదామరాం శృత్వా కథాంతుయః ।**
**నివృత్తో జన్మమృత్యునాం శుకకాయ నివాసకః ॥ 1**

జగన్మాత ఉమాదేవి, జగద్రక్షకులైన పరమేశ్వరుడు చర్చించుకున్న సృష్టి తత్వాన్ని, ధర్మాలను వివరించే అమరకథను వినినవారై, పుట్టుకను గురించి, జీవనదశలోని చివరిదశ అయిన వృద్ధాప్యాన్ని గురించి, ప్రళయకాలంలో కలిగే స్థితిగతులను గురించి శుకకాయ నివాసులైన వైశంపాయనుడు. యుగం చివరి దశలో ఏర్పడే ప్రకృతి మార్పులు, ఎటువంటి వారు ప్రళయాన్ని కూడా తట్టుకుని చిరంజీవులై జీవించగలరు" అనే అంశాలను గురించి ప్రశ్నించగా, దానికి సమాధానం ఇలా లభించింది.

**వైశంపాయన ఏకస్మిన్ దినేఽగాత్ మేరుపర్వతే ।**
**మహాలయైకశేషం తం మార్కండేయం సమాజితుమ్ ॥ 2**

వేదవ్యాసులవారి శిష్యుడైన వైశంపాయనుడు, ముకుంద మహర్షి కుమారుడు మార్కండేయుడు వంటివారు ప్రళయ కాలంలో కూడా అందరి మానవులవలె మృత్యువాతపడకుండా చిరంజీవులై నిలిచారు. వైశంపాయనుడు తత్వజ్ఞాన మహిమను తెలుసుకుని అమరత్వాన్ని పొందాడు. దేహం నశించేదే, కానీ శాశ్వతంగా నిలిచేది బ్రహ్మజ్ఞానం మాత్రమే. ఇటువంటి అమరత్వ వాదనను శివపార్వతుల చర్చల నుండి తెలుసుకున్న మహనీయులు ఒకనాడు మేరుపర్వతంపై కలుసుకొన్నారు.

**హర్షాన్వితావుభౌ నత్వాఽన్యోన్యం తావృషిసత్తమౌ ।**
**చర్చాయాం పరమార్థాయాం మార్కండేయం సపృష్టవాన్ ॥ 3**

ఆ మహనీయులిద్దరూ ఆనంద పరవశంతో కలుసుకుని, వందన, ప్రతివందనములతో పరమార్థ తత్వాన్ని చర్చించడం మొదలుపెట్టారు. ఆ సందర్భంలో వైశంపాయనుడు మార్కండేయునితో పలువిషయాలు చర్చించాడు.

యుగం ముగిసే సమయంలో సంభవించే మహా సంహారం లేదా మహా వినాశం. పాపపంకిలమైన జగత్తు, తన పాత రూపాన్ని విడిచి, క్రొత్త సృష్టికి నాంది పలకడమే బ్రహ్మదేవుని లీల. అట్టి సందర్భంలో తన మాయాలీలా విశేషంగా, దివ్యాత్మల గల ఋషులు, భక్తులు తమ తమ కర్మానుసారం చిరంజీవులై వెలుగొందుతారు. ఆ కోవకు చెందినవారే మార్కండేయుడు, ధృవుడు, నారదుడు, హనుమంతుడు, విభీషణుడు మొదలైనవారు. రామరావణ యుద్ధసమయంలో రావణుడు మరణించాడు, కానీ విభీషణుడు (రావణుని తమ్ముడు) తన సత్ప్రవర్తనతో రాముని అనుగ్రహం పొంది చిరంజీవుల కోవకు చెందినవాడయ్యాడు. మహాభారత యుద్ధసమయంలో కౌరవసైన్యం అంతరించి పోయినప్పటికీ, శ్రీకృష్ణపరమాత్ముని అనుగ్రహంతో, ధర్మవర్తనంతో పాండవులు చిరకాలం జీవించగలిగారు. అంటే సత్ప్రవర్తన, భగవద్భక్తి, లోకహితం అనే ఆదర్శ లక్షణాలు చిరంజీవులుగా నిలబెడతాయి అన్న భావనకు సంబంధించిన ప్రశ్నలే ఈ క్రింది విధంగా ప్రశ్నించాడు.

**ప్రజ్ఞాయుగసమారంభే మంత్రణాది మహత్వగా ।**
**విష్ణునారదయోర్మధ్యే జాతామంగళదానృణామ్ ॥ 4**

ఓ మహానుభావా! ప్రజ్ఞాయుగం ఆరంభ సమయంలో మహావిష్ణువు, నారదుల మధ్య జరిగిన సంభాషణ, మానవులకు మంగళకరమైనది. సన్మార్గాన్ని చూపే జ్ఞానాత్మక విషయాలను గురించి కొనసాగింది.

**యోజనానిశ్చితాసైకా నీతిర్నిర్ధారితాప్యభూత్ ।**
**ఇత్యేవజ్ఞాతం తత్రాగ్రే కిమభూత్ విదితం న హి ॥ 5**

ఈ విధమైన ఆలోచనల ద్వారా శ్రీ మహావిష్ణువును ప్రశ్నించడం ద్వారా నారదమహర్షి ముముక్షువుల (మోక్షాన్ని పొందగోరేవారు) కొరకు భూతకాలం, వర్తమానకాలం, భవిష్యత్ కాలానికి సంబంధించిన విశ్లేషణ చేసారు.

**త్రికాలజ్ఞో భవాన్తత్ర సందర్భే విశ్వమంగళే ।**
**అద్యావధిహ్యాయ భూత్కించ భావ్యగ్రే కృపయావద ॥ 6**

"త్రికాలజ్ఞులు (భూత, భవిష్యత్, వర్తమాన కాలముల స్థితిగతులను తెలిసినవారు) అయిన శ్రీమహావిష్ణువు, ఆయన లీలా విశేషములు తెలిసిన మునివరేణ్యులు కలిసి, జగత్తు యొక్క శ్రేయస్సును కాంక్షిస్తూ, గతంలో జరిగిన ఉపద్రవాలు, వర్తమాన కాలంలో జరుగుతున్న అరిష్టాలను, భవిష్యత్తులో జరుగబోయే వైపరీత్యాలను సమీక్షిస్తూ, లోకకల్యాణానికి మహనీయులు ఆచరించవలసిన కర్తవ్యాన్ని దయతో బోధించ ప్రార్థన" అంటూ వైశంపాయనుడు కోరగా, మార్కండేయుడు బదులు పలుక బోవుచున్నాడు.

*– పూజ్యగురుదేవుల వాఙ్మయం "ప్రజ్ఞోపనిషద్" నుండి*
*అనువాదం: సాధన నరసింహాచార్య*

**వినమ్రత అంటే ఆత్మన్యూనత కాదు**

# నరసింహ శతకం-నవనీత సూక్తం - 4

భక్తి అంటే భగవంతుణ్ణి త్రికరణ శుద్ధిగా సేవించడమేనన్న సత్యాన్ని వివరిస్తూ శేషప్ప కవి ఇలా వివరించారు. భగవంతుని పేరు వింటేనే పులకించిపోవాలి. భగవంతుని పూజలతో, కథలతో ఉత్సాహాన్ని పొందాలి. ఆ నామస్మరణతోనే కాలాన్ని వెచ్చించాలి. నిరంతరం భగవంతుని సేవలో నిమగ్నమైనప్పుడే మానవ జీవనం పరిపూర్ణమవుతుంది. అటువంటి అనన్య భక్తితో రుక్మిణీదేవి శ్రీకృష్ణుని ప్రేమను, హనుమంతుడు శ్రీరాముని వాత్సల్యాన్ని, ప్రహ్లాదుడు శ్రీమహావిష్ణువు అనుగ్రహాన్ని పొందారు. సాంసారిక వ్యామోహాలు, లౌకిక ఆకర్షణల వల్ల భక్తికి ఆటంకం ఏర్పడి, భక్తి కేవలం కష్టాలు తీరడం కోసమో, సంపదలు పొందాలనో పూజలు చేస్తూ, కేవలం కోరికలు తీరడం కొరకే 'భక్తి' అనే భావన నుండి ముందు బయటకు రావాలి అప్పుడే యదార్థమైన భక్తి అంటే ఏమిటో తెలుస్తుంది.

*సీ॥ గౌతమీస్నానానcగడుతేరుదామంటే*
*మొనసి చన్నీళ్ళలో మునగలేను*
*తీర్థయాత్రలచే గృ-తార్థుడౌదామంటే*
*బడలినేమంబునే నడవలేను*
*దానధర్మముల సద్గతిని జెందుదామంటే*
*ఘనముగా నా వద్ద ధనము లేదు*
*తపమాచరించి సార్థకత నొందుదమంటే*
*నిమిషమైన మనసు నిలువలేదు*

*తే॥ కష్టముల కోర్వ నా చేతగాదు, నిన్ను*
*స్మరణ చేసెద నా యథాశక్తి కొలది*
*భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస*
*దుష్ట సంహార! నరసింహ! దురితదూర ॥*

పుణ్య నదులలో స్నానమాచరించుట, పుణ్య తీర్థ క్షేత్రాలలో దైవదర్శనం చేయడం, దానధర్మముల ఆచరణ, తపస్సు ద్వారా పరిపూర్ణతను పొందడం అనే మార్గాలు సామాన్య భక్తునికి అనువుగా ఉండవు. ప్రతి మార్గానికి శారీరిక, ఆర్థిక స్థితులు అనుకూలించాలి. కానీ అన్నిటికంటే సులువైన, సాధ్యమైనటు వంటి పద్ధతి ఒక్కటే. అది భగవన్నామస్మరణ. ఆ నామస్మరణమే మోక్షదాయకం. యథాశక్తిగా (శక్తికొలది) నామస్మరణ ద్వారా భగవంతుని సేవలో తరించాలన్న జ్ఞానబోధ చేసారు. ఈ పద్యంలో శేషప్పకవి.

"ఏది మంచి?" "ఏది చెడు?" "ఏది చేయతగినది?" "ఏది చేయరాదు?" అనే అంశాలను శేషప్పకవి ఇలా వివరించారు.

*సీ॥ అర్థివాండ్రకు నీక - హాని చేయుటకంటె*
*తెంపుతో వసనాభిc దినుటమేలు*
*ఆడుబిడ్డల సొమ్ము - నపహరించుటకంటె*
*బండగట్టుక నూతc - బడుట మేలు*
*పరులకాంతులబట్టి - బల్మికూడుటకంటె*
*బడబాగ్ని కీలల - బడుటమేలు*
*బ్రతుకcజాలక దొంగ - పనులు చేయుటకంటె*
*కొంగుతో ముష్టెత్తుకొనుట మేలు*

*తే॥ జలజదలనేత్ర! నీ భక్త జనుల తోడ*
*జగడమాడుటకంటెను - చావుమేలు*
*భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస*
*దుష్ట సంహార! నరసింహ! దురితదూర ॥*

కష్టాలలో ఉన్న వారికి దానం చేయడం మంచిది. కానీ దానం చేయకపోగా, వారికి హాని కలిగించడం అతి నీచమైన పని. అంతకంటే విషం త్రాగి మరణించడం మేలు. అలాంటి వాళ్ళు బ్రతికి ఉన్నా, మరణించిన వారితోసమానం. ఆడపడుచులను ఆదుకోవడం అన్నదమ్ముల, కుటుంబసభ్యుల బాధ్యత. కానీ అలా చేయకుండా ఆడపడుచుల ధనాన్ని, ఆభరణాలను దొంగిలించడం అతి నికృష్టమైన పని. అటువంటి పని చేయడం కంటే బండ కట్టుకుని (మళ్ళీ తేలకుండా) బావిలో దూకి మరణించడమే మేలు. ఇతర స్త్రీలను మాతృ భావనతో గౌరవించడం మానవధర్మం, పురుష లక్షణం. అటువంటి ధర్మాన్ని, లక్షణాన్ని మర్చిపోయి బలవంతంగా అనుభవించాలన్న పైశాచిక ఆలోచనలతో బ్రతికే కన్నా, అగ్నిలో దూకి మరణించడం మేలు. ఏ పని చేయకుండా బద్ధకంతో, నిస్సిగ్గుతో బ్రతికే కంటే, దొంగతనం చేసి బ్రతికే కంటే భిక్షాటన చేసి బ్రతకడం మేలు. శక్తి, సమర్థత లేనప్పుడు యాచించడం సామాన్యునకు తగినది. భక్తితో నిన్ను సేవించేవారితో

**వినమ్రత మానవ జీవితానికి ఆభరణం వంటిది**

తగవులాడడం, భక్తులను కష్టపెట్టడం చేయడం దానవ (రాక్షస) ధర్మం. అటువంటి రాక్షస జన్మను పొందేకన్నా చావడం మేలు అంటూ మనిషిగా, ఆదర్శమానవునిగా ఎలా జీవించాలో పై పద్యంలో వివరించారు శేషప్ప కవి.

"చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు" అన్న భర్తృహరి సూక్తిని, "జీర్ణ మంగే సుభాషితమ్" (మంచి మాటలను వినేవారు లేనప్పుడు అని శరీరంలోనే ఉండిపోయి జీర్ణమవుతాయి) అన్న ఆర్యోక్తిని శేషప్పకవి తనదైన ప్రత్యేక శైలిలో, ఇలా వివరించారు కవి.

*సీ॥ గార్ధభంబునకేల కస్తూరి తిలకంబు*
*మర్కటంబునకేల మలయజంబు*
*శార్దూలమునకేల శర్కరాపూపంబు*
*సూకరంబునకేల చూతఫలము*
*మార్జాలమునకేల - మల్లె పువ్వులబంతి*
*గుడ్లగూబలకునేల - కుండలములు*
*మహిషంబునకేల - మంచి వస్త్రంబులు*
*బకసంతతికేల - పంజరంబు*

*తే॥ ద్రోహచింతన జేసెడు దుర్జనులకు*
*మధురమైననట్టి నీ నామ మంత్రమేల*
*భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస*
*దుష్ట సంహార! నరసింహ! దురితదూర ॥*

పాపములు చేయాలన్న తలంపుతో, దుష్ట ప్రవర్తనతో నిరంతరం ఇతరులకు ద్రోహం చేయాలనుకున్నవారు జంతు సమానులు. అంటే విచక్షణాజ్ఞానం లేనటువంటివారని కవి భావన. అటువంటి వారికి పరమపవిత్రమైన దైవనామస్మరణ విలువ ఏం తెలుస్తుంది? 'భక్తి' పరమార్థం ఏం తెలుసు? గాడిదకు కస్తూరిబొట్టు-దాని పరిమళం; కోతికి గంధం-దాని సౌరభం-పులికి అత్యంత మధురమైన అరిసెలు-బురదలో పొర్లాడే పందికి మామిడి పండు రుచి-పిల్లికి మల్లెల సువాసనలు-పగలు కళ్ళు కనిపించని గుడ్లగూబకు అందమైన చెవి రింగులు-దున్నపోతుకు క్రొత్త వస్త్రాలు-కొంగకు పంజరం విలువ-గొప్పదనం తెలియవు. అవి తెలుసుకొనే ప్రయత్నం చేయలేవు. అలాగే దుర్మార్గుడు మంచి ఆలోచనలు, మంచి పనుల పట్ల అవగాహనను కలిగి ఉండే ప్రయత్నం చేయడు. అందువల్ల దుర్జనుని మానాన వాడిని విడిచిపెట్టి, వాడి పాపానికి వాడే బాధ్యుడు అని వదిలివేయడం ఉత్తమం అంటూ ఎన్నో నైతిక విలువలను, ధర్మబోధనలను అందించిన శేషప్ప కవి చిరస్మరణీయుడు.

– సాధన నరసింహాచార్య

## భగవంతుని సహాయానికై ప్రార్థన అవసరం

*సంత్ వల్లభాచార్యుడు నివసించే గ్రామంలో ఆ గ్రామ మంగలి ఈశ్వరుని ప్రతిమను చాలా అశ్రద్ధతో చూస్తుండేవాడు. సంత్ ఆ మంగలి దుకాణ మార్గంలో వెళ్తున్నప్పుడల్లా, సంత్ వినాలనే కోరికతో ఆ మంగలి ఉచ్ఛస్వరంతో ఇలా అనేవాడు "ప్రపంచంలో భగవంతుడనేవాడు లేడు! ఉన్నట్లయితే ఇంతమంది దుఃఖితులు ఈ ప్రపంచంలో ఎందుకుంటారు? మంగలి మాటలకు జవాబుగా సంత్ నవ్వుతూ వెళ్ళేవాడు!*

*ఒకరోజు మంగలి ఒకనికి క్షవరం చేస్తున్నాడు. ఒకరిద్దరు, దుకాణం వెలుపలవారి వంతు రాకకై నిరీక్షిస్తూ ఉన్నారు. అదే సమయంలో మంగలి వినేలా ఇలా అన్నాడు - "ఈ గ్రామంలో మంగలి ఉన్నట్లు లేదు, లేనిచో ఇచ్చట ఉన్న వారి తలజుట్టు ఇంతగా ఎందుకు పెరిగిపోయింది?" దీనికి మంగలి కోపంతో ఇలా అన్నాడు "మహరాజ్! మంగలినైతేనేనే! తలజుట్టు తగ్గించుకొనుటకై వారు నా వద్దకు రానప్పుడు నేను వారి జుట్టు ఎలా తగ్గించగలను?" అప్పుడు సంత్ వల్లభాచార్యుడు ఇలా పలికాడు. "అదే రీతిలో కుమారా! దుఃఖిత జనులు కూడా ఈశ్వరుని చెంతకు పోనిచో, వారి దుఃఖాలు ఎలా పోతాయి, వారికి ఏ రీతిగా భగవంతుని సహాయమందుతుంది" ఈశ్వరుడు అందరికీ సహాయం చేయుటకు సంసిద్ధంగా ఉన్నాడు, కాని ఆయనను ప్రార్థించవలసి ఉన్నది.*

*– అఖండజ్యోతి, ఆగస్టు 2013*
*అనువాదం: ఎ. వేణుగోపాలరెడ్డి*

**హంసతూలికా తల్పమును కొనగలము కానీ సుఖనిద్రను కొనలేము**

# అందరికి సుఖము-శాంతి-సమృద్ధి కొరకు సామూహిక గాయత్రీ జపం

**ఓం భూర్భువః స్వః తత్స వితుర్వరేణ్యం భర్గో దేవస్య**
**ధీమహి ధియో యోనః ప్రచోదయాత్**

ఈనాడు ప్రపంచంలో ఎటు చూసినా విపత్కర పరస్థితులు, అభద్రతా చోటు చేసుకున్నాయి. ప్రకృతి వైపరీత్యాలతో పాటు మానవ నిర్మిత సంకటాలు మానవ సమాజాన్ని, మానవ జీవితాన్ని కకావికలు గావిస్తూ, సుఖశాంతులు లేకుండా చేస్తున్నాయి.

1984 ప్రాంతంలో ప్రపంచస్థితిని గురించి పూజ్య గురుదేవులు ఈ విధంగా చెప్పారు. "ఈనాడు విశ్వాన్ని ఆవరించియున్న విషమ పరిస్థితులను తొలగించి వేయగలిగే సామర్థ్యాన్ని సమకూర్చుకుంటున్నాను. అన్ని క్షేత్రాల నుండి మహావినాశనం జరిగితీరుతుంది అనే ఘోషణ వినిపించుచున్నది. సర్వనాశనం- ఏ క్షణంలోనైనా జరుగవచ్చునని అంటున్నారు."

"కాని ఇందరి భవిష్యవాణులకు విరుద్ధంగా నేను ఈ ప్రపంచం కొనసాగుతుంది, రాబోవు రోజులు ఇంతకన్నా చాలా బాగుంటాయి అని ఘంటాపథంగా చెప్తున్నాను - దీనిలో అభిరుచి ఉన్న వారంతా నా భవిష్యవాణిని గుర్తుంచుకోండి. మూడవ ప్రపంచ యుద్ధం జరుగదు. భవిష్యత్తులో యుద్ధాలు ఎక్కడ జరిగినా అవి ఒక క్షేత్రానికే పరిమితమవుతాయి."

"రెండవ పక్షంగా సృజనాత్మకమైన గాయత్రీ పరివార్‌ను నేను ఏర్పాటు చేయుట జరిగింది. దీనిలో చాలామంది చిన్నవాళ్ళుగా, అల్పజ్ఞానులుగా కనిపించవచ్చు. వారి యోగ్యత, సామర్థ్యం స్వల్పమైనదిగా మీకు కనిపించవచ్చు. కాని రానున్న కాలంలో ఈ మొగ్గలే వికసించి తమ సౌరభంతో సంపూర్ణ విశ్వాన్ని సుగంధమయం గావిస్తాయి. చిన్నవారైనప్పటికి, వారిపై ఆశలు పెట్టుకొనవచ్చు."

నేడు యావత్తు విశ్వంలో ప్రాణశక్తి అభావమున్నది. దీనితో అన్నీ ఉండి కూడా మానవజాతి శక్తిహీనంగా తయారైంది. శక్తి ఉపాసనను మరచాము, శక్తి మనలను వీడిపోయింది. ఆ తల్లి మన హృదయాల నుండి, మస్తిష్కం నుండి, మన చేతల నుండి అదృశ్యమైంది. సమాజంలో ధర్మము, రాజనీతి అడుగంటాయి. ఆత్మబలం సన్నగిల్లింది. భక్తి ఉంది కానీ, శక్తి అనే ఇంధనం లేకున్నది. ఇదే నేడు సమస్త మానవాళికి కావలసి ఉన్నది.

నిష్ఠతో కూడిన శ్రమ అత్యధిక ఫలితాన్ని అందిస్తుంది. గతంలో పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య ఈ క్రింద ఉదహరించిన విపత్తులను అధిగమించుటకై గాయత్రీ పరివార్‌కు కొన్ని నిర్దిష్ట సూచనలతో మార్గదర్శనం గావించి సత్ఫలితాలను రాబట్టారు.

**కొన్ని ఉదాహరణలు:** దీనిలో మొదటిది 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం, బంగ్లాదేశ్ ఆవిర్భావం జరిగిన సమయం-పాకిస్థాన్‌కు బాసటగా అమెరికా తన సప్తమనౌకా దళాన్ని మన దేశ తీరప్రాంతానికి చేర్చింది. దీనితో అణు యుద్ధపు అంచులకు ఇరుదేశాలు చేరుకున్న పరిస్థితి నెలకొన్నది. దీనిని నివారించి యుద్ధాన్ని నిలుపు చేయుటకై పూజ్యగురుదేవుల ఆదేశానుసారం దేశములోని యావత్ గాయత్రీ పరివార్ ఒక సామూహిక మహా పురశ్చరణ చేసింది. సభ్యులందరు పూజ్య గురుదేవుల సారథ్యంలో ప్రతిరోజు 24 లక్షల గాయత్రీ మంత్ర జపం చేసే సాధనా క్రమాన్ని చేపట్టారు. దీనితో యుద్ధంలో భారత్ విజేతగా నిలచింది, బంగ్లాదేశ్ ఒక నూతన దేశంగా అవతరించింది.

అట్లే రెండవ సంఘటనగా అమెరికా ప్రయోగించిన ఒక ఉపగ్రహ శకలాలు (స్కైలాబ్) భారతదేశం దాని చుట్టుప్రక్కలనున్న జనావాసప్రాంతాలపై కూలి, పెను ప్రాణనష్టానికి ఆస్తి నష్టానికి కారణం కానున్న సమయమది. యావత్ ప్రపంచం భయభ్రాంతులకులోనై ఉన్నది. ఈ విపత్తును నివారించుటకై పూజ్యగురుదేవుల మార్గదర్శనంలో గాయత్రీ పరివార్ సామూహిక గాయత్రీ పురశ్చరణలు చేశారు. దీనితో స్కైలాబ్ ఆస్ట్రేలియా సమీపంలోని సముద్రంలో పడింది. ఈ విపత్తు నుండి మానవాళి పై రీతిగా బయటపడింది.

**ఫైలిన్ తుఫాను యొక్క నష్టాన్ని తగ్గించుటకై ఆధ్యాత్మిక ఉపాయము:**

లక్షలాది గాయత్రీ పరివార్ యొక్క సామూహిక సాధన: ఒడిషా, ఆంధ్రప్రదేశ్ మరియు పశ్చిమబెంగాల్, బంగాళాఖాత సముద్రతీర ప్రాంత రాష్ట్రాలను ఫైలిన్ తుఫాను తాకనున్నదనే

**పుస్తకమును కొనగలము కానీ జ్ఞానమును కొనలేము**

వార్త తెలియగానే ఆయా ప్రాంత ప్రజానీకానికి కలుగబోయెడి ధన, ప్రాణ నష్టాలను, అతి కనిష్టస్థాయిలోనుంచుటకై గాయత్రీ పరివార్ పూజ్యగురుదేవులందించిన ఆధ్యాత్మిక ఉపాయాన్ని అనుసరించుట జరిగింది. అంతర్జాతీయ ముఖ్య కార్యాలయం, శాంతికుంజ్‌తో చేతులు కలిపి, దేశవ్యాప్తంగానున్న వేలాది గాయత్రీ ప్రజ్ఞాపీఠాలు, సంస్థానాలు సాయంత్రం 5 గం॥ల నుండి 6.30 గం॥ల వరకు సామూహిక గాయత్రీ మంత్ర జపాన్ని చేశారు. దీనిని మున్ముందు కూడా కొనసాగించ నున్నారు. అనేకమార్లు గతంలో సమాజానికి విపత్తులు సంభవించిన సమయంలో, గాయత్రీ పరివార్, సామూహిక జపాలను, తపస్సును యజ్ఞానుష్ఠానాలను చేసి మంచి సఫలతలను సాధించారు.

ప్రస్తుతం మన దేశంలో రాజకీయ అనిశ్చితి, అభద్రతా భావం, అవినీతి, సమాజానికి మార్గదర్శనాన్ని అందించగల సమర్థ నాయకత్వ లోపం, అనైక్యత, దుర్నీతి, దుష్టచింతన, కరడుగట్టిన స్వార్థం, మితిమీరిన పదవీ వ్యామోహం రాజ్య మేలుతున్నాయి. వీనిని చక్కదిద్దుటకై తిరిగి దేశంలో సుఖ శాంతులను, చట్టబద్ధతను నెలకొల్పుటకై పూజ్య గురుదేవులు అందించిన మార్గనిర్దేశనాన్ని తిరిగి అనుసరించవలసిన అత్యవసర పరిస్థితులు దేశమంతటా, మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెలకొని ఉన్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితుల నివారణకు మన గాయత్రీ పరివార్ సోదర సోదరీ మణులంతా సామూహిక జపమును ఈ క్రింది వేళలలో కనీసం ఏదో ఒక సమయంలో చేయవలసినదిగా ప్రార్థన.

ఉదయం 7 గం॥ల నుండి 8 గం॥ల వరకు
మధ్యాహ్నం 12 గం॥ల నుండి 1 గం॥ల వరకు
సాయంత్రం 5 గం॥ల నుండి 6.30 గం॥ల వరకు
రాత్రి 8.30 గం॥ల నుండి 9.30॥ల వరకు

గాయత్రీ సామూహిక జప సాధన చేపట్టి, దేశ సౌభాగ్యానికి తద్వారా మన సౌభాగ్యానికి చేయూతనందించవలసినదిగా కోరుచున్నాము. మీరు చేస్తున్న కార్యక్రమాల వివరణ తెలుపవలసినదిగా కోరుతున్నాము.

ఇట్లు
**అశ్విని సుబ్బారావు**
ప్రధాన సంచాలకులు
దక్షిణ భారత గాయత్రీ పరివార్

# వార్తలు

## హైదరాబాదు గాయత్రీ చేతనా కేంద్రంలో

దేవీ నవరాత్రులు పురస్కరించుకొని గాయత్రీ జపం అనుష్ఠానాలను 5 అక్టోబరు 2013 నుండి 13 అక్టోబరు వరకు చేతనా కేంద్రమునకు అనుసంధానమై దాదాపు 25 మంది చేయుట జరిగింది. 11 అక్టోబరు 2013న 1008 దీపాలతో ఓంకారం, శివలింగం మరియు స్వస్తిక్ రేఖా చిత్రాలను అలంకరించి 60 మందితో రాత్రి 7 గంటలకు దీపయజ్ఞాన్ని నిర్వహించారు. 13 అక్టోబరు ఆదివారము అనుష్ఠాన పూర్ణాహుతిగా పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది పాల్గొన్నారు. రూ. 2500/- విలువ గల పూజ్య గురుదేవుల సాహిత్యాన్ని విక్రయించుట జరిగింది. నవరాత్రుల సందర్భంగా చేతనా కేంద్రము దాదాపు రూ. 9000/- ల సాహిత్యాన్ని విక్రయించింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులైన శ్రీ అశ్విని సుబ్బారావుగారు ప్రవచిస్తూ నవయుగ నిర్మాణానికై పూజ్యగురుదేవుల సాహిత్యాన్ని ఇంటింటికి చేర్చవలసినదిగా పరివార్ సభ్యులను కోరారు. అట్లే పరివార్ సభ్యులంతా తగిన సమయదానాన్ని అంశదానాలనందించి, చేతనా కేంద్ర కార్య కలాపాలను బలోపేతం గావించుకోవలసిందిగా ప్రబోధించిరి.

శ్రీమతి అనసూయమ్మ, శ్రీమతి సుబ్బులుగార్లు యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీమతి సుశీలమ్మ, కుమారి సంగీత గార్లు హాజరైన వారందరికి తీర్థప్రసాదాలనందించి, సంతుష్టుల గావించారు.

## విశాఖపట్నంలో

19.09.2013 పరమ వందనీయ మాతా భగవతి దేవిశర్మ మహాప్రయాణదిన (వర్ధంతి) సందర్భమున విశాఖపట్నం గాయత్రీ పరివార్ సభ్యులు 1500 బ్రెడ్స్‌ను, బిస్కెట్ పాకెట్లను కింగ్ జార్జి హాస్పిటల్, విక్టోరియా హాస్పిటల్‌లోని పేదలకు (poor patients) పంపిణీ చేశారు. వెంకోజిపాలెంలోని వికలాంగ కేంద్రానికి 100 కిలోల బియ్యాన్ని అందించారు. ఈ కార్యక్రమం శ్రీ జగదీష్ అసోపా, శ్రీ ధన్‌జీభాయ్ పటేల్, శ్రీ సంజయ్‌సింగ్ గార్ల సౌజన్యంతో నిర్వహించబడింది.

04.10.2013 పితృమాస సందర్భముగా గాయత్రీ చేతనా కేంద్రం విశాఖపట్నం వారు సామూహిక శ్రాద్ధ తర్పణాల కార్యక్రమం శ్రీ రాంనివాస్ గుప్త, శ్రీ అవతారం రాజు గార్లచే నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో 32 మంది పాల్గొన్నారు.

**కళ్ళజోడును కొనగలము కానీ కంటిచూపును కొనలేము**

# సికింద్రాబాదు పాతబోయినపల్లిలోని గాయత్రీ జ్ఞానమందిర ప్రారంభ వేడుకలపై నివేదిక

2013, సెప్టెంబర్ 22వ తేది ఆదివారము సికింద్రాబాదు పాతబోయినపల్లిలోని స్వర్ణధామ నగర్‌లో (మిలటరీ డైరీఫామ్ ఎదురుగా) నూతనంగా నిర్మింపబడి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడిన గాయత్రీ మందిరానికి పూజ్యులు, ఆదరణీయ డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్, గాయత్రీ తీర్థ్, శాంతికుంజ్, హరిద్వార్, దక్షిణ భారతదేశ విభాగ ప్రధాన సంచాలకుల పవిత్ర హస్తాల మీదుగా ప్రారంభింపబడినది.

పరమపూజ్యులు, గురుసమానులు, ఆంధ్రప్రదేశ్‌లో గాయత్రీపరివార్ వ్యవస్థాపకులు, వేలాది గాయత్రీ పరివార్ పరిజనులకు స్ఫూర్తిప్రదాత – "డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు గారు వారి దివ్యాశీస్సులను అందించారు.

**మందిర వివరములు :** 250 చ.గ. విస్తీర్ణంలో పశ్చిమాభి ముఖంగా 2 అంతస్తుల భవనం యొక్క క్రింది భాగంలో భోజనశాల, కార్యాలయం, పుస్తక విక్రయశాల, పూర్తి సమయదానీల (కార్యకర్తల) నివాసం ఏర్పాటు.

మొదటి అంతస్తులో పద్మదళాలపై సుఖాసీనులైన సర్వాలంకారభూషిత, మనోరంజని, మందస్మిత గాయత్రీ మాత, పరమపూజ్య గురుదేవులు, పరమవందనీయ మాతాజీల చిత్తరువులతో కూడిన జ్ఞానమందిరము కన్నులు మిరుమిట్లు కొల్పుచూ, ధవళకాంతులీనుచున్న, పద్మదళాలపై ఆసీనులైన గాయత్రీమాత, గురుదేవులు మరియు మాతాజీల చిత్తరువుల దర్శనంతో పరిజనుల మేను పులకించిపోయింది.

రెండవ అంతస్తులో సువిశాలమైన యజ్ఞశాల.

**కార్యక్రమ వివరణ :**

2013, సెప్టెంబర్ 21 శనివారము 108 కలశాలతో దాదాపు 200 మంది నారీమణులు, బాలికలతో బారులు తీరిన భవ్య కలశయాత్ర, మంగళ వాయిద్యాలతో, సువర్ణ కాంతులీనుతూ, స్వర్ణధామనగర వీధులలో నేత్రానందంగా సాగింది. దీనికి పులకించిన ప్రకృతిమాత, వాయుదేవత చల్లని మలయమారుతాన్ని అందించగా, మంగళవాయిద్యాల నుండి జాలువారెడి భక్తిగీతాలనాలకిస్తూ గాయత్రీ పరివార్ కలశ యాత్ర కన్నుల పండువగా సాగింది. తదుపరి యజ్ఞశాలలో పవిత్రకలశ జలఅభిశంసనతో మంగళహారతిలో ఆ రోజు కార్యక్రమం ముగిసింది.

2013, సెప్టెంబర్ 22 ఆదివారము 24 కుండములతో గాయత్రీ మహాయజ్ఞము సువిశాల ప్రాంగణములో నేత్ర పర్వంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దాదాపు 700 మంది యజ్ఞములో పాలుపంచుకొన్నారు.

యజ్ఞశాల వేదికపై నుండి గాయత్రీ పరివార్ శాంతికుంజ్ ప్రతినిధి పూజ్యులు డా॥ బ్రిజ్‌మోహన్‌గౌర్ ప్రసంగిస్తూ నేటి సమాజ దురవస్థకు కారణం మనిషిలోని పశుప్రవృత్తి, రాక్షస ప్రవృత్తులేనని వివరించారు. వీని నుండి బయటపడుటకై, మనలో దైవీప్రవృత్తుల పెంపొందించుకొనుటకై నిత్యము కనీసము 3 మాలల గాయత్రీజపం చేయవలసినదిగా ఆహుతులకు మార్గనిర్దేశనం చేశారు. ఆనాడు స్వర్ణధామనగర్ నిజంగా సురలధామంగా మారుతుంది, భూమిపై స్వర్గావతరణ జరుగుతుందని అన్నారు.

ఆంధ్రప్రదేశ్ గాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకులు మరియు దక్షిణ భారత గాయత్రీ పరివార్ సంచాలకులైన శ్రీ అశ్విని సుబ్బారావుగారు ప్రవచిస్తూ ఇలా అన్నారు "సికింద్రాబాదు నగరంలో గాయత్రీ మందిరంలేని లోటును గాయత్రీ జ్ఞాన మందిరం తీర్చింది. ఇది ఎంతో సంతోషదాయకం. నేటి మానవసమాజం ఎదుర్కొనుచున్న ఈతి బాధలన్నింటికి మూలం అజ్ఞానమే. ఈ అజ్ఞానాన్ని తొలగించుకోవాలన్నచో మనిషి జ్ఞానసముపార్జనకు ప్రయత్నించాలి. దీనికి గాయత్రీ జపము, స్వాధ్యాయం, అత్యుత్తమ సాధనలు, వీని సాధనకు గాయత్రీ జ్ఞానమందిరం, అత్యంత ఉపయోగకరమైనది. అందుబాటులోనున్న దీనిని చక్కగా వినియోగించుకుంటూ సదాలోచన సంపన్నతతో జీవితాలను ధన్యం చేసికొనవలసినదిగా కోరుచున్నాను అని ప్రబోధించారు.

అటుపిమ్మట 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞము ఆదరణీయ శ్రీ పరమానంద ద్వివేది, హీర్‌సింగ్ రాజ్‌పురోహిత్‌ల సారథ్యంలో వీనుల విందుగా, కన్నుల పండువగా, అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహింపబడింది. 700 మందికి పైగా యజ్ఞములో పాలుపంచుకొన్నారు. యజ్ఞానంతరం, యావన్మంది గాయత్రీ జ్ఞానమందిర ప్రారంభోత్సవానికై మందిరం వద్దకు చేరుకున్నారు.

**సమయాన్ని తెలిపే గడియారమును కొనగలము కానీ సమయాన్ని కొనలేము**

సాయంత్రం పరిజనులు సేదతీరుటకై భక్తిగీతాల లలిత సంగీత కచేరి ఏర్పాటు చేయుట జరిగింది. కలియుగ దైవం ఏడు కొండల వెంకటేశ్వరుని స్తుతిలో ప్రారంభమై, గీతాకారుడైన శ్రీకృష్ణుని స్తుతితో ముగించుట జరిగింది.

23వ తేది ఉదయం 6 గం॥ల నుండి సాయంత్రం 6 గం॥ల వరకు మందిరంలో అఖండ జపం జరిగింది. ఒక వెయ్యి ఎనిమిది (1008) దీపాలతో గాయత్రీ దీపయజ్ఞం జరిగింది. "ఓంకారం, శివలింగం మరియు కాగడా" రేఖా చిత్రాలను రెండు వరుసల దీపాలతో అలంకరించి, 700 మంది మహిళామణులు, ఆబాలగోపాలం వెలిగించిరి. ఆ దీపపు వెలుగులు సువర్ణకాంతులీనగా ఇలపై స్వర్గావతరణ జరిగిన భావనలో పరిజనులు పులకించిపోయారు.

పై కార్యక్రమంలో సమయదానులైన శ్రీ విక్రమ్, శ్రీమతి దుర్గామల్లిఖార్జున దంపతులు, శ్రీ ప్యారేలాల్ మరియు శ్రీపూల్‌సింగ్ మున్నగువారు పాల్గొన్నారు.

స్వర్ణధామనగర్ కాలని వ్యవస్థాపకులైన శ్రీ రాఘవేంద్రరావు గారు, సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొని సేవలందించెడి కృష్ణారెడ్డి, నిజజీవితంలో వియ్యంకులైన శ్రీ లింగారెడ్డిగార్లు మిత్రులు, తదితర కాలనీ ప్రముఖులు అత్యంత ఉత్సాహంతో పాల్గొని కార్యక్రమ విజయానికి తమ తోడ్పాటునందించారు. అన్నింటికన్నా ప్రధానమైన విషయం గాయత్రీ జ్ఞానమందిర శంఖుస్థాపన రోజు నుండి ప్రారంభం రోజు వరకు అహర్నిశలు దాని నిర్మాణములో శ్రమించిన శ్రీ వెంకట్రావుగారు మరియు మందిర ఆర్కిటెక్ట్ సురేష్‌గార్లు అత్యంత అభినందనీయులు.

మందిర నిర్మాణ సంకల్ప సూత్రధారులైన శ్రీయుతులు రంగారావు వాణి దంపతులకు అభినందనలు.

*– గాయత్రీ చేతనా కేంద్రం విలేఖరి*

---

## గాయత్రీ పరివార్ - 2014 వార్షిక క్యాలండర్

గత నాలుగు సంవత్సరముల నుండి గాయత్రీ పరివార్ వార్షిక క్యాలండర్‌ను ఆదరించి, పరమపూజ్య గురుదేవులు మరియు పరమ వందనీయ మాతాజీల వాణిని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నలుచెరగులా మరియు వివిధ రాష్ట్రాలలోనున్న తెలుగు వారికి అందించుటలో మీరంతా అందించుచున్న సహాయసహకారాలకు, ప్రోత్సాహానికి, గాయత్రీ చేతనా కేంద్రము తొలుత మీకు ధన్యవాదములు తెలుపుకొనుచున్నది.

ఈ సంవత్సరము 2014 వార్షిక క్యాలండర్‌ను మరింత సందేశాత్మకంగా మనందరి హృదయాల కదిలించి, మన ఆలోచనల మధింపజేసి తద్వారా లభించెడి నవనీతాన్ని పూజ్య గురుయుగ్మం ఆశయాలకు అనుగుణంగా సమకాలీన సమాజానికి అందించి, సత్యయుగ నిర్మాణానికై చేసెడి కృషిలో మనలను మరియొక ముందడుగు వేయించుటలో మార్గదర్శనం ఇవ్వగలదని మా ప్రగాఢ విశ్వాసం.

1) డిసెంబరు 2013, రెండవ వారాంతానికి కొనుగోలుదారులందరికి చేర్చబడుతుంది.
2) ఎప్పటిలాగే మీ పేర్లను / మీ సంస్థల పేర్లను గాని మీ కోరిక మేరకు ముద్రించి అందించగలం.
3) మీ పేర్లు ముద్రించి అందించుటకు కనీసం 400 కాపీలను ఆర్డరు చేయవలెను.
4) 50 కాపీలకు తగ్గకుండా కొనుగోలు ఆర్డరు ఇచ్చినవారికి పోస్టు ద్వారా పంపబడతాయి.
5) కేవలం సద్వాక్యాలతో కూడిన క్యాలండర్ కాపీ ధర రూ. 18/-. పేరుతో ముద్రించిన కాపీ ధర రూ. 20/-. రవాణా ఖర్చులు అదనం.

మీకు సమీపంలోనున్న గాయత్రీ పరివార్ ప్రజ్ఞాపీఠాన్ని లేక గాయత్రీ మహిళా మండలిని, గాయత్రీ శక్తి పీఠాన్ని, విడి కాపీలకు సంప్రదించి, మీ కొనుగోలు ఆర్డరును నమోదు చేసికొన మనవి.

**ఇతర వివరాలకు సంప్రదించండి :**

**గాయత్రీ చేతనాకేంద్రం, అశ్విని హౌస్ దగ్గర, హెచ్.పి.రోడ్, మూసాపేట, హైదరాబాద్ - 500 018.**

**ఫోన్: 040-23700722, సెల్: 9949111175**

---

**సౌందర్య సాధనములను కొనగలము కానీ సౌందర్యాన్ని కొనలేము**